సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 248

మంగళవారం 29-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'




6 బంతుల్లో 7 సిక్స్‌లు

దేశవాళీ వన్డే టోర్నీలో రుతురాజ్ గైక్వాడ్ ప్రపంచ రికార్డు - 12లో



వృద్ధి 7 శాతమే!

2022-23 భారత్ వృద్ధి రేటు అంచనాలకు ఎస్‌అండ్‌పీ కోత - 13లో



ఏమిటీ జాప్యం?

జడ్జీల నియామకానికి కొలీజియం చేసిన సిఫార్సులపై జాప్యమెందుకు చేస్తున్నారని కేంద్రంపై సుప్రీం అసంతృప్తి వ్యక్తం చేసింది.

వివరాలు 6లో



బాధపడితే క్షమించండి

దుస్తులు ధరించకపోయినా మహిళలు అందంగా ఉంటారంటూ చేసిన వ్యాఖ్యలపై రాందేవ్ బాబా క్షమాపణలు కోరారు.

వివరాలు 6లో



సినిమా విలువ తెలిసింది

ఇఫీ వేడుకల్లో మెగాస్టార్ చిరంజీవి 'ఇండియన్ ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని అందుకున్నారు.

వివరాలు 12లో



భర్తను చంపి.. పది ముక్కలు చేసి..

ఢిల్లీలో ఓ మహిళ కుమారుడితో కలిసి రెండో భర్తను హతమార్చింది. శవాన్ని పది ముక్కలు చేసి వేర్వేరు చోట్ల పాతిపెట్టారు.

వివరాలు 6లో

హైకోర్టు 'గడువుల'పై సుప్రీం స్టే

ఆరు నెలల్లో రాజధాని నిర్మాణం సాధ్యమా?

హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు అసంబద్ధం... ఆమోదయోగ్యం కాదు

- అన్ని వసతులతో నెలరోజుల్లో అభివృద్ధి చేయటం సాధ్యమా?
- ఇలాంటి ఆదేశాలివ్వటానికి హైకోర్టుకున్న నైపుణ్యమేంటి?
- హైకోర్టు ఏమైనా టౌన్ ప్లానరా? చీఫ్ ఇంజినీరా?
- ఆంధ్రప్రదేశ్‌లో కార్యనిర్వాహక విధులు హైకోర్టుకెందుకు?
- హైకోర్టే ప్రభుత్వమైతే కేబినెట్ ఎందుకు? ప్రజా ప్రతినిధులెందుకు?
- అభివృద్ధి ఎలా చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కాదా?
- అమరావతి, విశాఖపట్నం, కర్నూలు మధ్య దూరమెంత?
- వీటి దూరాన్ని బట్టి చూస్తే వికేంద్రీకరణలానే ఉంది కదా?
- జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం వ్యాఖ్యలు
- పలు రాష్ట్రాల్లో వికేంద్రీకరణను ప్రస్తావించిన న్యాయమూర్తులు
- హైకోర్టు తీర్పులో పలు అంశాలపై స్టే... కేంద్రం, ప్రతివాదులకు నోటీసు
- జనవరి 31న అన్ని అంశాలూ విచారిస్తామన్న సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని ఆరు నెలల్లో నిర్మించి, అభివృద్ధి చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు నిలిపేసింది. అలాగే రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర ప్రాథమిక మౌలిక సదుపాయాలతో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలన్న ఆదేశాన్ని కూడా సుప్రీం కోర్టు నిలిపేసింది. అంతేకాక అన్ని మౌలిక సదుపాయాలతో నివాసయోగ్యమైన రీతిలో ప్లాట్లను అభివృద్ధి చేసి వాటిని మూడు నెలల్లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన భూ యజమానులకు అప్పగించాలన్న ఆదేశాన్ని సైతం సుప్రీంకోర్టు స్టే చేసింది. ఈ మొత్తం

మిగతా 3వ పేజీలో ▶

> రాజధాని ఫలానా ప్రాంతంలోనే ఉండాలని ఆదేశించే అధికారం న్యాయస్థానానికి లేదు. అది ప్రభుత్వ పరిధిలోని అంశం. ఇలాంటి వ్యవహారాల్లో కూడా కోర్టులు జోక్యం చేసుకుంటుంటే, ఇక ప్రజా ప్రతినిధులెందుకు? మంత్రి వర్గం ఎందుకున్నట్లు?
>
> - సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోసెఫ్, జస్టిస్ నాగరత్నం ధర్మాసనం

పంట నష్ట పరిహారం, పెట్టుబడి రాయితీ చెక్కును రైతులకు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్



మేలు.. చూడండి

గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడాను గమనించండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఎవరి హయాంలో ఎంత మేలు జరిగిందో ఆలోచించండి
- రుణమాఫీ పేరుతో అన్నదాతలను నిలువునా ముంచిన చంద్రబాబు
- రూ.87,612 కోట్లు మాఫీ చేస్తానంటూ నయవంచన..
- చివరకు ఇచ్చింది రూ.15 వేల కోట్లే.. అదికూడా సున్నా వడ్డీ పథకాన్ని ఎగ్గొట్టి
- ఇప్పుడు ఒక్క రైతు భరోసా రూపంలోనే మూడున్నరేళ్లలో రూ.25,971 కోట్లు సాయం
- క్రమం తప్పకుండా సున్నా వడ్డీ రాయితీ.. సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ
- రైతులపై పైసా భారం పడకుండా పంటల బీమా.. మళ్లీ ఆ సీజన్ రాకముందే పరిహారం చెల్లింపు
- గత సర్కారు బకాయిలను సైతం చెల్లించి అండగా నిలిచాం
- ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేస్తున్నాం
- మంచి చేసే ప్రభుత్వానికి తోడుగా, అండగా నిలవండి
- వరుసగా మూడో ఏడాది సున్నా వడ్డీ రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీ అమలు
- 8.68 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.200 కోట్లు జమ చేసిన సీఎం వైఎస్ జగన్

2లో

న్యూస్‌రీల్

పచ్చి కొబ్బరితో పాలు.. ఆయిల్!



డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరుకు చెందిన రైతు గుత్తుల ధర్మరాజు కొబ్బరి పాలు, వర్జిన్ కొబ్బరి నూనె ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు కొబ్బరి పాలు, వర్జిన్ నూనె ప్రయోజనాలను వివరిస్తూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

వివరాలు 11లో ▶

ఏపీకి 630 పీజీ వైద్యసీట్లు



రాష్ట్రంలో పీజీ వైద్యసీట్ల పంట పండింది. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ప్రభుత్వం ఒకేసారి 630 పీజీ వైద్యసీట్లను తీసుకొచ్చింది. ఇందులో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్.. ఇలా సుమారు 18 విభాగాలకు సంబంధించిన పీజీ వైద్య సీట్లు ఉన్నాయి. అత్యధికంగా ఆంధ్రా మెడికల్ కళాశాలకు 128 సీట్లు వచ్చాయి.

వివరాలు 14లో ▶

'సంకల్ప సిద్ధి' కేసులో ఐదుగురి అరెస్ట్



సంకల్ప సిద్ధి మనీ సర్క్యులేషన్ స్కీం, మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాల కేసులో ఐదుగురు ప్రధాన నిందితులను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ సంస్థకు చెందిన ఐదు బ్యాంకు ఖాతాలను, 14 ప్రాంతాల్లోని ఆస్తులను, డాక్యుమెంట్‌లను సీజ్ చేశారు.

వివరాలు 14లో ▶

రాష్ట్రంలో రూ.400 కోట్ల 'ఇంధన' పెట్టుబడులు

14 ఇంధన సామర్థ్య ప్రాజెక్టులతో దేశంలోనే అగ్రగామిగా ఏపీ

- దేశవ్యాప్తంగా 73 ప్రాజెక్టులకు రూ.2,500 కోట్లు పెట్టుబడుల అంచనా
- ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో జాబితా విడుదల
- ప్రాజెక్టులకు రుణాల కోసం 'అదితి' పోర్టల్ ప్రారంభించిన బీఈఈ
- ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సులతో ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్



ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల జాబితాతో బీఈఈ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అశోక్, బీఈఈ డైరెక్టర్ వినీత, ఏపీఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పరిశ్రమల్లో రూ.400 కోట్ల ఇంధన సామర్థ్య ప్రాజెక్టులు రానున్నాయి. పారిశ్రామిక రంగంలో ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు అవసరమైన పెట్టుబడులను సులభంగా అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో పరిశ్రమలు, ఆర్థికసంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు దేశంలో తొలిసారిగా పెట్టుబడుల సదస్సులకు రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చేసింది. వరుసగా రెండేళ్లు విశాఖపట్నంలో రాష్ట్ర ఇంధన శాఖకు చెందిన ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఈ పెట్టుబడుల సదస్సులు నిర్వహించింది. ఈ సదస్సులు ఆదర్శంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) మరి కొన్ని రాష్ట్రాల్లో ఈ తరహా సదస్సులు ఏర్పాటు చేసింది. పెట్టుబడిదారులు, పరిశ్రమల మధ్య సమన్వయం కోసం కొద్దిరోజుల కిందట ఒక ఫెసిలిటేషన్ సెంటర్‌ను కూడా ప్రారంభించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన పెట్టుబడుల సదస్సుల్లో 73 పారిశ్రామిక ఇంధన పొదుపు ప్రాజెక్టులను గుర్తించింది. వీటిద్వారా రూ.2,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేశారు. ఢిల్లీలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో

మిగతా 2వ పేజీలో ▶

అన్నీ ఉల్లంఘనలు మోసాలే!

మార్గదర్శి చిట్టీల డబ్బు ఉషాకిరణ్, ఉషోదయలోకి మళ్లింపు

- చిట్టీలు పాడుకున్న వారి సొమ్మును డిపాజిట్లుగా కట్టించుకుని మళ్లించారు
- ఆ కంపెనీల రికార్డులు, బ్యాంక్ అకౌంట్లన్నీ అస్తవ్యస్తం
- తనిఖీలకు ఏమాత్రం సహకరించలేదు
- పబ్లిక్ డొమైన్ బ్యాలెన్స్ షీట్లను పరిశీలించి నిధులు మళ్లిన విషయం తెలుసుకున్నాం
- మార్గదర్శిలో త్వరలో ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్.. ఏ సమాచారం అడిగినా హైదరాబాద్‌లో హెడ్‌క్వార్టర్‌లో ఉందంటున్నారు
- తెలంగాణ ప్రభుత్వ సహకారంతో అక్కడ కూడా తనిఖీలు చేస్తాం
- చట్టాన్ని ఉల్లంఘించిన కంపెనీలు అన్నింటికీ షోకాజ్ నోటీసులు
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ రామకృష్ణ వెల్లడి



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీలో భారీ అవకతవకలు, మోసాలు జరిగినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ వి.రామకృష్ణ వెల్లడించారు. చందాదారులు పాడుకున్న చిట్టీల సొమ్మును డిపాజిట్లుగా సేకరించి ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, ఉషాకిరణ్ మూవీస్, ఇతర కంపెనీలకు మళ్లించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి చెందిన చిట్టీల రికార్డులు, ఖాతాలను సక్రమంగా నిర్వహించడం లేదని, ఆ కంపెనీ వ్యవహారాలన్నీ అనుమానాస్పదంగా ఉన్నాయని చెప్పారు. కనీసం కంపెనీ బ్యాలెన్స్ షీట్లను కూడా అధికారులకు చూపడం లేదన్నారు. మార్గదర్శితోపాటు 35 కంపెనీల్లో మూడు విడతలుగా



ఐజీ వి.రామకృష్ణ

మిగతా 10వ పేజీలో ▶



ఆందోళనకారులను అడ్డుకుంటున్న తెలంగాణ పోలీసులు

రామోజీ ఫిలింసిటీ గోడలు బద్దలు కొడతాం

- ప్లాట్లు స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతాం
- రామోజీరావు కబ్జాకోరు.. అరెస్టు చేసి జైల్లో పెట్టాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్
- తెలంగాణలోని రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా.. ఉద్రిక్తత

- వివరాలు 10లో




సెల్‌టవర్ ఎత్తుకెళ్తుంటే స్టేషన్‌కు ఫోన్ చేయకుండా ఏం చేస్తున్నారయ్యా!

పోలీస్ అవుదాం.. రండి

6,511 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

తొలిసారిగా హోంగార్డులకు కానిస్టేబుల్ ఉద్యోగాల్లో రిజర్వేషన్



మొత్తం ఎస్‌ఐ పోస్టులు	ఎస్‌ఐ సివిల్	ఎస్‌ఐ ఏపీఎస్పీ
411	315	96
దరఖాస్తులు: 2022 డిసెంబర్ 14 నుంచి 2023 జనవరి 18 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు.		ప్రిలిమినరీ రాతపరీక్ష: 2023 ఫిబ్రవరి 19న

మొత్తం కానిస్టేబుల్ పోస్టులు	కానిస్టేబుల్ సివిల్	కానిస్టేబుల్ ఏపీఎస్పీ
6,100	3,580 (పురుషులు, మహిళలు)	2,520 (పురుషులు)
దరఖాస్తులు: 2022 నవంబర్ 30 నుంచి 2022 డిసెంబర్ 28 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు.		ప్రిలిమినరీ రాతపరీక్ష: 2023 జనవరి 22న


సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగార్థులకు తీపి కబురు చెప్పింది. 6,511 పోలీసు ఉద్యోగాల భర్తీప్రక్రియ చేపట్టింది. వాటిలో 411 ఎస్‌ఐ పోస్టులు, 6,100 కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి. ఈ మేరకు ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎస్‌ఐ పోస్టుల్లో 315 సివిల్ (పురుషులు, మహిళల కేటగిరీలు), 96 ఏపీఎస్పీ (పురుషులు) పోస్టులు ఉన్నాయి. 6,100 కానిస్టేబుల్ పోస్టుల్లో 3,580 సివిల్, 2,520 ఏపీఎస్పీ పోస్టులు ఉన్నాయి. ఎస్‌ఐ పోస్టుకు రెండు విభాగాల్లో (సివిల్, ఏపీఎస్పీ) దరఖాస్తు చేసేవారికి ఒక దరఖాస్తు సరిపోతుంది. కానిస్టేబుల్ పోస్టుకు రెండు విభాగాల్లో (సివిల్, ఏపీఎస్పీ) దరఖాస్తు చేసేవారికి ఒక దరఖాస్తు సరిపోతుంది. ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులకు

మిగతా 14వ పేజీలో ▶

రైతన్నలకు విరివిగా వ్యవసాయ రుణాలు

- చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఏటా తగ్గిపోయిన వ్యవసాయ రుణాల మంజూరు
- 2018లో రూ.1.06 లక్షల కోట్లు మాత్రమే వ్యవసాయ రుణాలు
- 2022 నాటికి ఇచ్చినవి రూ.1.80 లక్షల కోట్లకు పైనే..
- బాబు రుణమాఫీ మోసంతో రైతులకు దక్కని బ్యాంకు రుణాలు
- 2014 నుంచి 2018 వరకు వరుసగా తిరోగమనమే.. బాబు ఐదేళ్ల పాలనలో 10.32 శాతం తగ్గిపోయిన వ్యవసాయ రుణాల మంజూరు
- వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలోనే 60.16 శాతం పెరుగుదల

ఆర్‌బీఐ తాజా గణాంకాల్లో వెల్లడి



- వివరాలు 2లో

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ ఉద్యమంలో కలెక్టర్లదే ప్రధాన భూమిక

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



వాహనాలను ప్రారంభిస్తున్న గవర్నర్

సాక్షి, అమరావతి: రెడ్‌క్రాస్ ఉద్యమంలో జిల్లా కలెక్టర్లదే ప్రధాన భూమిక అని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. అవసరమైన వనరులను సమకూర్చి రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. రెడ్‌క్రాస్‌కు సంబంధించి విభిన్న రూపాల్లో ఉత్తమ సేవలు అందించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు, కలెక్టర్లకు విజయవాడలోని రాజ్‌భవన్‌లో సోమవారం గవర్నర్ అవార్డులు ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాన్ని, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ అందించిన రూ.45లక్షల విలువైన రెండు వాహనాలను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులు సంభవించిన సమయంలో బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి తోడుగా రెడ్‌క్రాస్ విశేషమైన కృషి చేస్తోందన్నారు. గత మూడేళ్లలో జిల్లా కలెక్టర్లుగా అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి, విరాళాలు సమీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు డి.మురళీధర్‌రెడ్డి, జె.నివాస్‌తోపాటు అల్లూరి సీతారామరాజు, కాకినాడ, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, కృతికా శుక్లా, కేవీఎన్ చక్రధర్‌బాబు, పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ చీఫ్ రీజనల్ మేనేజర్ రాజు స్టీవెన్‌సన్‌కు గవర్నర్ రెడ్‌క్రాస్ మెడల్స్ ప్రదానం చేశారు.

గవర్నర్‌ను కలిసిన సమాచార కమిషనర్లు



గవర్నర్‌ను కలిసిన మహబూబ్ బాషా

సాక్షి, అమరావతి: కొత్తగా నియమితులైన రాష్ట్ర సమాచార కమిషన్ ముఖ్య కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా, కమిషనర్ పి.శామ్యూల్ జోన్నాథన్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో సోమవారం సమావేశమయ్యారు. రాష్ట్ర సమాచార కమిషన్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమాచార కమిషన్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గవర్నర్ వారికి సూచించారు.

నేడు సీఎం వైఎస్ జగన్ గుంటూరు పర్యటన

సాక్షి, అమరావతి/గుంటూరు వెస్ట్: సీఎం వైఎస్ జగన్ మంగళవారం గుంటూరు పర్యటనకు వెళ్లనున్నారు. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు అలీ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. సాయంత్రం తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 4.55 గంటలకు గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం తాడేపల్లికి చేరుకుంటారు.

మహాత్మా జ్యోతిరావు పూలేకు సీఎం జగన్ నివాళి



పూలే చిత్రపటానికి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీ వి.విజయసాయిరెడ్డి, ఎంపీ మార్గాని భరత్‌రామ్ పాల్గొన్నారు.

ఫేషియల్ రికగ్నిషన్ ఆధారంగానే వేతనాల చెల్లింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) పనిచేసే ఉద్యోగులందరు ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా నే హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని అన్ని డీఎంహెచ్‌వోలకు సోమవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. ఫేషియల్ హాజరు ఆధారంగానే ప్రస్తుత వేతనాలను డిసెంబర్‌లో చెల్లిస్తామని పేర్కొన్నారు. నవంబర్ నుంచి వైద్య శాఖలో ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ విభాగంలో 24 వేల మందికి గాను 21,786, ఏపీవీవీపీలో 9,644కు గాను 7,641, డీఎంఈలో 8,019 మందికి గాను 7,633 మంది ఉద్యోగులు ఫేషియల్ విధానంలోకి ఎన్‌రోల్ అయ్యారు. అయితే ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగంలో 60%, ఏపీవీవీపీలో 52, డీఎంఈలో 56% మంది ఉద్యోగులు మాత్రమే యాప్‌లో హాజరు వేస్తున్నారు.

రైతన్నలకు విరివిగా

వ్యవసాయ రుణాలు

ఆర్‌బీఐ తాజా గణాంకాల్లో వెల్లడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రైతన్నలకు విరివిగా రుణాలు లభ్యమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన తాజా గణాంకాలు స్పష్టం చేశాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఈ ఏడాది మార్చి వరకు వరుసగా నాలుగేళ్ల రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు విరివిగా మంజూరయ్యాయి. ఇందుకు ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడమే. అలాగే సకాలంలో రుణాలు తిరిగి చెల్లించే రైతులకు సున్నా వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. దీంతో బ్యాంకులు రైతులకు వ్యవసాయ రుణాలను ఏడాదికేడాదికి పెంచుకుంటూ పోతున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు మోసం చేశారు. దీంతో బాబు ఐదేళ్ల పాలనలో బ్యాంకుల నుంచి రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు అంతకంతకూ తగ్గిపోతూ వచ్చింది. బాబు హయాంలో బ్యాంకులు రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు తగ్గించేయడానికి ప్రధాన కారణం.. ఆయన రుణమాఫీ చేస్తానని చేయకపోవడమేనని వెల్లడైంది.

60.16 శాతం మేర పెరిగిన వ్యవసాయ రుణాల మంజూరు..

ఆర్‌బీఐ తాజా గణాంకాల ప్రకారం.. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రుణాల మంజూరు 10.32 శాతం మేర తగ్గిపోయింది. మరోవైపు అదే సీఎం వైఎస్ జగన్ హయాంలో గత నాలుగేళ్లలో బ్యాంకుల నుంచి రైతులకు వ్యవసాయ రుణాల మంజూరు ఏకంగా 60.16 శాతం మేర పెరిగింది. 2014 మార్చి నాటికి వ్యవసాయ రుణాలు రూ.1,18,200 కోట్లు ఉండగా.. 2018 నాటికి ఈ మొత్తం రూ.1,06,000 కోట్లకు తగ్గిపోవడం గమనార్హం. సీఎం వైఎస్ జగన్ హయాంలో 2022 మార్చి నాటికి రూ.1,80,601 కోట్లకు వ్యవసాయ రుణాలు పెరిగాయి.

దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికం..

మరోవైపు దేశం మొత్తం మీద బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాల మంజూరు అత్యధికంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. 2022 మార్చి నాటికి దేశం మొత్తం మీద రూ.17,03,315 కోట్లను బ్యాంకులు వ్యవసాయ రుణాలుగా మంజూరు చేశాయి. ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు అత్యధికంగా రూ.7,66,911 కోట్లను మంజూరు చేయడం విశేషం. అంటే.. దేశం మొత్తం మీద మంజూరు చేసిన వ్యవసాయ రుణాల్లో దక్షిణాది రాష్ట్రాలకే 45.02 శాతం రుణాలు మంజూరయ్యాయి. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడులో అత్యధికంగా రూ.2,52,472 కోట్ల రుణాలను బ్యాంకులు ఇచ్చాయి. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా రూ.1,80,601 కోట్లను మంజూరు చేశాయి. అలాగే కర్ణాటకలో రూ.1,37,241 కోట్లు, కేరళలో రూ.92,121 కోట్లు, తెలంగాణలో రూ.1,00,645 కోట్ల వ్యవసాయ రుణాలను మంజూరు చేసినట్టు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.





వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో

'పూలే'కు ఘన నివాళి



జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌లు మాట్లాడుతూ సమాజంలో ప్రజల మధ్య అంతరాలు తగ్గించేందుకు విద్యే ఏకైక ఔషధమని చెప్పిన పూలే ఆశయ సాధన దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారని చెప్పారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆ మాధ్యమాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అమ్మ ఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్‌తో పాటు ఇంకా ఎన్నో పథకాల ద్వారా విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే కె.పార్థసారథి, ప్రభుత్వ సలహాదారు(మహిళా శిశు సంక్షేమం) నారుమల్లి పద్మజ, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు తోలేటి శ్రీకాంత్, కాకుమాను రాజశేఖర్, కనకారావు మాదిగ, కార్యకర్తల కో–ఆర్డినేటర్ పుత్తా ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రూ.400 కోట్ల

'ఇంధన' పెట్టుబడులు

▶ మొదటి పేజీ తరువాయి

వాటి జాబితాను విడుదల చేసింది. 14 ప్రాజెక్టులతో దేశంలోనే ఏపీ తొలిస్థానంలో నిలిచింది.

ఆదర్శంగా ఏపీ

సిమెంట్, స్టీల్, పవర్‌ప్లాంట్లు, ఫెర్టిలైజర్లు, కెమికల్స్, టెక్స్‌టైల్స్ రంగాలకు చెందిన ఈ 73 ప్రాజెక్టుల ప్రతిపాదనల్లో 45 ప్రాజెక్టులను బీఈఈ ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద నమోదైన 22 ఆర్థికసంస్థలకు సిఫార్సు చేసింది. వీటిని అమల్లోకి తీసుకురావడం వల్ల ఆయా పరిశ్రమల్లో సుమారు 125 ఇంధన సామర్థ్య సాంకేతిక మార్పులు చేపట్టవచ్చు. ఇందుకు రూ.2,218 కోట్లు అవుతుందని అంచనా వేశారు. దీనివల్ల ఏడాదికి 67.06 లక్షల మెగా వాట్ అవర్ (ఎండబ్ల్యూహెచ్) విద్యుత్ ఆదా అవుతుంది. 49,078 మెట్రిక్ టన్నుల బొగ్గు, 2.56 కోట్ల స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (ఎస్సీఎం) సహజ వాయువు, 95 వేల లీటర్ల హైస్పీడ్ డీజిల్ ఆదా అవుతాయి. 6.2 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. ఫలితంగా పరిశ్రమల్లో ఉత్పాదకత, ఆదాయాలు మెరుగుపడతాయి. రాష్ట్రంలో ఇప్పటికే ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాల ద్వారా దాదాపు రూ.3,800 కోట్ల విలువైన 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అయింది. తద్వారా 4.76 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించి రాష్ట్రం దేశానికి ఆదర్శమైంది.

అదితితో సమన్వయం

పెట్టుబడుల ప్రక్రియను సులభతరం చేయడానికి 'అదితి' పేరుతో రూపొందించిన ప్రత్యేక వెబ్ పోర్టల్‌ని న్యూఢిల్లీలో సోమవారం బీఈఈ ఆవిష్కరించింది. బీఈఈ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇంధన సామర్థ్య ప్రాజెక్టులు చేపట్టే పరిశ్రమలకు 5శాతం వడ్డీ రాయితీ ఇవ్వాలని ఏపీ చేసిన ప్రతిపాదనపై కేంద్రం అధ్యయనం చేస్తోందని చెప్పారు. ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల అమలులో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను అభినందించారు. రాష్ట్రం నుంచి వచ్చిన మరిన్ని ప్రాజెక్టులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఏపీ నుంచి ఈ సదస్సుకు హాజరైన ఏపీఎస్‌ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పగటిపూట రైతుకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తూనే, పరిశ్రమలకు, గృహాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం కోసం సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బీఈఈ డైరెక్టర్ వినీత కన్వాల్ తదితరులు మాట్లాడారు.

పోలవరానికి ముందస్తు నిధులపై..

కేంద్ర ఉన్నతస్థాయి కమిటీ సానుకూలం

- ప్రాజెక్టు తొలి, రెండో దశ పనుల పూర్తికి నిధులివ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై కేంద్రం చర్చ
- అధ్యయనం చేయాలని సీడబ్ల్యూసీ, పీపీఏలకు కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి ఆదేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తి చేయడానికి వీలుగా ముందస్తు (అడ్‌హక్) నిధులివ్వాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తొలి, రెండో దశ పనులను పూర్తి చేయడానికి ఏ మేరకు నిధులు అవసరమో గుర్తించి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)లను ఉన్నతస్థాయి కమిటీ సోమవారం ఆదేశించింది. ఈ నివేదిక ఆధారంగా నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రి మండలికి కేంద్ర జల్‌శక్తి, ఆర్థిక శాఖలు ప్రతిపాదనలు పంపనున్నాయి. దానిపై కేంద్ర మంత్రి మండలి ఆమోదముద్ర వేస్తే.. అడ్‌హక్‌గా పోలవరానికి నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుంది. రూ.10 వేల కోట్లను అడ్‌హక్‌గా విడుదల చేసి, నిధుల కొరత లేకుండా చేయాలని, డిజైన్లను త్వరితగతిన ఆమోదిస్తే పోలవరాన్ని సత్వరమే పూర్తి చేయవచ్చని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. అడ్‌హక్ నిధుల విడుదలతోపాటు సీఎం జగన్ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి ప్రధాని మోదీ ఆదేశాల మేరకు కేంద్రం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో రెండుసార్లు రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సమావేశాలలో అడ్‌హక్‌గా పోలవరానికి నిధులిచ్చేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కేంద్ర జల్‌శక్తి శాఖను కేంద్ర కమిటీ ఆదేశించింది.

మార్చి వరకూ రూ.7,300 కోట్లు

ఇప్పటివరకూ ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను రీయింబర్స్‌మెంట్ చేయడం, మార్చి వరకూ భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, పనులు చేయడానికి రూ.7,300 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దీనిపై కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ ఢిల్లీలో సోమవారం సమావేశమై చర్చించింది.పోలవరాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని.. తక్షణం ప్రభుత్వానికి నిధులు విడుదల చేయాలని ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిశీలించి.. తొలి దశ, రెండో దశ పూర్తికి ఏ మేరకు నిధులు అవసరమో నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీ, పీపీఏలను ఆదేశించింది.

మేలు.. చూడండి

గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడాను గమనించండి: సీఎం జగన్



కంప్యూటర్‌లో బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి నిధులను జమ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: మూడున్నరేళ్లుగా ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా నిలిచి మేలు చేస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. క్రమం తప్పకుండా సున్నా వడ్డీ పంట రుణాలివ్వడంతో పాటు ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్ ముగియకముందే ఇన్‌పుట్ సబ్సిడీని చెల్లిస్తూ కొత్త ఒరవడి తెచ్చామన్నారు. రైతులపై పైసా కూడా భారం పడకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతోపాటు నష్టపోతే బీమా పరిహారాన్ని మరుసటి ఏడాది ఆ సీజన్ రాకముందే అందిస్తూ ఆదుకుంటున్నామన్నారు. రబీ 2020–21, ఖరీఫ్–2021 సీజన్లకు సంబంధించి సున్నా వడ్డీ రాయితీ, ఖరీఫ్–2022లో వరదలు, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ముతో కలిపి మొత్తం రూ.200 కోట్లను క్యాంపు కార్యాలయం నుంచి సీఎం సోమవారం బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రైతులనుద్దేశించి మాట్లాడారు. ఆ వివరాలివీ..

విత్తనం నుంచి విక్రయం వరకూ అండగా..

ఆర్బీకేలు రైతన్నలకు నాణ్యమైన, సర్టిఫైడ్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందిస్తున్నాయి. అన్నదాతలకు సలహాలు ఇస్తున్నాయి. పారదర్శకంగా ఈ–క్రాప్ నమోదు చేస్తున్నాయి. ప్రతి పథకాన్ని పారదర్శకంగా అర్హులైన ప్రతి రైతుకు అందించడంతో పాటు పంటల కొనుగోలు సమయంలో ఇబ్బంది కలగకుండా సహాయకారిగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి గొప్ప వ్యవస్థ మన కళ్ల ముందే కనిపిస్తోంది. ఇలాంటి విధానం గతంలో లేదు. కనీసం ఆ ఆలోచన కూడా చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీని పూర్తిగా ఎగ్గొట్టారు. 2–3 సీజన్ల తర్వాత అరకొరగా అందించిన పరిస్థితులు చూశాం. ఇప్పుడు ఈ–క్రాప్ ఆధారంగా వాస్తవ సాగుదారులందరికీ ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్ ముగిసేలోగా నేరుగా వారి ఖాతాల్లోనే పరిహారాన్ని జమ చేస్తున్నాం. పారదర్శకతకు అత్యంత పెద్దపీట వేస్తున్నాం. రైతు భరోసా కేంద్రాలలో అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్నాం. ఒకవేళ ఎవరైనా అర్హత ఉండి కూడా పొరపాటున జాబితాలో పేరు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. వాటిని మళ్లీ వెరిఫై చేసి ఏటా జూలై, డిసెంబరులో మిస్ అయిన వారికి మేలు చేస్తున్నాం.

రైతన్నకు ఎంత చేసినా తక్కువే

రైతులకు ఎంత చేసినా తక్కువే. వారంతా సంతోషంగా ఉండాలని అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాది జూలై – అక్టోబర్ మధ్య వరదలు, అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న 45,998 మంది రైతులకు ఇవాళ రూ.39.39 కోట్లను వారి ఖాతాల్లో జమ చేస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన 21.31 లక్షల మంది రైతులకు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇవాళ ఇస్తున్న సొమ్ముతో కలిపి ఇప్పటివరకూ రూ.1,834.78 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీగా అందించాం. రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించే సన్న, చిన్నకారు రైతులు, వాస్తవ సాగుదారులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద వడ్డీ రాయితీని చెల్లిస్తూ అండగా నిలుస్తున్నాం. వరుసగా మూడో ఏడాది ఈ పథకం కింద రబీ 2020–21, ఖరీఫ్–2021 సీజన్‌లలో అర్హత పొందిన 8,22,411 మంది రైతులకు ఈరోజు రూ.160.55 కోట్ల వడ్డీ రాయితీ సొమ్ము జమ చేస్తున్నాం. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి ఈరోజు ఇస్తున్న మొత్తంతో 73.88 లక్షల మంది రైతులకు రూ.1,834.55 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశాం.

బాబొచ్చారు.. బంగారం పోయింది!

రైతన్నలకు అందించే సాయంలో గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఎంత తేడా ఉందో కొన్ని ఉదాహరణలు మీ ముందుకు తెస్తున్నా. గతంలో వైఎస్సార్ రైతు భరోసా లాంటి పథకం లేదు. రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను బేషరతుగా రుణమాఫీ చేస్తామని, బ్యాంకుల్లో ఉన్న బంగారమంతా ఇంటికి తిరిగి రావాలంటే 'బాబు' సీఎం కావాలంటూ ప్రచారం చేసి చివరకు నిలువునా మోసగించారు. అప్పులపై వడ్డీలు, వడ్డీల మీద చక్రవడ్డీలు కలిపి రైతులకు తడిసి మోపెడయ్యాయి. నాడు నోటీసులు ఇచ్చి బ్యాంకుల్లో కుదువబెట్టిన బంగారాన్ని వేలం వేయడం పేపర్లలో చూశాం. ఐదేళ్లలో ఆ పెద్దమనిషి రుణమాఫీ పేరిట చెల్లించింది రూ.15 వేల కోట్లు మాత్రమే. అది కూడా రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని ఎగ్గొట్టి. అప్పటివరకు అందుబాటులో ఉన్న సున్నా వడ్డీ పథకాన్ని ఎత్తివేశారు. ఇప్పుడు ఒక్క వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారానే మూడున్నరేళ్లలో మన ప్రభుత్వం రూ.25,971 కోట్లను రైతన్నలకు అందించింది.

నాడు ఐదేళ్లూ కరువు కాటకాలే..

గతంలో పంటల బీమా కోసం తమ వాటా ప్రీమియాన్ని రైతులే చెల్లించారు. ఆ ఐదేళ్లలో వరుసగా కరువు కాటకాలే. ప్రతి సీజన్‌లోనూ కరువు మండలాలను ప్రకటించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇన్సూరెన్స్ సొమ్ము పెరగాలి. కానీ అలా జరగలేదు. ఆ ఐదేళ్లలో బీమా కింద చెల్లించింది కేవలం రూ.3,411 కోట్లు మాత్రమే. మన ప్రభుత్వం వచ్చాక రైతులపై భారం పడకుండా ఉచిత పంటల బీమా అమలు చేశాం. ఈ–క్రాప్ ద్వారా పంటలు వేసే ప్రతి రైతుకూ పంటల బీమా వర్తింపచేశాం. రైతుల ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించింది. ఇప్పటివరకు రూ.6,685 కోట్ల మేర పంటల బీమా పరిహారాన్ని రైతులకు చెల్లించాం. గతంలో కొంతమందికే ఇన్సూరెన్స్ రాగా ఇప్పుడు ప్రతి రైతుకూ వర్తిస్తోంది.

కరువు సాయంలో తేడా చూస్తే..

కరువు సాయం అందించడంలో గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడా గమనించండి. మన పాలనలో ఒక్కటైనా కరువు మండలాన్ని ప్రకటించాల్సిన అవసరం రాలేదు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో సగటున ఏటా సగం కరువు మండలాలే. సాయం మాత్రం అంతంత మాత్రమే. 2015 నవంబర్, డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు రూ.260 కోట్లు, 2018లో కరువు వల్ల ఖరీఫ్‌లో రూ.1,832 కోట్లు, రబీలో రూ.356 కోట్ల మేర పంట నష్టం వాటిల్లితే అందించిన సాయం సున్నా. అదే మన ప్రభుత్వ హయాంలో చూస్తే సీజన్ ముగియకుండానే పరిహారం అందిస్తున్నాం. 2020 జూన్ నుంచి అక్టోబర్ వరకు కురిసిన భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన 3.80 లక్షల మంది రైతులకు రూ.285 కోట్ల పంట నష్ట పరిహారాన్ని అదే ఏడాది అక్టోబర్‌లో అందజేశాం. 2020 నవంబర్‌లో నివర్ తుపాను వల్ల నష్టపోయిన 8.35 లక్షల మంది రైతులకు రూ.645.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని నెల తిరగకుండానే డిసెంబర్‌లో జమ చేశాం. 2021 సెప్టెంబర్‌లో గులాబ్ తుపాను, నవంబర్‌లో కురిసిన అధిక వర్షాల వల్ల నష్టపోయిన 6.31 లక్షల మంది రైతులకు రూ.564 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని అదే ఏడాది నవంబర్‌లో అందజేశాం. ఇలా ఇప్పటి వరకు సీజన్ ముగియకుండానే రూ.1,835 కోట్లకుపైగా ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు అందించాం

సున్నా వడ్డీలో ఎంత తేడా అంటే..

సున్నా వడ్డీ విషయంలో గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,180 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును పూర్తిగా చెల్లించడమే కాకుండా 73.88 లక్షల మంది రైతులకు మూడున్నరేళ్లలో మొత్తం రూ.1,834.55 కోట్లు అందజేశాం. గత ప్రభుత్వం ఏనాడూ రైతులకు పగటిపూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇవ్వలేకపోయింది. మన ప్రభుత్వం 9 గంటల పాటు క్వాలిటీ విద్యుత్‌ను పగటిపూట అందిస్తోంది. సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు రూ.1,700 కోట్లు ఖర్చుచేశాం. గతంలో రైతులకివ్వాల్సిన రూ.9 వేల కోట్లు విద్యుత్ బకాయిలు ఎగ్గొట్టింది కూడా చంద్రబాబే. గత ప్రభుత్వం ధాన్యం సేకరణకు సంవత్సరానికి రూ.7–8 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే మన ప్రభుత్వం రూ.13 వేల కోట్లు వెచ్చిస్తోంది. గత సర్కారు ఐదేళ్లలో ధాన్యం సేకరణ కోసం చేసిన ఖర్చును మనం మూడేళ్లలోనే అధిగమించి ధాన్యం సేకరణ చేస్తున్నాం. 2014 నుంచి 2019 మధ్య ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటున 154 లక్షల టన్నులు కాగా మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి మూడేళ్లలోనే సగటున 167 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఏడాదికి 13 లక్షల టన్నులు దిగుబడిలో పెరుగుదల కనిపిస్తోంది. ఈరోజు అమూల్ రాకతో ప్రైవేట్ డెయిరీలు, కంపెనీల పాల సేకరణ ధరలు ఏ రకంగా పెరిగాయో రాష్ట్రమంతా కనిపిస్తోంది. కార్యక్రమంలో మంత్రి కాకాణి తదితరులు పాల్గొన్నారు.

> మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గట్టిగా నమ్మిన ప్రభుత్వం మనది. విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని రకాలుగా అండగా నిలిచి చేయిపట్టి నడిపిస్తున్నాం. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా ఎన్నో అమలు చేయడం ద్వారా వారికెంతో మేలు చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఎంత మేలు జరిగింది? ఇప్పుడు గత మూడున్నరేళ్లలో ఎంత మేలు జరిగిందో ఒక్కసారి తేడా గమనించమని కోరుతున్నా. మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నా. – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రాజు బాగుంటే రాజ్యం బాగుంటుంది



బీసీ కులానికి చెందిన ఒంటరి మహిళనైన నాకు మూడెకరాల పొలం ఉంది. రూ.87 వేల రుణం తీసుకొని సకాలంలో చెల్లించా. సున్నా వడ్డీ కింద రూ.1,791 వచ్చాయి. కంది సాగు చేసి నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.42 వేలు అందాయి. ఖరీఫ్ పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్నా. ఆర్బీకేలో రసీదు ఇచ్చారు. గతంలో విత్తనాల కోసం క్యూ లైన్లలో నిలబడి అవస్థలు పడ్డాం. ఇప్పుడన్నీ ఆర్బీకేల ద్వారా అందుతున్నాయి. ఇల్లాలు బాగుంటే ఇల్లు బాగుంటుంది. రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందని రుజువు చేశారు. పదికాలాల పాటు మీరే సీఎంగా ఉండాలి.

– జయమ్మ,రైతు, ఎర్రవంకపల్లి, శ్రీసత్యసాయి జిల్లా

ఇంట్లో అందరికీ అన్నీ..



గోదావరి వరదల సమయంలో మీరు నాటు పడవలో మా లంక గ్రామానికి వచ్చి ప్రతి ఒక్కరినీ పలుకరించారు. ప్రభుత్వం నుంచి సాయం అందిందా లేదా? అని అడిగారు. అందని వారికి మరుసటి రోజే రూ.2 వేలు ఆర్థిక సాయం అందేలా చేశారు. గతంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి మా లంక గ్రామాలకు రాలేదు. మాకు వంతెన కూడా మంజూరు చేశారు. మీకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నక్కా శ్రీనివాసరావు, రైతు, జి. పెద్దపూడి లంక, బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

గ్రామంలో వంతెన నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ నుంచి సీఎం వివరాలు తెలుసుకున్నారు. అనుమతులు రాగానే వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

ఈ ప్రభుత్వంలో రూ.5 లక్షల సాయం



నాకు రెండెకరాల భూమి ఉంది. రూ.93 వేల రుణం తీసుకుని సకాలంలో చెల్లించా. రూ.3,700 వడ్డీ రాయితీ వచ్చింది. ఆర్బీకేల ద్వారా ఈ–క్రాప్ నమోదు బాగుంది. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నీ అందుతున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పంటలు బాగా పండుతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఏ సమస్య వచ్చినా సచివాలయంలో పరిష్కరిస్తున్నారు. నాకు రైతు భరోసా, చేయూత, నా పిల్లలకు అమ్మ ఒడి సాయం అందింది. నేను ఈ ప్రభుత్వంలో రూ.5 లక్షలు అందుకున్నా. చాలా సంతోషంగా ఉంది. నాలా చాలా మంది లబ్ధి పొందారు.

– వెంకట లక్ష్మి, మహిళా రైతు, ముద్దాడ, శ్రీకాకుళం జిల్లా

దేశానికే ఆదర్శంగా



గతంలో పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. ఈరోజు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు ఈ–క్రాప్ ఆధారంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. మూడేళ్లుగా మంచి వర్షాలు కురుస్తున్నాయి. ముందుగానే సాగునీరు విడుదల చేయగలిగాం. ఊహకు అందని కార్యక్రమాలను ఈ ప్రభుత్వం చేస్తోంది. టీడీపీ హయాంలో నిత్యం కరువు కాటకాలతో రాష్ట్రం విలవిలలాడింది. నాడు టీడీపీ ఎమ్మెల్యేలే గ్రూపులుగా విడిపోయి నీళ్ల కోసం ఘర్షణలకు దిగిన పరిస్థితి. టీడీపీ హయాంలో 1,623 కరువు మండలాలు ప్రకటించగా ఇప్పుడు మూడేళ్లుగా ఒక్క కరువు మండలం కూడా లేదు.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

క్లుప్తంగా

5న కర్నూలులో 'రాయలసీమ గర్జన'

- న్యాయ రాజధాని జేఏసీ, వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీగా నిర్వహణ
- ప్రభుత్వ సలహాదారు సజ్జలతో జేఏసీ నేతల భేటీ


మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, కర్నూలు: న్యాయ రాజధానిగా కర్నూలును కాంక్షిస్తూ వచ్చేనెల 5వ తేదీన నగరంలో 'రాయలసీమ గర్జన' పెద్దఎత్తున నిర్వహించనున్నారు. ఇక్కడకు సోమవారం వచ్చిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని 'న్యాయ రాజధాని' జేఏసీ నేతలు కలిసి గర్జన ప్రస్తావన తీసుకొచ్చి మద్దతు ప్రకటించాలని కోరారు. దీంతో సజ్జల స్పందిస్తూ.. వికేంద్రీకరణే తమ ప్రభుత్వ విధానమని, సభకు పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. జేఏసీ, వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీఎత్తున సభ నిర్వహించి విజయవంతం చేద్దామని సజ్జల ప్రకటించారు. వీరి సమావేశానికి ముందు కర్నూలు నగరంలోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి సజ్జల పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలు, నంద్యాల జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీలు సంజయ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, చెన్నకేశవరెడ్డి, ఆర్థర్, కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఇసాక్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే జేఏసీ ఆశయం

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగింది
- ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ ఆశయమని ఆ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్ చెప్పారు. ఏకీకృత రాజధానితో మిగతా ప్రాంతాలు అభివృద్ధి చెందవన్న వాదనలు విని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచిందన్నారు. మూడు రాజధానులతోనే రాష్ట్ర అభివృద్ధి అని పేర్కొన్నారు. ఆయన సోమవారం విశాఖలో మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే అమరావతి ప్రాంతంతోపాటు విశాఖ, కర్నూలులను రాజధానులుగా చేయాలనే ఉత్తరాంధ్ర జేఏసీ కోరుకుంటోందని చెప్పారు. ఈ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు తమకు సమానమేనన్నారు. దశాబ్దాలుగా వెనకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందాలని మాత్రమే తామంతా కోరుకుంటున్నామని చెప్పారు. అమరావతి అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. అమరావతితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ కూడా అభివృద్ధి చెందాలనేదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు. గతంలో శివరామకృష్ణ కమిటీ, బోస్టన్ కన్సల్టెంట్ ఇచ్చిన రిపోర్టులు కూడా మూడు రాజధానులతో భవిష్యత్తులో ప్రాంతాల విభజనలుండవని, అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయని, అందరికీ మేలు జరుగుతుందని చెప్పాయని గుర్తుచేశారు. అందరం కలిసిమెలిసి ఉండాలని కోరుకునేవాళ్లలో ఉత్తరాంధ్రులు ముందుంటారని ఆయన చెప్పారు.

గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు నిందితుడు గంగిరెడ్డి బెయిలు రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. సోమవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. వివేకానంద రెడ్డి హత్య కేసు బదిలీకి సంబంధించి తీర్పు ఇవ్వాల్సి ఉన్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. మంగళవారం కానీ బుధవారం కానీ తీర్పు వెలువరిస్తామని ధర్మాసనం పేర్కొంది. గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ డిసెంబర్ 2కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

రొయ్యల ఫ్యాక్టరీ కాలుష్యాన్ని నివారించండి

సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం నేత మధు లేఖ

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో రొయ్యల ఫ్యాక్టరీ కాలుష్యాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం సీనియర్ నేత పి.మధు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను ఆయన సోమవారం మీడియాకు విడుదల చేశారు. మొగల్తూరులోని రొయ్యల ఫ్యాక్టరీ వ్యర్థ జలాలను గొంతేరు డ్రెయిన్‌లోకి వదలడంతో విలువైన మత్స్య సంపద నాశనమవుతోందన్నారు. దీని వల్ల గొంతేరులోని చేపల వేట(వలకట్లు)పై ఆధారపడిన అనేక మంది మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిందని తెలిపారు. ఈ విషయమై స్పందించి రొయ్యల ఫ్యాక్టరీ వ్యర్థ జలాలను కట్టడి చేయించి మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాలని మధు విజ్ఞప్తి చేశారు.

హైకోర్టు 'గడువుల'పై సుప్రీం స్టే

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని అమరావతి రైతులకు, రైతు సంఘాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 31కి వాయిదా వేసింది. రాజధాని నగరాన్ని మార్చే లేదా రాజధానిని విభజించే లేదా మూడు రాజధానులను ఏర్పాటు చేసే విషయంలో తీర్మానం, చట్టం చేసే శాసనాధికారం రాష్ట్రానికి లేదని చెప్పిన హైకోర్టు తీర్పుపై జనవరి 31న లోతుగా విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ''ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త చట్టాన్ని తెస్తే, ప్రస్తుత వ్యాజ్యాలన్నీ నిరర్థకం అవుతాయి కదా! అందుకనే ఈ వ్యవహారాన్ని వీలైనంత త్వరగా తేలుస్తాం'' అని న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ.నాగరత్నంతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పలు సందర్భాల్లో విస్మయం వ్యక్తం చేసింది. పలు ఘాటు వ్యాఖ్యలు కూడా చేసింది.

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో ప్రభుత్వ పిటిషన్

రాజధాని నగరాన్ని మార్చే లేదా రాజధానిని విభజించే లేదా మూడు రాజధానులను ఏర్పాటు చేసే విషయంలో తీర్మానం, చట్టం చేసే శాసనాధికారం రాష్ట్రానికి లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ ఏడాది మార్చి 3న తీర్పునిచ్చింది. అలాగే హైకోర్టుతో సహా శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలకు సంబంధించిన ప్రధాన కార్యాలయాలను ఏపీ సీఆర్‌డీఏ చట్టం, ల్యాండ్ పూలింగ్ నిబంధనల కింద నోటిఫై చేసిన ప్రాంతంలో తప్ప మరో చోటుకి మార్చే అధికారం కూడా రాష్ట్రానికి లేదని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. వీటితో పాటు రాజధాని నగర, రాజధాని ప్రాంత అభివృద్ధి, నిర్మాణం విషయంలో పలు కాల పరిమితులను నిర్దేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఇదే సమయంలో హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, ఇలా చేయకపోవటం కోర్టు ధిక్కారమేనని పేర్కొంటూ కొందరు రైతులు కూడా సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నంతో కూడిన ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది.

> ☛ అమరావతి రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని ఆరు నెలల్లో అభివృద్ధి చేయాలన్న హైకోర్టు ఆదేశం పూర్తిగా అసంబద్ధం. అది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఆరు నెలల్లో రాజధాని నగరాన్ని అభివృద్ధి చేయడమేంటి? అసలు మీ ఉద్దేశంలో రాజధాని నగరమంటే ఏంటి?
>
> ☛ అన్నీ మౌలిక వసతులతో రాజధాన్ని ప్రాంతం మొత్తాన్ని నెల రోజుల్లో అభివృద్ధి చేయాలా? హైకోర్టు ఇలా ఎలా ఆదేశాలిస్తుంది. నగర నిర్మాణంలో హైకోర్టుకున్న నైపుణ్యమేంటి? హైకోర్టు ఏమైనా టౌన్ ప్లానరా? లేక చీఫ్ ఇంజనీరా? ఇలాంటి వ్యవహారంలో కోర్టులకు ఎలాంటి నైపుణ్యం ఉండదు. అందువల్ల నగర నిర్మాణం విషయంలో మేం ఏ రకంగానూ జోక్యం చేసుకోబోం.
>
> ☛ ఆంధ్రప్రదేశ్‌లో అధికారాలు వేర్వేరుగా లేవా? హైకోర్టు ఎందుకు కార్యనిర్వాహక విధులు నిర్వర్తిస్తోంది? అన్నింటినీ ఒకే చోట కేంద్రీకరించడం కంటే మరిన్ని పట్టణ కేంద్రాలను కలిగి ఉండడం మంచిదే కదా!!. ఈ విషయంలో నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే తప్ప, హైకోర్టుది కాదు. ఈ మొత్తం వ్యవహారంలో హైకోర్టు పరిధి దాటి వ్యవహరించింది. హైకోర్టు కార్య నిర్వాహక వ్యవస్థ ఎంత మాత్రం కాజాలదు.
>
> – సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోసెఫ్, జస్టిస్ నాగరత్నం ధర్మాసనం



మనుగడలో లేని చట్టం ఆధారంగా హైకోర్టు తీర్పునిచ్చింది

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ, పాలన వికేంద్రీకరణ కోసం ఉద్దేశించిన చట్టం రద్దయిందని, అలా రద్దయిన తరవాత కూడా అది ఉన్నట్లుగా భావించి హైకోర్టు తీర్పునిచ్చిందని, అలా ఎలా చేస్తుందని ప్రశ్నించారు. న్యాయమూర్తి జస్టిస్ జోసెఫ్ జోక్యం చేసుకొని రైతులకు, రాష్ట్రానికి మధ్య జరిగిన ఒప్పందం కొంత మేరకు మనుగడలో ఉంటుంది కదా అని అభిప్రాయపడ్డారు. ఒక నిర్దిష్ట పరిధిలో చట్టాన్ని ఆమోదించాలంటూ శాసనసభను హైకోర్టు ఆదేశించజాలదని, ఇదంతా అధికార విభజన పరిధిలోని వ్యవహారమని వేణుగోపాల్ తెలిపారు. ఒక చట్టం మనుగడలో లేనప్పుడు దాని శాసన యోగ్యతపై కోర్టు జోక్యం తగదన్నారు. ''చట్టం రద్దు చేసినప్పుడు శాసనసభ తదుపరి ఏం చేస్తుందో న్యాయ వ్యవస్థ ఓపికతో చూడాలి. ఆపై శాసనసభ మరో చట్టాన్ని ఆమోదిస్తే దాని చెల్లుబాటును పరిగణించొచ్చు. కానీ చట్టమే లేనప్పుడు అది ఉన్నట్టే పరిగణనలోకి తీసుకున్నారు. ఇది చాలా చిత్రమైన అంశం. న్యాయస్థానాలు పూర్తిగా అకడమిక్ సమస్యల్లోకి వెళ్లజాలవు' అని వేణుగోపాల్ తెలిపారు.

రాజధాని నగరం అనే భావన రాజ్యాంగంలో లేదని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూలులో రాజధాని ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట ప్రదేశం లేదని, రాజధాని అంటే ప్రభుత్వం తన మూడు శాఖల్లో దేనిలోనైనా పని చేసే స్థానం మాత్రమేనన్నారు. కార్యనిర్వాహక వ్యవహారాలు పూర్తిగా అధికార యంత్రాంగానికి సంబంధించిన సమస్య అని విన్నవించారు.

హైకోర్టు పరిధి దాటి వ్యవహరించింది...

నెల లోపు ఇది చేయండి అని ఆదేశించడం సులభమని, కాని దానిని ఆచరణలో పెట్టడం అసాధ్యమైన పనిగా వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ సమయంలో జస్టిస్ జోసెఫ్ జోక్యం చేసుకుంటూ, 'అమరావతిలో పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టినట్లు ఉన్నారుగా..! హైకోర్టు భవనం కూడా కట్టారు. ఇప్పుడు కర్నూలులో హైకోర్టు అంటున్నారు. దీని సంగతి ఏమిటి? అని ప్రశ్నించారు. అదంతా అయిపోయిన అంశం అని వేణుగోపాల్ పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులకు ముప్పు వాటిల్లుతుందని సహేతుకమైన భయాందోళనలున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చు. కానీ హైకోర్టు ఆదేశాలు అనుమానమే బేస్‌గా ఇచ్చినట్లున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సమయంలో జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ.. ''ఆంధ్రప్రదేశ్‌లో అధికారాలు వేర్వేరుగా లేవా? హైకోర్టు ఎందుకు కార్యనిర్వాహక అధికారాలను నిర్వర్తిస్తోంది? అన్నింటినీ ఒకే చోట కేంద్రీకరించడం కంటే మరిన్ని పట్టణ కేంద్రాలను కలిగి ఉండడం మంచిది కదా..? దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్రమే కదా? హైకోర్టు కాదు కదా!. హైకోర్టు పరిధి దాటి వ్యవహరించింది'' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. అంతేకాక ఇరువురు న్యాయమూర్తులు కూడా, వేర్వేరు రాష్ట్రాల్లో అధికార వికేంద్రీకరణ గురించి న్యాయవాదులతో చర్చించారు.

పూర్తిస్థాయి వాదనల తరువాత దీనిపై నిర్ణయం...

వేణుగోపాల్ వాదనలు కొనసాగిస్తూ.. సమాఖ్య నిర్మాణంలో రాజధానిని మార్చుకొనే అధికారం రాష్ట్రానికి ఉండదా? ఆ అధికారాన్ని హైకోర్టు తన ఆదేశాలతో నియంత్రించొచ్చా? అని ప్రశ్నించారు. జస్టిస్ జోసెఫ్ జోక్యం చేసుకొని రెండు సమస్యలు గుర్తించినట్లుగా పేర్కొన్నారు. శాసనసభ అధికారాలు, రైతుల సమస్య రెండింటినీ చూడాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికే రాష్ట్ర రాజధానిని నిర్ణయించే అధికారం ఉందన్న హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని వేణుగోపాల్ కోరారు. ఈ విషయంలో న్యాయాన్యాయాల జోలికి వెళ్లని సుప్రీంకోర్టు... పూర్తి స్థాయి వాదనల తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

అలా అయితే మనకు ప్రజా ప్రతినిధులెందుకు..?

ఇవన్నీ ఫలానా ప్రాంతంలో ఉండాలా? ఇవి చట్టానికి సంబంధించిన విషయాలా? అని జస్టిస్ జోసెఫ్ తిరిగి ప్రశ్నించారు.. జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ.. అలా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేయడం న్యాయస్థానానికి సంబంధించిన అంశం కాదు. అలాంటప్పుడు మనకు ప్రజా ప్రతినిధులు ఎందుకున్నారు? మంత్రి వర్గం ఎందుకు? అని ప్రశ్నించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాజధాని కాకుండా వేరే ప్రదేశంలో సెక్రటేరియట్ లేదా దానిలో కొంత భాగం ఉండాలని ప్రభుత్వం భావిస్తుండొచ్చుగా? అని జస్టిస్ జోసెఫ్ ప్రశ్నించారు. అమరావతి నుంచి విశాఖ, కర్నూలు ఎంత దూరమని న్యాయవాదిని ప్రశ్నించారు. విశాఖపట్నం సుమారు 500 కిలోమీటర్లు, కర్నూలు సుమారు 800 కిలోమీటర్లు అని ప్రభుత్వ న్యాయవాదులు తెలిపారు. ఇది వికేంద్రీకరణలాగే ఉంది కదా! అని ధర్మాసనం అభిప్రాయపడింది. అందరి వాదనలు విన్న ధర్మాసనం, హైకోర్టు ఇచ్చిన తీర్పులోని పలు ఆదేశాలపై స్టే విధించింది. తదుపరి విచారణను జనవరి 31కి వాయిదా వేసింది.

రైతుల ప్రయోజనాలకు పూర్తి రక్షణ ఉంది...

భూములిచ్చిన రైతుల గురించి జస్టిస్ జోసెఫ్ ఆరా తీశారు. రైతుల హక్కులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్‌రెడ్డి కోర్టుకు వివరించారు. చట్టంలో రైతుల ప్రయోజనాలను పరిరక్షించే ఏర్పాట్లున్నాయన్నారు. రైతుల నుంచి సేకరించిన భూమిని అభివృద్ధి చేయడానికి సంబంధించి ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని, అయితే కాలపరిమితి అనేది ప్రధానమైన అడ్డంకి అని ఆయన వివరించారు. అమరావతిని రాజధానిగా తొలగించలేదని, మూడు అధికార కేంద్రాల్లో అమరావతి కూడా ఒకటి అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో హైకోర్టు నిర్వహణ గురించి న్యాయమూర్తులు ఆరా తీశారు. హైకోర్టు గురించి చెప్పాలని జస్టిస్ జోసెఫ్ కోరగా.. అమరావతిలోనే నిర్వహణ సాగుతోందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. హైకోర్టుపై ఎంత ఖర్చుచేశారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. సుమారు రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. హైకోర్టులో క్యాంటీన్ లేదట కదా..! న్యాయమూర్తులు, న్యాయవాదులు మధ్యాహ్న సమయంలో భోజనం నిమిత్తం బయటకి వెళ్తున్నారట కదా! అని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. హైకోర్టు పూర్తి స్థాయిలో పనిచేయాలంటే పూర్తి స్థాయి సౌకర్యాలు ఉండాలి కదా? అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం క్యాంటీన్ పూర్తిస్థాయిలో ఉందని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా 'సుప్రీం' తీర్పు

సీఎం తీసుకున్న నిర్ణయం సరైందేనని ప్రస్ఫుటమైంది

- ప్రభుత్వ వాదనను సుప్రీం కోర్టు సమర్థించినట్లయింది
- శాసన, న్యాయ వ్యవస్థల బాధ్యతలను గుర్తుచేసింది
- ఈ తీర్పు వికేంద్రీకరణకు బలాన్నిచ్చింది
- ఈ ఉత్తర్వులతో టీడీపీ, దాని తోక పార్టీలు బుద్ధితెచ్చుకోవాలి
- ఇప్పటికైనా చంద్రబాబు, దత్తపుత్రుడు, పచ్చ మీడియా, రాష్ట్రం కోసం పనిచేయాలి
- 'సుప్రీం' తీర్పు నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతల స్పందన

సాక్షి నెట్‌వర్క్: మూడు రాజధానులకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సహజ న్యాయానికి దగ్గరగా, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా ఉందని వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు వ్యాఖ్యానించారు. అయితే, భిన్న నిర్ణయాలు వెలువరించిన హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ తీర్పుతోనైనా ప్రతిపక్ష నేత చంద్రబాబుకు కాస్త జ్ఞానోదయం కలిగితే బాగుంటుందని.. మూడు రాజధానులకు ఇక అడ్డంకి ఉండదని భావిస్తున్నామని వారన్నారు. రాజధాని అంశంలో సోమవారం సుప్రీంకోర్టు వెలువరించిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స, అంబటి, అమర్‌నాథ్, కాకాణి, జోగి రమేష్, ఆదిమూలపు, మాజీ మంత్రులు కొడాలి నాని, కురసాల కన్నబాబు స్పందించారు. వారు ఏమన్నారంటే..

ఈ తీర్పు టీడీపీకి మొట్టికాయే: సజ్జల



సుప్రీం' ఇచ్చిన ఈ తీర్పు టీడీపీకి మొట్టికాయలాంటిది. అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనేలా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. అవి ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఉంటే వారే అంతిమ నిర్ణేతలు. రాజ్యాంగబద్ధంగా సర్వసత్తాక ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజలకు ఏం కావాలి? రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలి అనేది సహజంగా ప్రభుత్వాలకు సంక్రమించే అధికారం. దానికి భిన్నంగా హైకోర్టు తీర్పు ఉందని 'సుప్రీం' అభిప్రాయపడింది. ఐదేళ్లకోసారి ప్రజల తీర్పు ఉన్నప్పుడు మధ్యలో మరో వ్యవస్థ జోక్యం చేసుకోకూడదు. దానికి అనువుగానే 'సుప్రీం' తీర్పు ఇచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాష్ట్ర ప్రజలు పూర్తి విశ్వాసం ఉంచి 151 సీట్లు ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనువుగా ఆయన నిర్ణయాలు తీసుకుంటున్నారు కాబట్టే స్థానిక, పురపాలక, ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని తిరుగులేని ఆధిక్యంతో ప్రజలు ఆశీర్వదించారు. దీంతో సీఎం తీసుకున్న నిర్ణయం సరైందే అని ప్రస్ఫుటమైంది. కచ్చితంగా 'సుప్రీం' తీర్పును పాటిస్తాం. చిన్నచిన్న అడ్డంకులున్నా తొలగిపోతాయి.

సర్కారు వాదనను సమర్థించినట్లయింది: మంత్రి బొత్స



సుప్రీం తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన వాదనను సమర్థించినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వానికి రాజధానిని నిర్ణయించే అధికారం లేదనడం హాస్యాస్పదం. అమరావతి రైతులతో ఒప్పందాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నాం. ఆయా ఒప్పందాల్లో రాజధాని అనే పదమేలేదు. కేవలం భూముల అభివృద్ధి అని మాత్రమే ఉంది. ఐదేళ్ల టీడీపీ హయాంలో చంద్రబాబు అమరావతిని ఎందుకు కట్టలేదు? వికేంద్రీకరణపై వెనకడుగు వేసే ప్రసక్తేలేదు. వెంటనే పాలనా రాజధాని ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

వికేంద్రీకరణకు బలం: మంత్రి అంబటి



హైకోర్టు తీర్పును నిలుపుదల చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పరిపాలన వికేంద్రీకరణకు బలాన్నిస్తుంది. ఈ కేసు విచారణలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు అత్యంత కీలకమైనవి. ఈ తీర్పుతోనైనా చంద్రబాబుకు కాస్త జ్ఞానోదయం కలిగితే బాగుంటుంది. మూడు రాజధానులకు ఇక అడ్డంకి ఉండదని భావిస్తున్నాం. అమరావతిలో శాసన రాజధాని ఉంటుంది. భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తాం. రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదు.

'సుప్రీం' వ్యాఖ్యల్ని స్వాగతిస్తున్నాం: మంత్రి కాకాణి



రాజధాని విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు. అన్ని అడ్డంకులను తొలగించుకుని మూడు రాజధానులను సీఎం వైఎస్ జగన్ ఏర్పాటుచేసి తీరుతారు. ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు కల్పించి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు.. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లకు వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు రాజకీయంగా మరణశాసనం రాసేందుకు సిద్ధంగా ఉన్నారు.

హైకోర్టు తీర్పుపై స్టే హర్షణీయం: కొడాలి నాని



హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడం హర్షణీయం. గతంలో రాష్ట్ర హైకోర్టు ఆరు నెలల్లో రాజధాని నిర్మించాలని ఇచ్చిన తీర్పుని సుప్రీంకోర్టు నిశితంగా పరిశీలించి నిలుపుదల చేయడం అభినందనీయం. ఈ తీర్పు ప్రభుత్వ ఆలోచనకు అనుకూలంగా ఉందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, పవన్, బుర్ర తక్కువ లోకేష్, రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ, బీఆర్ నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలి.

ప్రభుత్వ వాణినే ధర్మాసనం ప్రతిబింబించింది : కన్నబాబు



వికేంద్రీకరణపై సీఎం జగన్ వాదనకు అద్దంపట్టేలా సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నాయి. అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయాలను స్వాగతిస్తున్నాం. శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థల బాధ్యతలను సుప్రీంకోర్టు అంతర్లీనంగా స్పష్టంచేసింది. ప్రజాస్వామ్యంలో అధికార విభజనను పరిగణలోకి తీసుకున్నట్లు తేటతెల్లమవుతోంది. ధర్మాసనం వ్యాఖ్యలు పరిశీలిస్తే న్యాయం, ధర్మం బతికి ఉన్నాయనే భావన కలిగింది. సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను న్యాయానికి, ధర్మానికి ఉన్న గొప్ప విలువలకు ప్రతీకలుగా భావిస్తున్నాం.

ఏప్రిల్ నుంచి విశాఖలో కార్యకలాపాలు : అమర్‌నాథ్



రాజధాని అంశం విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతోనైనా టీడీపీ, ఆ తోక పార్టీలు బుద్ధి తెచ్చుకోవాలి. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది. వచ్చే ఏప్రిల్ నుంచి విశాఖ వేదికగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. సుప్రీంకోర్టు తీర్పును ప్రజలంతా గమనించాలి. రాష్ట్ర రాజధాని ఎంపిక చేసుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదేనని సుస్పష్టంగా చెప్పింది. అంతే కాదు.. హైకోర్టు ఇచ్చిన స్టేలోని కొన్ని అంశాలను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఇప్పటికైనా చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం మానుకోవాలి. ఒకే ప్రాంతం అభివృద్ధి జరిగితే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించిన విషయం గుర్తుంచుకోవాలి. ఇక హైకోర్టు కర్నూలులో ఉండాలనేది మా విధానం. విజయవాడ, విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలని నివేదిస్తాం.

సీఎం ఆలోచనకు 'సుప్రీం' స్టే నిదర్శనం: మంత్రి ఆదిమూలపు



సీఎం వైఎస్ జగన్ ఆలోచన విధానం సరైనదన్న దానికి 'సుప్రీం' స్టే ఒక నిదర్శనం. కోర్టు తీర్పు, సూచనలను పరిగణనలోకి తీసుకుని అమరావతి అంశంపై ముందుకెళ్తాం. ఈ ప్రాంతంలో పెండింగ్ పనులను పూర్తిచేస్తాం.

'సుప్రీం' తీర్పును స్వాగతిస్తున్నాం: మంత్రి జోగి రమేష్



రాజధానిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో హైకోర్టు కొంత పక్కదారి పట్టించిందన్న విషయాన్ని అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో స్పష్టమవుతోంది. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వం వికేంద్రీకరణ దిశగా అడుగులు వేగంగా వేస్తుంది.

కుల ఉగ్రవాదుల కుట్రలకు కాలం చెల్లింది

- వ్యవస్థలను మేనేజ్ చేయాలని చూసిన డ్రామాలకు సుప్రీం కళ్లెం
- సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై బహుజన పరిరక్షణ సమితి నాయకుల హర్షం

తాడికొండ: కుల ఉగ్రవాదుల కుట్రలకు కాలం చెల్లిందని, ఓ సామాజికవర్గ ప్రయోజనాలే లక్ష్యంగా అమరావతి నిర్మాణం చేసి అందులో పేదవాడికి జానెడు జాగా లేకుండా చేయాలని యత్నించిన వారికి తగిన గుణపాఠం సుప్రీంకోర్టు రూపంలో ఎదురయ్యిందని పలువురు బహుజన పరిరక్షణ సమితి నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానుల ఏర్పాటు, రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య కావాలంటూ 792 రోజులుగా తాము రాజధాని ప్రాంతంలో చేస్తున్న ఉద్యమం సత్ఫలితాలు సాధిస్తుండటంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని కేసుల వ్యవహారంలో సోమవారం కోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో తమకు సానుకూల తీర్పు వచ్చిందని పలువురు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు బహుజన పరిరక్షణ సమితి నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అంతిమ విజయం బహుజనులదే



కులవాదులంతా ఏకమై రూ.400 కోట్ల ఎన్‌ఆర్‌ఐ ఫండ్‌తో వ్యవస్థలను మేనేజ్ చేసి ఎన్నో కుయుక్తులు పన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మూడు రాజధానుల ఏర్పాటు ద్వారా అంతిమ విజయం బహుజనులదే.

– మాదిగాని గురునాథం

రాష్ట్రాన్ని దోచుకునే ఎత్తుగడలిక సాగవు



రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకునేందుకు బాబు సారథ్యంలో పదింతలు లాభం పొందేందుకు వేసిన ఎత్తుగడలు ఎప్పటికీ పారవు. 5 కోట్ల మంది ప్రజల శ్రమను రాజధాని పేరుతో కొంతమంది వ్యక్తులు దోచుకొని రైతులను నిలువునా ముంచారు.

– పెరికే వరప్రసాద్

పక్క రాష్ట్రానికి పారిపోయిన ఘనుడు బాబు..



అమరావతి పేరుతో గ్రాఫిక్స్ డిజైన్‌లు చూపించి 27 వేల మంది రైతులను నిలువునా ముంచిన ఘనుడు చంద్రబాబు. ఇక్కడ సొంత ఇల్లు నిర్మించకుండా పారిపోయి పక్క రాష్ట్రంలో జల్సా చేస్తున్న బాబును తరిమి కొట్టడం ఖాయం.

– ఇందుపల్లి సుభాషిణి

రైతులకు మోసం..



రాజధానిలో అసైన్డ్ భూముల రైతులను పంటలు పండించుకోకుండా అడ్డుపడి.. తక్కువ ధరకు తీసుకుని బాబు అనుయాయులు మోసం చేశారు. తద్వారా పదింతలు లాభం పొందిన దుర్మార్గులపై చర్యలు తీసుకోవాలి.

–పులి దాసు

'బాబు అండ్ కో'ను జైల్లో పెట్టాలి..



రాజధాని పేరుతో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చంద్రబాబు, ఆయన అనుచరులను అరెస్టు చేసి జైల్లో పెట్టాలి. బాబుకు తన అవినీతి బయటకు రాకూడదనే తాపత్రయమే తప్ప ప్రజలపై ప్రేమలేదు. – ఎస్. జోషి

బాబు కేసుల్లో స్టేలను తొలగించాలి..



రాజధాని అవినీతి వ్యవహారంలో చంద్రబాబుపై కట్టిన కేసుల్లో విధించిన స్టేలను తొలగించి విచారణ చేయాలి. బాబు పెట్టిన దొంగ ఉద్యమానికి వస్తున్న నిధులపై ఆడిట్ చేసి.. పెట్టుబడి దారులెవరో నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉంది.

– బేతపూడి సాంబయ్య

అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



ప్రజలకు పాలన చేరువ చేసేందుకు అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. పాలనా వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యమన్న కోర్టు వ్యాఖ్యలు కులవాదులకు చెంపపెట్టు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలను మానుకోవాలని కోరుతున్నాం.

– ఈపూరి ఆదాం

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం

- 792వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: వికేంద్రీకరణపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 792వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు స్పష్టమైన వ్యాఖ్యానాలు చేస్తూ టౌన్ ప్లానింగ్ అధికారుల్లాగా హైకోర్టు ఆదేశించడం... 6 నెలల్లో నిర్మించాలని చెప్పడం ఏంటని ప్రశ్నించడం శుభపరిణామమని అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి లబ్ధిపొందాలని చూసిన కులవాదులు, బాబు అండ్ కోకు తగిన శాస్తి జరిగిందని చెప్పారు. ఇప్పటికైనా బాబు బుద్ధి తెచ్చుకుంటే మంచిదన్నారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



ఒక గొప్ప ఆర్టిస్టు అమ్ముడుపోయినప్పుడల్లా ఆ దిక్కు వెలిగించే గొప్ప నక్షత్రం ఇక దిక్కులేకుండా క్షణికమైన గొప్ప వెలుగుతో కిందికి జారిపోతుంది.

– చలం

సాక్షి

మంగళవారం, నవంబర్, 29

పాలసీ తెచ్చిన ప్రజాగ్రహం

ఆశయం మంచిదే కావచ్చు... అది ఆచరణాత్మకం అవునో కాదో చూసుకోవడం ముఖ్యం. ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకోవడం మరీ ముఖ్యం. కోవిడ్–19కు జన్మస్థానంగా అపఖ్యాతి పాలైన అగ్రరాజ్యం చైనా అక్కడే విఫలమైంది. ఆ దేశం తలకెత్తుకున్న 'జీరో కోవిడ్ పాలసీ' తలవంపులు తెచ్చిపెడుతోంది. దేశంలో ఒక్క కోవిడ్ కేసూ లేకుండా ఉండేలా, ప్రతి కేసునూ తీవ్రంగా పరిగణించాలంటూ... ఎడతెగని లాక్‌డౌన్లు, ప్రజాజీవితంపై కఠోర నిర్బంధాలు విధిస్తున్న ఈ మతి లేని విధానం సహజంగానే చైనీయుల్లో అసహనాన్ని పెంచిపోషిస్తోంది. వివిధ ప్రాంతాల్లో ప్రజలు పెద్దయెత్తున నిరసనకు దిగడం, దేశాధినేత జిన్‌పింగ్ గద్దె దిగాలని నినదించడం దాని ఫలితమే. అయితే, కరోనా సమస్య పరిష్కారానికీ, ప్రభుత్వ విధానాన్ని సరిదిద్దుకొనేందుకూ ప్రయత్నించకపోగా, నిరసనల అణచివేతపై పాలకులు దృష్టి పెట్టడమే శోచనీయం.

ఉరుమ్‌కీలో బహుళ అంతస్థుల భవన అగ్నిప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోవడం తాజా నిరసనలకు ప్రేరేపించింది. 'జీరో కోవిడ్ పాలసీ'లో భాగంగా 109 రోజులుగా ఆ నివాసంలోని వారందరినీ ఇంట్లోనే నిర్బంధించారు. ఇళ్ళకు తాళాలు వేసి మరీ ప్రభుత్వం కోవిడ్ నిర్బంధాల వల్లే అగ్నిప్రమాదంలో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని ప్రజాగ్రహం పెల్లుబుకింది. దేశ రాజధాని బీజింగ్, వాణిజ్య రాజధాని షాంఘైలలో ఆదివారం శాసనోల్లంఘన ఉద్యమం సాగింది. కోవిడ్ జన్మస్థానమైన ఊహాన్‌కు సైతం నిరసన సెగ తగిలినా, ప్రభుత్వ వర్గాలు క్షేత్రస్థాయిలో అంతా బాగుందంటున్నాయి. వాస్తవాల్ని నివేదించడానికి ప్రయత్ని స్తున్న విదేశీ విలేఖరులను తిట్టి, కొట్టి, తిప్పలు పెడుతుండడం మరీ దారుణం. దేశంలో సెన్సార్‌షిప్‌తో చైనీయులు నినాదాలేమీ లేకుండా, తెల్ల కాగితాలు, తెలుపు బోర్డులు పట్టుకొని, నిరసన తెలియజేయాల్సి వస్తోంది.

కోవిడ్ వచ్చినప్పుడు 2020లో రికార్డు సమయంలో తాత్కాలిక భారీ ఆసుపత్రులను కట్టి, ప్రపంచం తలతిప్పి చూసేలా చేసిన ఘనత చైనాది. తీరా ఇప్పుడు అదే అగ్రరాజ్యం దిక్కుతోచని స్థితిలో పడింది. మరుగుదొడ్లను సైతం తాత్కాలిక క్వారంటైన్ శిబిరాలుగా మార్చి, జనాన్ని అందులో ఖైదీల కన్నా నీచంగా చూస్తున్న అపకీర్తిని మూటగట్టుకుంది. ఇప్పటికీ చైనాలో 50కి పైగా నగరాలు, పట్నాల్లో జనం కొన్ని వారాలుగా లాక్‌డౌన్లతో ఇంటికే పరిమితమయ్యారు. అయినా, మునుపెన్నడూ లేనంతగా రోజూ 40 వేల కరోనా కేసులు నమోదవుతున్నాయంటే 'జీరో కోవిడ్' విధానం ఒక విఫల ప్రయోగమని అర్థమవుతూనే ఉంది. మహమ్మారిపై గత మూడేళ్ళుగా అనుసరిస్తున్న అవకతవక విధానాలతో లాక్‌డౌన్లు, నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయి. జనజీవనంతో పాటు ప్రపంచంలోని రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. సాధారణ జీవితం సాగించాలని ప్రాధేయపడుతున్న జనంలోని వీధినపడ్డ అసహనం అర్థం చేసుకోదగినదే.

జీవితకాలం చైనాకు తిరుగులేని నేతగా ఇటీవలే కొత్త అధికారాలు సంతరించుకున్న జిన్‌పింగ్ నెల తిరిగేసరికల్లా ఎదురైన ఈ యాంటీ కోవిడ్ నిరసనలతో జీరో కోవిడ్ పాలసీని సరళీకరిస్తారా అన్నది ప్రశ్న. ఇవి రాజకీయ నిరసనలుగా మారుతుండడం సవాలే. విద్యార్థుల సారథ్యంలోని 1989 నాటి తియాన్మెన్ స్క్వేర్ ప్రజాస్వామ్య ఉద్యమం తర్వాత మళ్ళీ అలాంటి నిరసనలు కొందరి మాట. అప్పట్లో దాన్ని ఆర్మీతో అణిచేసిన అనుభవం ఉండనేవుంది. పైపెచ్చు, అంతర్గత సమస్యలు తలెత్తినప్పుడల్లా సరిహద్దుల్లో ఏదో ఒక రచ్చతో చైనీయుల్లో జాతీయవాదం రగిల్చి, అంతర్జాతీయ దృష్టి అంతా కొత్త అంశంపై మళ్ళేలా చేయడం డ్రాగన్ వ్యూహం. కనుక భారత్ అప్రమత్తం కావాలి.

నియంతలు ప్రజాకాంక్షలకు విలువనివ్వడం కలలో మాటే. అలాగని చైనీయులు కళ్ళు తెరిచి చూస్తుంటే, మిగతా ప్రపంచం కోవిడ్‌ను దాటి ముందుకుపోతోంది. పొరుగునే ఉన్న తైవాన్‌లో తప్పనిసరి మాస్కుల నిబంధనను సైతం తప్పిస్తుంటే, తమ వద్ద తీవ్ర ఆంక్షలు వారిని ఉక్కపోతకు గురిచేస్తున్నాయి. ఫుట్‌బాల్ ప్రపంచ కప్ వేదిక సహా అన్నిచోట్లా వేలాది జనుల ఉత్సాహం వారికి కరోనా నిర్బంధరహిత జీవితంపై కోరిక రేపుతోంది. మిగతా ప్రపంచమంతా కరోనా నుంచి బయట కొచ్చేస్తున్నా, చైనా వేలకొద్దీ కరోనా కేసులతో కల్లోలం కావడానికి కొత్త వేరియంట్‌తో పాటు నిర్వహణలోపాలూ కారణం. చైనాలో ఇప్పటికీ 80 ఏళ్ళు పైబడినవారిలో సగం మందికే ప్రాథమిక కరోనా టీకాకరణ జరిగింది. ఇక, బూస్టర్ డోస్ తీసుకున్నది వారిలో 20 శాతం లోపే. 60–69 ఏళ్ళ మధ్య వారిలోనూ పూర్తి టీకాకరణ జరిగింది 60 శాతంలోపే. పిల్లలకు టీకాల మాట దేవుడెరుగు.

చైనా టీకాల సత్తా తక్కువ. అక్కడి టీకాలన్నీ ప్రభుత్వ రంగ సైనోఫార్మ్, ప్రైవేట్ సంస్థ సైనోవాక్ తయారీలే. వాటి క్లినికల్ ట్రయల్స్ డేటా ప్రజాక్షేత్రంలో ఇప్పటికీ లేదు. దీనికి తోడు ఇతర దేశాల టీకాలు వాడేది లేదన్న మూర్ఖత్వం సరేసరి. నిజానికి, తాజాగా చైనాను పీడిస్తున్నది బలమైన ఒమిక్రాన్ బీఎఫ్.7 వేరియంట్. నర్సింగ్‌హోమ్‌లు, స్కూళ్ళు, భవన నిర్మాణ స్థలాలలో సామూహిక ఇన్ఫెక్షన్లకు ఇది కారణం. చైనా విధానలోపం మాటెలా ఉన్నా, నేటికీ కరోనా పూర్తిగా వదిలివెళ్ళలేదని మిగతా దేశాలు గ్రహించాలి. సదరు వేరియంట్ అమెరికా, బ్రిటన్‌తో పాటు గత నెలలో కేరళకూ చేరింది. మన దగ్గర కేసులు తక్కువే ఉన్నా, పండుగలు దగ్గరకొస్తున్న వేళ టీకాలు, మాస్కుల లాంటి ప్రాథమిక జాగ్రత్తలే రక్ష. డ్రాగన్ సైతం భారత్ సహా ప్రపంచ దేశాల కరోనా నిర్వహణ విధానాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. భీష్మించుకు కూర్చుంటే ప్రజలకే కాదు పాలకులకూ కష్టమే!

మళ్లీ కావాలి ఒక 'సెన్సేషన్'!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను ఆగమేఘాల మీద నియమించారన్న విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం నిశితమైన వ్యాఖ్యానాలు చేసింది. టీఎన్ శేషన్ లాంటి ఒక బాధ్యతాయుతమైన అధికారిని కోరుకుంటున్నట్టు చెప్పింది. అయితే రెండు దశాబ్దాలుగా ఏ ఒక్క కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి కూడా పూర్తికాలం తన పదవిలో కొనసాగడం లేదు. యూపీఏ, ఎన్డీయే రెండు పాలక కూటముల హయాంలోనూ జరిగింది ఇదే. ఇంత అస్థిరంగా పదవిలో ఉండే అధికారి, ఒకవేళ అత్యంత శక్తిమంతమైన స్థానంలో ఉన్నవారి మీద ఆరోపణలు వస్తే ఏం చర్యలు తీసుకోగలరు? స్వతంత్ర ప్రతిపత్తి, విలువలు ముఖ్యమైనందున సీఈసీ నియామకానికి స్వతంత్రమైన నిర్ణయాధికారం గల ప్యానెల్ ఉండి తీరాలి.

"దేశంలో కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈసీ), ఇతర ఎన్నికల అధికారుల (ఈసీ) నియామకాల విషయంలో రాజ్యాంగపు మౌనాన్ని ప్రభుత్వాలు తమకు అనుకూలంగా దుర్వినియోగం చేసుకుంటూ వస్తున్నాయి. ఇది అవాంఛనీయ పోకడ. వారి నియామకానికి ఎలాంటి ప్రక్రియనూ దేశ రాజ్యాంగం, అందులోని 324వ అధికరణ నిర్దేశించలేదు. కానీ, ఎన్నికల కమిషనర్ల నియామకం విషయంలో చట్టం చేయాలని రాజ్యాంగం నిర్దేశించిపోయినా గత 72 ఏళ్లుగా ఆ పనిని పాలకులు చేయలేదు. ఫలితంగా ఏ ఒక్క చీఫ్ ఎలక్షన్ కమిషనర్ కూడా 2004 నుంచీ ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకోలేదు. ఇక పదేళ్ల యూపీఏ (కాంగ్రెస్ కూటమి) పాలనలో ఏకంగా ఆరుగురు సీఈసీలు మారి పోగా, ప్రస్తుత ఎన్డీఏ (బీజేపీ కూటమి) ఎనిమిదేళ్ల పాలనలో ఏకంగా ఎనిమిదిమంది సీఈసీలను మార్చేశారు. ఈ పరిస్థితుల్లో ఒకనాడు భారతదేశ చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా, వ్యక్తిత్వం ఉన్న అధికారిగా పని చేసిన టీఎన్ శేషన్ లాంటి వారు సీఈసీగా రావాలని మేము కోరు కుంటున్నాం. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి, విలువలు ముఖ్యమైనందున సీఈసీ నియామకానికి స్వతంత్రమైన నిర్ణయా ధికారం గల ప్యానెల్ ఉండి తీరాలి. ఎందుకంటే, ఇప్పటి పద్ధతిలో అస్వతంత్రమైన సీఈసీ నియామకం వల్ల ఒకవేళ ప్రధానమంత్రిపై ఆరోపణలొస్తే సీఈసీ నిర్ణయం తీసుకోగలరా?"

– సీఈసీల స్వల్పకాలిక నియామకాలతో కేంద్ర పాలకులు అనుసరిస్తున్న విధానాలను విమర్శిస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం *(22 నవంబర్ 2022)*

టీఎన్ శేషన్ 1990 డిసెంబర్ నుంచి 1996 డిసెంబర్ దాకా దేశ 10వ సీఈసీగా పనిచేశారు. అలాంటి బాధ్యతాయుత ఉన్నతాధికారి నేడు దేశానికి కావాలని సుప్రీంకోర్టు గౌరవ ధర్మాసనం ఎందుకు అభిప్రాయపడవలసి వచ్చిందో ప్రతి పౌరుడు పరిశీలించాల్సిన అవసరం తలెత్తింది. 1950 మార్చి నుంచి 2022 'మే' దాకా శేషన్ సహా సీఈసీలుగా పనిచేసినవారు మొత్తం 25 మంది. ఒకసారి రాష్ట్రపతి నియమించిన తర్వాత, ఏ సీఈసీ అయినా బాధ్యతలను సక్రమంగా నిర్వహించక పోయినా, తప్పుడు నిర్ణయాలకు పాల్పడినా ఆయన్ని ఆ పదవి నుంచి తొలగించాలంటే – లోక్‌సభ, రాజ్యసభ సభ్యులలో మూడింట రెండు వంతుల మంది ఓటు వేయాల్సి ఉంటుంది.

ఈ బాధ్యతలన్నీ క్షుణ్ణంగా తెలిసినవాడు, తన పరిధిలో నిక్కచ్చి అయిన సాహసి కాబట్టే టీఎన్ శేషన్ తన హయాంలో దేశ ఎన్నికల నిర్వహణలోనే 'పాపం'లా పేరుకుపోయిన వందకుపైగా అవకతవకలను గుర్తించి, దేశ ఎన్నికల నిర్వహణ తీరును సంస్కరించడానికి నడుం బిగించారు. మన కేంద్ర పాలకుల స్వార్థపూరిత విధానాలలోని అవకతవకలను సరిదిద్ది, సకాలంలో పాలకుల్ని 'గాడి'లో పెట్టేందుకు దోహదపడమని అధికారుల నిబంధనలు ఘోషిస్తున్నా... 'చూసి రమ్మంటే కాల్చి వచ్చే' బాపతువాళ్లు అధికార గణంలో కూడా ఉండబట్టే అనేక అవకతవకలకు ఆస్కారం కల్గుతోందని గతంలో 'రీసెర్చి అండ్ ఎనాలిసిస్ వింగ్' ('రా') గూఢచారి సంస్థ అధిపతిగా పనిచేసిన 'కా'(కేఏడబ్ల్యూ) వెల్లడించిన విషయం ఈ సందర్భంగా గుర్తొస్తోంది. కానీ సీఈసీగా శేషన్ భారత ఎన్నికల నిర్వహణ వ్యవస్థలోని లొసుగుల ఆధారంగా రాజకీయ పార్టీలు చేస్తున్న అవినీతి, అక్రమ చర్యలకు అడ్డుకట్ట వేశారు. ఈ క్రమంలోనే ఒక జనరల్ ఎన్నికల సందర్భంగా బీజేపీ – ఆర్ఎస్ఎస్ అగ్రనాయకుల్ని శేషన్ అడ్డుకున్నారు. 'రాజ్యాంగ సెక్యులర్ లక్ష్యాలకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారా, లేదా? అయినప్పుడు ఆ ప్రతిజ్ఞకు భిన్నంగా వ్యవహరించిన మిమ్మల్ని, మీ పార్టీని ఎందుకు నిషేధించరాదో చెప్పమని (అద్వానీ ప్రభృతుల్ని) నిలేసినవారు శేషన్.



రెండో మాట

కేంద్ర మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్

ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళిని పకడ్బందీగా రూపొందించడంతో పాటు, అర్హులైన వారందరికీ ఓటర్ల గుర్తింపు కార్డుల్ని సిద్ధం చేసి పంపిణీ చేసినవారు శేషన్! ఎన్నికల ప్రచారం పేరిట విచ్చలవిడిగా డబ్బులతో ఓటర్లను కొనేయడానికి, మద్యాన్ని విచ్చలవిడిగా అభ్యర్థులు ఏరులై పారించడాన్ని చట్ట విరుద్ధ అవినీతికర చర్యలుగా ప్రకటించి తాను సీఈసీ హోదాలో వాటిని కొనసాగించవలసిన ఆదర్శాలుగా మలిచారు. ఈ కఠినమైన ఆదర్శ నిర్ణయాలను చేసి అమలు జరిపినందుకు శేషన్‌ను ప్రశంసించినవారూ ఉన్నారు, విమర్శించినవారూ ఉన్నారు. ఎన్నికల ప్రచారం పేరుతో 'లౌడ్ స్పీకర్ల' విచ్చలవిడి వాడకాన్ని నియంత్రించిన వారాయన. కనుకనే గిట్టిన వారి దృష్టిలో 'సెన్సేషన్'గానూ, గిట్టనివారి దృష్టిలో తమ పాలిట 'అల్సేషన్' గానూ ఆయన కనిపించారు. సీఈసీ పదవిలో అంత వరకూ పనిచేసిన మొత్తం 25 మంది సీఈసీలలో ఒక్క శేషన్‌కే ప్రసిద్ధ రామన్ మెగసెసే పురస్కారం లభించింది. లక్ష్యం సరైనదైతే 'సుపరిపాలనా వ్యవస్థ నిర్మాణం అసాధ్యమేమీ కాదు' అని స్పష్టంగా ప్రకటించినవాడు శేషన్. కనుకనే సీఈసీ పదవిలో ఉన్న వ్యక్తులు పాలకుల కోరికల మేరకు 'తలలూపే' బాపతుగా ఉండటం దేశ నడవడికకు ఆదర్శనీయమైన ఆచరణను ప్రసాదించలేదని దేశ అత్యున్నత రాజ్యాంగ ధర్మాసనం దృఢాభిప్రాయంగా మనం తీర్మానించుకోవచ్చు.

సీఈసీ పదవికి ప్రతిపాదించిన నాలుగైదు పేర్లలో ఒకరిని (అరుణ్ గోయెల్) నిమిషాల మీద నియమించి దేశంలో 'గత్తర' లేపారు పాలకులు. 'ఆగమేఘాల' మీద ఒక అధికారిని నియమించడానికి చూపిన చొరవను ఆక్షేపిస్తూ రాజ్యాంగ ధర్మాసనం తరఫున జస్టిస్ కె.ఎం. జోసఫ్ చేసిన ప్రకటనను సునిశిత వ్యాఖ్యగా మనం పరిగణించాలి. జస్టిస్ జోసఫ్ మాటల్లో: 'స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి. ఇంతకూ అసలు సమస్యల్లా సంబంధిత వ్యక్తి (అధికారి) నిజంగా స్వతంత్ర శక్తి ఉన్నవాడా కాదా అన్నదే అసలు ప్రశ్న'! కనుకనే కేంద్ర ఎన్నికల కమిషనర్‌ల నియామకానికి కేంద్రంలో తటస్థంగా వ్యవహరించే స్వతంత్రమైన యంత్రాంగం ఉండి తీరాలని జస్టిస్ జోసఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి అభిప్రాయపడ్డారు. ధర్మాసనం వేసిన సూటి ప్రశ్న: 'ప్రధానమంత్రిపై ఆరోపణలు వస్తే ప్రధాన ఎన్నికల అధికారి చర్యలు తీసుకోగలరా? అందుకే సీఈసీకి స్వతంత్ర ప్రతిపత్తి, వ్యక్తిత్వం ముఖ్యం'!

కులాతీత, వర్గాతీత, మతాతీత రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చుకున్నామా అన్నది ఈ రోజుకీ ప్రశ్నగానే మిగిలిపోయింది. ఇందుకు కారణాన్ని అన్వేషించడం ఇప్పటికైనా కష్టమేమీ కాదు. రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు భారత ప్రజల అనుభవంలోకి, ఆచరణలోకి అనువదించుకోవాలంటే – ముందు తక్షణమే జరగవలసిన పని – రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశిక సూత్రాలకు, పౌరుల ప్రాథమిక హక్కుల అధ్యాయానికి మధ్య వ్యత్యాసాన్ని పూర్తిగా తొలగించగలగాలి. ఆచరణలో అమలు చేయకుండా సంపన్న వర్గాల ప్రయోజనాలను కాపాడే ఆదేశిక సూత్రాలను పౌరుల ప్రాథమిక హక్కుల జాబితాలోకి మార్చడానికి పాలక వర్గాలు సంసిద్ధం కావాలి. పౌరుల ప్రాథమిక హక్కులకు ఆచరణలో విలువ ఇచ్చిననాడే 75వ స్వాతంత్ర్య అమృతోత్సవాలకు విలువా, సలువా ఉంటుంది.

ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రసిద్ధ కవుల్లో, కథకుల్లో ఒకరైన అట్టాడ అప్పల్నాయుడు 'చిటికెన వేలు' కథలోని ఒక పాత్ర గుర్తుకొస్తోంది: "మన దేశంలో జరిగే ఎన్నికల్లో ధనమూ, దైవమూ, మద్యమూ గాక నెత్తురు కూడా గద్దె ఎక్కడానికి అవసరం అని తెలుసుకున్నాడు. నెత్తురు మన మూకదయినా సరే, శత్రు మూకదయినా సరే పారాల్సిందే." మన ఎన్నికల నిర్వహణ తంతు 75 ఏళ్ల తర్వాత కూడా అలాగే కొనసాగుతోందంటే ఆశ్చర్యమా?!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మార్మోగుతోంది



ఆదివారం రాత్రి బీజింగ్: తియానన్మెన్ స్క్వేర్ ఈ నినాదాలతో నిండి పోయింది – 'మాకు విశ్వ జనీనమైన విలువలు కావాలి.' 'మాకు స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన కావాలి.' 'మాకు నియంతృత్వం వద్దు.' 'మాకు వ్యక్తిపూజ వద్దు.'

– గీతా మోహన్, జర్నలిస్ట్

ఔత్సాహిక నిపుణులు



ప్రతి ఔత్సాహికుడూ చైనా మీద తన అభిప్రాయం వెలువరిస్తున్నాడు. వీళ్లే నిపుణులు! బహుశా వీళ్లు బీజింగ్‌లో రెండు గంటలు ఆగివుండాలి. నాకు తెలిసిన ఒకాయన చైనా మీద ఏకంగా పుస్తకమే రాశాడు. ఎంతకాలం చైనాలో ఉన్నారని అడిగాను. నిజంగా ఆయన చెప్పింది: 'ఒక పదేళ్ల కింద ఒక రెండు వారాలు ఉన్నాను'. అయ్యో నిపుణులు!

– టోనీ నాష్, ఆంట్రప్రెన్యూర్

నిలదీస్తేనే సంక్షేమం



ప్రతీ యేడు మన ఎంపీలకు తమ నియోజక వర్గం మీద వెచ్చించడానికి 5 కోట్లు కేటాయిస్తారు. అలా ఐదేళ్లలో వాళ్లకు 25 కోట్లు వస్తాయి. ఇదంతా కూడా దేశం సృష్టించే సంపద, మనం చెల్లించే పన్నుల నుంచే! కాబట్టి ప్రశ్నలు అడగడానికి భయపడొద్దు. ఈ డబ్బు మొత్తం ఉన్నది మన సంక్షేమం కోసం వెచ్చించడానికే!

– అర్ఫి లాంబా, నట – నిర్మాత

అదే గుర్తు



ఉత్తరాదిలో ఉన్న మలయాళీల అందరి తరఫునా 2022 శీతాకాలం ప్రారంభమైందని ప్రకటిస్తున్నాను. కొబ్బరి నూనె గడ్డకట్టింది!

– మనూ జోసెఫ్, రచయిత

తేలిపోయిన విధానం



చైనాలో జరుగుతున్నది దూరం నుంచి గమనిస్తున్న వాడిగా, కొంత కాలం క్రితమే చైనా అనుసరించిన జీరో కోవిడ్ విధానాన్ని ఒక ఉదాహరణగా ప్రశంసించిన పాశ్చాత్యుల పట్ల అసహ్యం తప్ప ఇంకేమీ కలగడం లేదు.

– యువాన్ యీ ఝూ, రీసెర్చ్ ఫెలో

ఇన్‌బాక్స్

ఆదర్శ గిరిజన నేత

భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల సంరంభంలో ఉన్న మనం ఈశాన్య భారత్‌కు చెందిన భీంబర్ డియోరీని గుర్తుచేసుకోవాలి. ఈయన అసోంను తూర్పు పాకిస్తాన్‌లో విలీనం చేసే ప్రయత్నాలను విఫలం చేసిన జన నాయకుడు. అలాగే స్వదేశీ వర్గాలను ఉద్ధరించడంలో, అసోం ప్రయోజనాలను పరిరక్షించడంలోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన కృషి ఫలితంగా అసోం విధాన సభలో గిరిజనుల కొరకు 5 స్థానాలు రిజర్వు చేయబడ్డాయి. స్వాతంత్ర్యేచ్ఛ ఆయన రక్తంలోనే ఉంది. ప్రత్యేక మాతృభూమి కోసం 1945 మార్చి 21–23 మధ్య 'ఖాసీ దర్బార్ హాల్ తీర్మానాలు' చేశారు. ఈ తీర్మానాలతో వివిధ గిరిజన తెగలకు చెందిన స్థానిక నాయకులు తమ స్వతంత్ర మాతృభూమిని పునరుద్ధరించాలని నిర్ణయించుకున్నారు.



భీంబర్ డియోరీ

ఆయన 1903 మే 16న అసోంలోని శివసాగర్ జిల్లాలోని వనిదిహింగ్ గ్రామంలో గోదారం డియోరీ, బజోతి డియోరీ దంపతులకు జన్మించారు. సాధారణ గిరిజన యువకుడైన భీంబర్ అసోం సివిల్ పరీక్షలో ప్రథమ స్థానం సంపాదించారు. కానీ ఈయన గిరిజనుడైనందున బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించింది. పట్టుదలతో ఆయన డిబ్రుగఢ్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1933లో 'అసోం బ్యాక్‌వర్డ్ ప్లెయిన్స్ ట్రైబల్ లీగ్'ని స్థాపించి దాని వ్యవస్థాపక జనరల్ సెక్రటరీగా పని చేశారు. 1941 జూన్ 18న వివిధ విద్యాసంస్థలకు చెందిన వసతి గృహాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులను జనరల్ డైనింగ్ హాల్లోకి అనుమతించమని పోరాడారు. 1946 జూలై 8న అసోం ప్రభుత్వంలో అటవీ, కార్మిక శాఖ మంత్రిగా నియమితులైనారు. అసోం ప్రజల హృదయాల్లో భీంబర్ డియోరీ ఆదివాసీల నాయకుడిగానేగాక, ఆదర్శ జననేతగా నిలిచి 1947 నవంబర్ 30న తనువు చాలించారు.

– గుమ్మడి లక్ష్మీ నారాయణ
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి
(నవంబర్ 30న భీంబర్ డియోరీ 75వ వర్ధంతి)

కొలీజియం వ్యవస్థ పరిపూర్ణమా?



కామెంట్
కరణ్ థాపర్

న్యాయమూర్తులను ఎంపిక చేసే కొలీజియం వ్యవస్థ పరిపూర్ణమైనదేనా? సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి యు.యు. లలిత్ ఇటీవలి ఇంటర్వ్యూలలో అదే చెబుతున్నారు. రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంలో కొలీజియం అంతర్గతంగానే ఉందని ఆయన సూచించారు కూడా! ఈ రెండు అంశాల గురించి ఆయన చెప్పింది సరైందేనా?

పైన పేర్కొన్న వాటిలో రెండో అంశాన్ని మొదటగా తీసుకుందాం. కొలీజియం అనే పదాన్ని రాజ్యాంగంలో పొందు పర్చలేదు. 'చీఫ్ జస్టిస్ సమ్మతి'(కన్కరెన్స్) అనే పదాన్ని జోడించడానికి జడ్జీల నియామక విధానంలో చేసిన సవరణను కూడా రాజ్యాంగ సభలో ఆనాడే ఓడించారు. 1993లో మాత్రమే సుప్రీంకోర్టు దీన్ని సాధించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (2)లో ప్రస్తావించిన 'సంప్రదింపు' అనే పదం 'చీఫ్ జస్టిస్ సమ్మతి' అని నిర్ణయించడం ద్వారా సుప్రీంకోర్టు ఇది చేయగలిగింది. ఈ రెండు పదాలకు ప్రతి నిఘంటువులోనూ వేర్వేరు అర్థాలున్నాయనే వాస్తవాన్ని అలా పక్కన పెట్టారు.

రాజ్యాంగంలో కొలీజియం అనే భావన కనీసంగా భాగం కానప్పుడు, దాని ప్రాథమిక స్వరూపంలోనే కొలీజియం వ్యవస్థ అంతర్గతంగా ఉందని చెబితే నమ్మడానికి కష్టంగానే ఉంటుంది. "నేను ఒక పదం ఉపయోగిస్తున్నప్పుడు, నేను ఎంపిక చేసుకున్న విధంగానే దాని అర్థం ఉంటుంది" అనే సూత్రంపైనే కొలీజియం వ్యవస్థను రూపొందించినట్లు కనిపిస్తుంది.

ఇక పరిపూర్ణతకు సంబంధించిన ప్రశ్నకు వద్దాం. 2015 జాతీయ న్యాయమూర్తుల నియామకాల కమిషన్ కేసు సందర్భంగా జస్టిస్ చలమేశ్వర్, "కొలీజియం వ్యవస్థ కార్యాచరణలు ప్రజలకూ, చరిత్రకూ కూడా అపారదర్శకంగానూ, చేరుకోలేని విధంగానూ ఉంటున్నాయి" అని చెప్పారు. జస్టిస్ కురియన్ కూడా "కొలీజియం వ్యవస్థలో జవాబుదారీతనం, నిష్పాక్షికత లోపించాయి" అని అంగీకరించారు. కాబట్టి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు కూడా కొలీజియం వ్యవస్థ పరిపూర్ణమైనదని నమ్మలేదన్నమాట.

దీనికి ఇక్కడ కొన్ని కారణాలున్నాయి. న్యాయమూర్తులను ఎలా పరిగణనలోకి తీసుకుంటారు, లేదా వారిని ఏ ప్రాతిపదికన ఎంపిక చేసుకుంటారు అనే ప్రమాణాల గురించి నిజంగానే మనకు తెలీదు. కొలీజియం అనే న్యాయమూర్తుల నియామక వ్యవస్థ మూసిన తలుపుల వెనుక నడుస్తున్నందున బంధుప్రీతికి అపార అవకాశం ఉంటుంది. కొలీజియంలోని న్యాయమూర్తులు తమ ఛాంబర్‌లోని జూనియర్లను, చివరకు తమ బంధువులను సైతం జడ్జీలుగా నియమించారని ఆరోపణలు రావడంలో ఆశ్చర్య పడాల్సింది ఏమీ లేదు.

కొలీజియం ఎంపిక చేసిన న్యాయమూర్తుల నాణ్యత మరో పెద్ద సమస్యగా ఉంటోంది. ఈ దేశంలోని అత్యుత్తమ న్యాయమూర్తులను కొలీజియం నిర్లక్ష్యం చేసింది. దీనికి జస్టిస్ అజిత్ ప్రకాశ్ షా, జస్టిస్ అఖిల్ ఖురేషీ రెండు ఉదాహరణలుగా నిలుస్తారు. ఖురేషీ కేసు విషయానికి వస్తే, ఆయనను నియ



మించేంత వరకూ మరే ఇతర న్యాయమూర్తినీ నియమించడానికి కూడా జస్టిస్ నారిమన్ తిరస్కరించారు. కానీ అది ఎన్నటికీ జరగలేదు. ఘోరమైన విషయం ఏమిటంటే, అర్హత లేని వ్యక్తులు న్యాయమూర్తులుగా నియమితులు కావడం. దీనికి అద్భుతమైన ఉదాహరణ జస్టిస్ కర్ణన్. చివరకు ఈయన జైలుపాలయ్యేంతగా అధోగతిపాలయ్యారు. అదే సమయంలో జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎమ్ఆర్ షాల విషయానికి వస్తే, సిట్టింగ్ జడ్జీలుగా ఉండికూడా వారు బహిరంగంగానే ప్రధానమంత్రిని ప్రశంసల వర్షంలో ముంచెత్తారు. ఇది సుప్రీంకోర్టును తీవ్ర ఇబ్బందిలోకి నెట్టింది.

ఇలాంటి బలహీనతలతో కూడిన వ్యవస్థ పరిపూర్ణంగా ఉండగలదా? 1993లో కొలీజియం వ్యవస్థను రూపొందించడానికి మూలమైన తీర్పు చెప్పిన నాటి చీఫ్ జస్టిస్ వర్మ సైతం అలా భావించడం లేదు. 'బీబీసీ హార్డ్ టాక్' కోసం జస్టిస్ వర్మ 2004లో నాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. కొలీజియం విషయంలో తన అభిప్రాయాన్ని మార్చుకున్నాననీ, కార్యనిర్వాహకవర్గమైన ప్రభుత్వానికి కూడా పాత్ర కల్పించే జాతీయ న్యాయ కమిషన్‌ను తాను నమ్ము తున్నాననీ ఆయన అన్నారు. న్యాయమూర్తుల నియామకానికి ఇదే ఉత్తమమార్గంగా ఉంటుందని ఆయన అభిప్రాయ పడ్డారు.

న్యాయచతురత కలిగిన అభ్యర్థులను ఉన్నత స్థానాల్లో న్యాయమూర్తులుగా నిలిపినట్లయితే, కార్యనిర్వాహక వర్గం తన వ్యక్తిత్వం, సమగ్రత విషయంలో మరింత ఉత్తమంగా ఉండగలుగుతుందని జస్టిస్ వర్మ వాదించారు. కాబట్టే కొలీజియంలో ప్రభుత్వానికి కూడా తప్పకుండా పాత్ర కల్పించాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

వర్మ మరొక అడుగు ముందుకెళ్లారు. 1997లో, ఆయన ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు, కొలీజియం ఒక అభ్యర్థిని సిఫార్సు చేసింది. నిఘా సంస్థలు ఆయన పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని నాటి ప్రధాని ఐకే గుజ్రాల్ చెప్పగానే, జస్టిస్ వర్మ ఆ అభ్యర్థి పేరును వెనక్కు తీసుకున్నారు. తాను ఎందుకలా నిర్ణయం మార్చుకోవలసి వచ్చిందో తన తోటి అయిదుగురు న్యాయమూర్తులకు వివరించారు కూడా! వీరిలో తర్వాత ముగ్గురు ప్రధాన న్యాయమూర్తులు అయ్యారు. ఈ ముగ్గురిలో ఒకరు జస్టిస్ వర్మ చెప్పిన విషయాన్ని పక్కన పెట్టి, ఆయన ఉపసంహరించిన వ్యక్తిని తిరిగి నామినేట్ చేశారు. అలా ఆయన ప్రధాన న్యాయమూర్తి అయ్యేలా చూశారు. అంటే ఒక తప్పుడు వ్యక్తిని కూడా కొలీజియం నామినేట్ చేయగలదనడానికి ఇదే రుజువు అని వర్మ అన్నారు. ఇదేమీ ఏకైక ఉదాహరణ కాదని కూడా చెప్పారు.

ఒక సాధారణమైన పరిశోధన బయటపెట్టిన వాస్తవాలను, ఆందోళనలను మీ ముందు ఉంచాను. నేను న్యాయవాదిని కానీ, న్యాయమూర్తిని కానీ కాదు కాబట్టి వాటి గురించి నేను జాగరూకతతో ఉండలేను. అయితే నేను ఈ కథనం ప్రారంభంలోనే వేసిన రెండు ప్రశ్నలను సమర్థించడానికి ఇది సరిపోతుంది మరి. కొలీజియం వ్యవస్థ పరిపూర్ణమైనదేనా? అది మన రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంలోనే అంతర్గతంగా ఉందని భావించవచ్చా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

తగిన శిక్ష

కవికుమారులు సుకుమారులు. అల్ప సంతోషులు. వాళ్ళు కావ్యాలు రాసుకొనేది, చదివిన సాటివాళ్లెవరైనా, 'బాగా రాశావయ్య!' అని సహృదయతతో ఆ కావ్యంలో గుణాలను గుర్తించి, రెండు మెచ్చుకోలు మాటలు పలుకుతారని. కవి దిగ్గజాలెవరికో తప్ప కావ్య రచన వల్ల కావలసినంత యశస్సూ, ధనమూ లభించవు. పలుకుల తల్లి కటాక్షం ఉన్న చోట, పద్మాలయ అనుగ్రహం ఉండటం అరుదు.

చాలా మంది కవులకు ఆ రెండు మెప్పు మాటలు కూడా అందవు. పైపెచ్చు అసూయ వల్లనో, అహంకారం వల్లనో, అజ్ఞానం చేతో, అతితెలివి చేతో ఆ కావ్య కుసుమాన్ని అవహేళన చేసే అరసికులు తారసపడి, అకారణంగా వాళ్ళ మనసు గాయపరచటం కూడా జరుగుతుంటుంది. అలా కవుల కళానైపుణ్యం గ్రహించలేక కరుకుమాటలతో, కారుకూతలతో ఎద్దేవా చేసే కాపురుషులకు శిక్ష ఏమిటి?



జ్యోతిర్మయం

'లడ్డూ రుచికీ, రంపపుపొట్టుకూ తేడా తెలియని కీటకంలాగా రసజ్ఞతా రాహిత్యంతో బతకటమే వాళ్ళకు శిక్ష. అది చాలదా?' అన్నాడొక కవీంద్రుడు. '...యే రసనం జానన్తి, తేషాం స ఏవ దండః'– రసజ్ఞత లేనివారికి ఆ రసజ్ఞత లోపమే తగిన శిక్ష.

ఈ మాట ఇతర దుర్గుణాలకు కూడా వర్తిస్తుంది. ఆశ మితిమీరి అన్ని విధాల దుశ్చర్యలకూ పాలుపడేవాడికి, వేరే జైలు అక్కర్లేదు– అతడి ఆశాపాశాలే అతడిని అన్ని విధాలా బంధించేస్తాయి. దురాశ యావజ్జీవ కారావాసం.

ఇతరులను చూసి ఈర్ష్య చెందే దుర్యోధన దుశ్శాసనుల కయితే కంటికి కునుకే రాదు. 'కంటికి నిద్ర వచ్చునె, సుఖంబగునే రతికేళి, జిహ్వకున్వంటక మించునే...' అన్న నిరంతర క్షుభిత స్థితి అసూయా గ్రస్తులకు వాళ్ళ అవగుణం విధించే శిక్ష.

అలవిమాలిన అహంకారికి ఆశ్రితులెందరు అడుగులకు మడుగులొత్తినా, తన ఘనతకు నివాళులెత్తని స్వాభిమానులెందరో తనను లక్ష్యం చేయటం లేదన్న తపన తప్పనిసరి. అతగాడికది శిక్ష.

పాపిష్టి కోపిష్ఠితనంతో క్రూరత్వం వహించేవాడికి ఆ క్రోధమే అంతశ్శత్రువై మనసునూ, మెదడునూ దహించి అశాంతికీ, అనారోగ్యానికీ కారణమౌతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.షష్ఠి ప.3.50 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: శ్రవణం ప.1.44 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: సా.5.31 నుండి 7.01 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.27 నుండి 9.13 వరకు, తదుపరి రా.10.31 నుండి 11.23 వరకు, అమృతఘడియలు: ఉ.9.27 నుండి 10.36 వరకు; రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు; యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు; సూర్యోదయం 6.16 ; సూర్యాస్తమయం 5.20.

క్లుప్తంగా

సకల పాపహరణం.. చక్రస్నానం

- ముగిసిన శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు



పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం

చంద్రగిరి/తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20న ధ్వజారోహణంతో ప్రారంభమై సోమవారం చక్రస్నానంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలలో ఆఖరి, ముఖ్య ఘట్టమైన చక్రస్నానం పద్మసరోవరం(పుష్కరిణి)లో లక్షలాది మంది భక్తుల నడుమ వైభవంగా జరిగింది. అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి పల్లకీ ఉత్సవం జరిపారు. తిరుమల నుంచి శ్రీవారు పంపించిన ముత్తైదువు సారెతో అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు జియ్యర్ స్వాముల నేతృత్వంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు చక్రత్తాళ్వార్లకు పుష్కరిణిలో చక్రస్నానం జరిపారు. మంగళవారం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు వీరబ్రహ్మం, సదా భార్గవి, బోర్డు సభ్యుడు, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సీవీఎస్‌వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు. కాగా, పంచమీతీర్థం సందర్భంగా సోమవారం శ్రీపద్మావతి అమ్మవారికి తన పతి అయిన శ్రీవారు జన్మదిన కానుకగా సారెతో పాటు రూ.25లక్షలు విలువ చేసే 500 గ్రాముల బరువు గల రెండు పతకాలు, ఒక హారం పంపించారు. ఈ ఆభరణాలను స్నపన తిరుమంజనంలో అమ్మవారికి అలంకరించారు.

ఆర్టీసీ యూటీఎస్ చేతి పుస్తకాల ఆవిష్కరణ



సాక్షి, అమరావతి: ఆర్టీసీలో యూనిఫైడ్ టికెటింగ్ సొల్యూషన్(యూటీఎస్) విధానాన్ని వివరించే చేతి పుస్తకాలను ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సోమవారం ఆవిష్కరించారు. నగదు రహితంగా టికెట్ల జారీ కోసం ఆర్టీసీ యూటీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన 40 వేల చేతి పుస్తకాలను ఆర్టీసీ ఉద్యోగులకు పంపిణీ చేయనున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు అందరూ చేతి పుస్తకాలను సద్వినియోగం చేసుకుని యూటీఎస్ విధానాన్ని విజయవంతం చేయాలని ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు.

తెలుగు మహిళకు టీడీపీ నేత వేధింపులు

- వాట్సాప్‌లో అసభ్యకర మెసేజ్‌లు
- డోన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు
- కేసు నమోదు.. నిందితుడి అరెస్ట్



టీడీపీ నేత కేఈ కృష్ణమూర్తితో నిందితుడు వెంకటరమణ ఆచారి (ఫైల్)

డోన్: నంద్యాల జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన టీడీపీ నేత చంద్రపల్లె వెంకటరమణ ఆచారి.. ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిని లొంగదీసుకునేందుకు వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో అసభ్యకర మెసేజ్‌లు పంపుతూ మానసిక వేదనకు గురిచేస్తున్నాడు. చివరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలు సోమవారం పోలీసులను కలిసి వెంకటరమణ ఆచారిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. డోన్ సీఐ మల్లికార్జున తెలిపిన వివరాలు.. టీడీపీ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పీఏనంటూ వెంకటరమణఆచారి విశాఖకు చెందిన బాధితురాలితో పరిచయం పెంచుకున్నాడు. కొన్నాళ్లుగా అసభ్యకరంగా మెసేజ్‌లు పెడుతూ ఆమెను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆమె విసుగు చెంది సోమవారం కొందరు మహిళా ప్రతినిధులను వెంట తీసుకుని వైజాగ్ నుంచి డోన్‌కు వచ్చి వెంకటరమణ ఆచారిని నిలదీసే ప్రయత్నం చేయగా.. ఆచారి, ఆయన కుటుంబ సభ్యులు ఆమెపై దాడి చేశారు.

సొంత పార్టీలోనే మహిళా నేతకు రక్షణ కరువైంది..

రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్న తన పట్ల ఆచారి ప్రవర్తించిన తీరుపై పలు మార్లు పార్టీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఉన్నత పదవిలో ఉన్న తనకే సొంత పార్టీ నేతల నుంచి రక్షణ కరువైందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.

తూర్పు తీరంపై ఓఎన్‌జీసీ పట్టు!



- ఆ సంస్థకు కీలక ఆయిల్‌బ్లాక్‌గా మారిన ఈస్టర్న్ ఆఫ్‌షోర్
- ఓడలరేవు టెర్మినల్‌లో రూ.53 వేల కోట్ల పెట్టుబడి
- సముద్ర గర్భంలో పూర్తయిన 300 కిలోమీటర్ల పైప్‌లైన్
- రెండేళ్లలో 1.22 లక్షల మిలియన్ స్టాండర్డ్స్ క్యూబిక్ మీటర్ల సహజవాయువు ఉత్పత్తే లక్ష్యం

కేజీ బేసిన్‌లోని ఈస్టర్న్ ఆఫ్‌షోర్‌లో ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ:

కృష్ణా, గోదావరి బేసిన్‌లోని అతిపెద్ద ఆయిల్ బ్లాక్‌గా ఉన్న 'ఈస్టర్న్ ఆఫ్‌షోర్'(తూర్పు తీరం)పై పట్టు సాధించే దిశగా ఓఎన్‌జీసీ అడుగులు వేస్తోంది. రిలయన్స్, కెయిర్న్ ఎనర్జీ వంటి ప్రైవేటు చమురు సంస్థలతో పోటీపడి.. నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. ఈస్టర్న్ ఆఫ్ షోర్‌లో డ్రిల్లింగ్ కార్యకలాపాలను విస్తృతం చేసేందుకు రూ.కోట్లు కుమ్మరిస్తోంది. తొలి దశలో భాగంగా ఇక్కడ చమురు, సహజవాయువు అన్వేషణ కోసం రూ.53 వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. కాకినాడలోని ఈస్టర్న్ ఆఫ్‌షోర్ కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలోని అల్లవరం మండలం ఓడలరేవులో 300 ఎకరాల్లో భారీ టెర్మినల్‌ను ఏర్పాటు చేసింది. ఈ టెర్మినల్ ద్వారా రోజుకు 15 వేల మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజవాయువు, 78 వేల బ్యారెల్స్ క్రూడ్ వెలికితీయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఓడలరేవు టెర్మినల్‌తో పాటు యానాం సమీపంలోని గాడిమొగలో ఉన్న గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ టెర్మినల్‌ను టేకోవర్ చేసి ఈస్టర్న్ ఆఫ్‌షోర్‌లో విలీనం చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా సముద్ర గర్భంలో 425 కిలోమీటర్ల పైప్‌లైన్ చేపట్టాలి. ఇప్పటికే ఆఫ్‌షోర్‌లో డ్రిల్లింగ్ పూర్తయిన బావులను అనుసంధానిస్తూ 300 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేసినట్టు ఓఎన్‌జీసీ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు డ్రిల్లింగ్ ప్రక్రియను పూర్తి చేసిన 45 బావులలో సహజవాయువును వెలికి తీస్తున్నారు. ఈ బావుల నుంచి రోజుకు 35 వేల బ్యారెల్స్ క్రూడ్, సహజవాయువు ఉత్పత్తిని ఓఎన్‌జీసీ ప్రారంభించింది.

భారీ లక్ష్యంతో ముందుకు..

ఇప్పటివరకు కేజీ బేసిన్‌లో రాజమండ్రి అసెట్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చింది. అక్కడ నిల్వలు నిండుకోవడంతో ఇదే బేసిన్‌లోని ఆఫ్‌షోర్‌లో రిలయన్స్, కెయిర్న్ ఎనర్జీ వంటి ప్రైవేటు చమురు సంస్థలతో పోటీపడుతోంది. ఆ సంస్థలకు దీటుగా విదేశీ పరిజ్ఞానంతో రికార్డు స్థాయిలో 1,45,000 చదరపు కిలోమీటర్ల పరిధిలో కార్యకలాపాలను ముమ్మరం చేసింది. సహజంగా తీరం నుంచి 80 మీటర్ల వరకు డ్రిల్లింగ్ నిర్వహిస్తారు. ఈ బ్లాక్‌లో నార్తరన్ డిస్కవరీ ఏరియాలో 1,800 మీటర్లు, సదరన్ డిస్కవరీ ఏరియాలో 3,100 మీటర్ల లోతున డ్రిల్లింగ్ చేయాల్సి ఉంది. డ్రిల్లింగ్ పూర్తయిన 45 బావుల నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు వీలుగా ఫ్లోటింగ్ ప్రొడక్షన్ స్టోరేజ్, లోడింగ్ ప్లాట్‌ఫార్మ్‌లను అభివృద్ధి చేసింది. ఈ బేసిన్‌లో నిర్వహిస్తోన్న డ్రిల్లింగ్‌తో 2024 నాటికి 1.22 లక్షల మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఓఎన్‌జీసీ ముందుకెళ్తోంది.

- ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 9 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డు వద్ద 10 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 12.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్యాన్సర్ కట్టడికి సహకారం అందించండి

- అన్ని రకాల క్యాన్సర్‌లకు ఏపీలో ఉచిత వైద్యం
- పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నాం
- ఢిల్లీలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి విడదల రజిని



వివిధ కంపెనీల ప్రతినిధులతో మంత్రి రజిని

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: క్యాన్సర్ వ్యాధికి మెరుగైన చికిత్స అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. తమకు తగిన సహకారం అందించాలని వైద్య రంగంలో వివిధ సేవలు అందిస్తున్న పలు ప్రముఖ సంస్థలను మంత్రి కోరారు. సోమవారం ఢిల్లీలో నాట్ హెల్త్ ఇండియా సంస్థ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పేదలందరికీ అత్యంత వేగంగా, ఉచితంగా, సులువుగా వైద్యం అందాలనే లక్ష్యంతో సీఎం జగన్ పనిచేస్తున్నారని చెప్పారు. క్యాన్సర్ చికిత్స కోసం ఏపీ ప్రజలెవ్వరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో.. ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యేక ఆస్పత్రులు అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. 17 కొత్త వైద్య కళాశాలలను నిర్మిస్తున్నామన్నారు. వైద్య రంగంలో రోగ నిర్ధారణ, చికిత్స, నిరంతర సంరక్షణ విషయంలో విజువల్ టెక్నాలజీని వైఎస్ జగన్ ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తోందని చెప్పారు.

వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముందుకు..

రాష్ట్రంలో పెద్ద ఎత్తున వైద్య సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో వైద్య సంబంధమైన సంస్థల సహకారం తమకు అవసరమని మంత్రి రజిని చెప్పారు. వైద్య పరికరాలు, మందులు, అత్యాధునిక సాంకేతిక సేవల అవసరం ఇప్పుడు ఏపీకి ఉందని వివరించారు. వైద్య సిబ్బందికి ఆధునిక నైపుణ్యాలకు సంబంధించిన శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఆయా సంస్థల సేవలను వినియోగించుకునేందుకు ప్రణాళిక రూపొందించాలని ఉన్నతాధికారులకు సూచించారు. నాట్ హెల్త్ ఇండియా, ఇతర సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. నూతన వైద్య కళాశాలలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. పరికరాలు, మందులు, సాంకేతిక సేవల విషయంలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, ఎస్.ఆర్.ఎల్ డయాగ్నోస్టిక్స్, పాత్‌కైండ్ డయాగ్నోస్టిక్స్, ప్రో ట్రైబ్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ సెన్స్ బాగున్నా.. లైసెన్స్ రాలేదు

- చేతులు లేకపోయినా 15 ఏళ్లుగా డ్రైవింగ్ చేస్తున్న సత్తిబాబు




రెండు చేతులు లేని సత్తిబాబు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా శంఖవరం ప్రాంతానికి చెందిన కొన్నుంపూడి సత్తిబాబు దివ్యాంగుడు. 15 ఏళ్లుగా గేర్లు లేని మోటార్ సైకిల్ నడుపుతూ ఇంటింటికీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. సత్తిబాబు రెండు చేతులు లేకపోయినా.. మోటార్ సైకిల్‌ను అవలీలగా హ్యాండిల్ చేయగలడు. సోమవారం కత్తిపూడి రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి.. తాను ద్విచక్ర వాహనంపై ఇంటింటికీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తానని, టూ వీలర్ లైసెన్స్ జారీ చేయాలని రవాణా శాఖ అధికారిని కోరాడు. ఆశ్చర్యానికి గురైన రవాణా శాఖ అధికారి వాహనం నడిపి చూపాలని కోరగా.. సత్తిబాబు ట్రాక్‌పై ఎనిమిదో అంకె నమూనాలో అవలీలగా వాహనం నడిపేశాడు. నిజానికి 90 శాతం మంది ఈ ఎనిమిదో అంకె నమూనా డ్రైవింగ్‌లో కాస్త తడబడతారని, సత్తిబాబు మాత్రం తడబాటు లేకుండా వాహనం నడిపాడని తెలిపారు. కానీ.. రెండు చేతులు లేని సత్తిబాబుకు నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయలేమని, ఉన్నతాధికారులను సంప్రదించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామన్నారు.

రాష్ట్ర విభజన పిటిషన్లపై విచారణ వాయిదా

- కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు
- తదుపరి విచారణ ఫిబ్రవరి 22వ తేదీకి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజనపై దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఆయా పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. విభజనపై దాఖలైన 27 పిటిషన్లు సోమవారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. పిటిషన్లు ఏయే అంశాలపై దాఖలయ్యాయని ధర్మాసనం ప్రశ్నించగా.. రాష్ట్ర విభజన వ్యతిరేకిస్తూ, ప్రక్రియ సక్రమంగా లేదని, విభజన హామీలు అమలు చేయాలని వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయని న్యాయవాది శ్రావణ్‌కుమార్ తెలిపారు. విభజనకు సంబంధించిన కేసులు తొలుత పరిశీలిస్తామని జస్టిస్ జోసెఫ్ తెలిపారు. విభజన పూర్తయి రాష్ట్రాలు ఏర్పడి ఎనిమిదేళ్లు అయిందని, ఈ నేపథ్యంలో రాజ్యాంగపరమైన అంశాలపై విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది ఆదినారాయణ రావు కోరారు. పిటిషనర్ ఇన్ పర్సన్ ఉండవల్లి అరుణ్‌కుమార్ తాను విభజన సమయంలో కాంగ్రెస్ ఎంపీనని, సభ నుంచి తనను బహిష్కరించారని ధర్మాసనానికి తెలిపారు. విభజనకు సంబంధించి ఎలాంటి విధాన ప్రక్రియను అనుసరించలేదని, రాజ్యాంగ విరుద్ధంగా చేశారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి రాకుండా మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. ఆర్టికల్ 368 ఉంది కదా అని జస్టిస్ బీవీ నాగరత్న ప్రశ్నించగా.. నాడు సభలో ఆర్టికల్ 368ను అనుసరించలేదని, కనీసం డివిజన్ కూడా చేయలేదని తెలిపారు. టీవీల ప్రసారాలు నిలిపివేసి రాజ్యాంగంలోని ఆర్టికల్ 367(3) అమలు చేశారన్నారు. రాష్ట్ర విభజనను ఏపీ శాసనసభ, శాసనమండలి తిరస్కరించిన విషయాన్ని బిల్లులో ప్రస్తావించలేదని తెలిపారు. గతంలో రాష్ట్రాలు ఏర్పడినపుడు ఇలా జరగలేదా అని జస్టిస్ జోసెఫ్ ప్రశ్నించారు. గతంలో జరిగిన విభజనలు ఉండవల్లి వివరించారు. అనంతరం పిటిషనర్ల విజ్ఞప్తులు, కోరుకుంటున్న ఉపశమనాలకు సంబంధించి కేంద్రం కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 22వ తేదీకి వాయిదా వేసింది.

రెండోరోజూ అదే రచ్చ.. అదే యాగీ

- నిరసనకారుల తీరుతో కోర్టు హాళ్లలో ఉద్రిక్తత
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రధాన న్యాయమూర్తి
- బహిష్కరణ పేరుతో న్యాయవాదులను అడ్డుకున్న టీడీపీ న్యాయవాదులు
- మాజీమంత్రి నారాయణ కేసులో మాత్రం గుట్టుచప్పుడు కాకుండా వాదనలు



సాక్షి, అమరావతి: న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ దొనడి రమేష్‌ల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులను వ్యతిరేకిస్తూ టీడీపీ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులు రెండోరోజు సోమవారం కూడా హైకోర్టు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. వారి చర్యలతో కోర్టు హాళ్లలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. న్యాయవాదులందరినీ విధుల బహిష్కరణ పేరుతో కేసుల్లో వాదనలు వినిపించకుండా అడ్డుకుని బయటకు తీసుకొచ్చిన టీడీపీ న్యాయవాదులు.. తమకు సంబంధించిన కేసుల్లో మాత్రం వాదనలు వినిపించారు. మధ్యాహ్నం మాజీ మంత్రి నారాయణకు సంబంధించిన కేసులో గుట్టుచప్పుడు కాకుండా వాదనలు వినిపించారు. తమను విధుల బహిష్కరణ పేరుతో బయటకు తీసుకొచ్చిన టీడీపీ న్యాయవాదులు వారి కేసుల్లో మాత్రం వాదనలు వినిపించడంపై న్యాయవాదులు మండిపడ్డారు. అంతకుముందు కోర్టు కార్యకలాపాలు మొదలు కాగానే టీడీపీ న్యాయవాదులు సువ్వారి శ్రీనివాస్, పుల్లగూర నాగరాజు, గింజుపల్లి సుబ్బారావు, ప్రణతి, బసవేశ్వరరావులతో పాటు ఇతర న్యాయవాదులు వాసిరెడ్డి ప్రభునాథ్, పదిరి రవితేజ, పాటిబండ్ల ప్రభాకర్‌రావు, చాపర్ల సీతారాం, గుర్రం రామచంద్రరావు తదితరులు ఆయా కోర్టు హాళ్లలోకి వెళ్లి విధుల బహిష్కరణను న్యాయమూర్తుల దృష్టికి తీసుకొచ్చారు.

అప్పుడెందుకు స్పందించలేదు.. ఇప్పుడెందుకు స్పందిస్తున్నట్లు?

ఈ సమయంలో రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ), రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు యర్రంరెడ్డి నాగిరెడ్డి తీవ్రంగా స్పందించారు. తాము విధులను బహిష్కరించడం లేదన్నారు. కొలీజియం సిఫారసుల పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం, వ్యతిరేకత లేవని చెప్పారు. అనంతరం ప్రభునాథ్ వాసిరెడ్డి నేతృత్వంలో న్యాయవాదులు.. ప్రధాన న్యాయమూర్తి కోర్టు హాలుకు వచ్చారు. జస్టిస్ దేవానంద్, జస్టిస్ రమేష్‌లను బదిలీ నిర్ణయం తప్పని, దానికి నిరసనగా విధుల బహిష్కరణ కార్యక్రమం చేపట్టామని దీనికి సహకరించాలని ప్రధాన న్యాయమూర్తిని కోరారు. బెంచ్ దిగి వెళ్లిపోవాలని ప్రభునాథ్ అభ్యర్థించారు. ఈ సమయంలో టీడీపీకి చెందిన కొందరు న్యాయవాదులు తమ స్వరాలను పెంచారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు హాలులో న్యూసెన్స్ చేసినా, అరాచకం సృష్టించినా సహించేది లేదని నిరసనకారులకు తేల్చి చెప్పారు. ఈ చర్యలను కోర్టు ధిక్కారం కింద పరిగణించి, న్యూసెన్స్ చేసిన వారందరికీ నోటీసులు జారీచేస్తానన్నారు. కోర్టు హాలులో సర్కస్ చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని, తెగేవరకు దేన్నీ లాగొద్దని స్పష్టం చేశారు. తాము బెంచ్ దిగి వెళ్లే ప్రసక్తే లేదని, కేసులను విచారిస్తామని స్పష్టం చేశారు. సీజే ఆగ్రహంతో వెనక్కి తగ్గిన నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో సీజే కోర్టు తమ కార్యకలాపాలను యథాతథంగా కొనసాగించింది. బదిలీలను అడ్డుకునేందుకు హైకోర్టు న్యాయవాదులు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేసుకున్నారు. బదిలీలు ఆగేంతవరకు రోజూ భోజన విరామ సమయంలో హైకోర్టు ప్రధానగేటు వద్ద నిరసన చేపట్టాలని తీర్మానించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, కొలీజియం సభ్యులను కలిసి బదిలీలపై విజ్ఞప్తి చేయాలని, రాష్ట్రపతి, కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్‌ను సైతం కలవాలని తీర్మానం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేటు వారి కార్యాలయం, కాకినాడ

రిఫ్ : ఎల్5/జెన్/6/2022 — ఫారమ్ (నమూనా) నెం.VII — తేది : 28-11-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనముకొరకై అనగా రైల్వే లైన్ నిర్మాణం కొరకు భూమి కావలెనని జిల్లా కలెక్టరు, కాకినాడ జిల్లా, కాకినాడ వారు భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట కాకినాడ జిల్లా కలెక్టరు వారు సంతృప్తి చెంది ఈ షెడ్యూలు దాఖలా భూములను అనగా తొండంగి మండలం, కోన ఫారెస్ట్ గ్రామంలో మొత్తం ఎ. 3.3325 సెంట్లు విస్తీర్ణం గల భూములు ప్రజా ప్రయోజనాల నిమిత్తం అనగా రైల్వే లైన్ నిర్మాణం కొరకు అవసరమై ఉన్నదని కాకినాడ జిల్లా కలెక్టరు, కాకినాడ వారు భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన వారు సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

కాకినాడ జిల్లా కలెక్టరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు ఎ. 3.3325 సెంట్లు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనముకొరకై అనగా రైల్వే లైన్ నిర్మాణం కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

మండలం : తొండంగి — గ్రామం : కోనా ఫారెస్ట్

క్రమ సంఖ్య	సర్వే నెంబరు సబ్ డివిజను నెంబరు	పూర్తి విస్తీర్ణం ఎ. సెంట్లు	భూసేకరణ సేకరించిన విస్తీర్ణం ఎ.సెంట్లు	భూ స్వభావం	యజమాని / పట్టాదారుని పేరు లేదా అనుభవదారుని పేరు	హద్దుల వివరములు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	భూమిపై నున్న భవనములు లేదా మొక్కలు లేదా ఇతరములు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)				(8)
1	450/1ఎ	0.0025	0.0025	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	451	450/1బి	450/1డి	450/1డి	తాడిచెట్లు-1 కాజా చెట్లు-1
2	451/1ఎ2	0.32	0.32	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	451/1ఎ1	451/1ఎ3	451/1డి2,1డి3	451/1ఎ4	తాడిచెట్లు-13 కాజా చెట్లు-5
3	451/1డి2	0.17	0.17	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	451 1డి1	451/1డి3	451/1ఎ2	451/2డి, 2బి	సరుగుడు చెట్లు-3
4	451/2డి	0.25	0.25	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	451/2ఎ	451/2బి	451/1డి2	451/3డి	జమ్ముదుచెట్లు-5 కుంకుడు
5	451/3డి	0.23	0.23	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	451/3ఎ	451/3బి	451/4డి	451/2డి	చెట్లు-1 మామిడిచెట్లు-7
6	451/4డి	0.21	0.21	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	451/4ఎ	451/4బి	461/	451/3డి	సపోటాచెట్లు-2 వేరేడు చెట్లు-3
7	452/9డి	0.04	0.04	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	452/9ఎ	452/9బి	452/10డి2	452/9ఎ	సరుగుడుచెట్లు-3
8	452/10డి2	0.21	0.21	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	452/10డి1	452/10డి3	452/12	452/9డి, 9ఎ	
9	459/1డి	0.32	0.32	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	459/1ఎ	459/1బి	452	459/2డి, 2బి	తాడిచెట్లు-13 కాజా చెట్లు-2
10	459/2డి	0.31	0.31	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	459/2ఎ	459/2బి	459/3డి, 3బి	459/1డి, 1ఎ	జమ్ముదుచెట్లు-3 వేరేడుచెట్లు-2
11	459/3డి	0.18	0.18	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	459/3ఎ	459/3బి	459/4డి, 4ఎ	459/2డి, 2బి	సరుగుడు చెట్లు-4
12	459/4ఎ	0.02	0.02	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	459/4డి	459/4డి	459/4డి	459/3డి	మిగతచెట్లు-1
13	461/1ఎ2	0.08	0.08	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/1ఎ1	461/1ఎ3	461/1డి2	451	జమ్మెదుచెట్లు-7 తాడిచెట్లు-2
14	461/1డి2	0.09	0.09	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/1డి1	461/1డి3	461/1బి2, 1బి3	461/1ఎ2	కాజాచెట్లు-2
15	461/1బి2	0.09	0.09	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/1బి1	461/1బి3	461/2ఎ2	461/1డి2	
16	461/2ఎ2	0.12	0.12	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/2ఎ1	461/2ఎ3	461/2డి2	461/1బి2, 1బి1	
17	461/2డి2	0.11	0.11	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/2డి1	461/2డి3	461/3ఎ2,3ఎ1	461/2ఎ2, 2ఎ1	
18	461/3ఎ2	0.02	0.02	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/3ఎ1	461/3ఎ3	461/3డి3,3డి2	461/2డి2	
19	461/3డి2	0.15	0.15	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/3డి1	461/3డి3	461/3బి2	461/3ఎ2	
20	461/3బి2	0.16	0.16	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/3బి1	461/3బి3	461/4ఎ2	461/3డి2	
21	461/4ఎ2	0.12	0.12	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	461/4ఎ1	461/4ఎ3	461/4ఎ2	461/3బి2	
22	461/4డి1	0.07	0.07	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	452	461/4డి2	461/5ఎ	461/4ఎ2	
23	461/5ఎ	0.05	0.05	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	452	461/5డి	461/6ఎ	461/4డి1	
24	461/6ఎ	0.01	0.01	జి.మెరక	దివిస్ లేబొరేటరీ లిమిటెడ్	452	461/6డి	461/7	461/5ఎ	
	మొత్తము		3.3325							

సం/- డా॥ కృతిక శుక్ల I.A.S., కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, కాకినాడ జిల్లా, కాకినాడ

అదో చెత్త సినిమా

కశ్మీర్ ఫైల్స్‌పై ఇఫీ జ్యూరీ హెడ్ లపిడ్ సంచలన వ్యాఖ్యలు

- ఇఫీలో ఎలా ప్రదర్శించారు?
- కేంద్ర మంత్రుల ముందే విమర్శలు



పణజీ: ఈ ఏడాది దేశ వ్యాప్తంగా సంచలన విజయం సాధించిన కశ్మీర్ ఫైల్స్ సినిమాపై 53వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) జ్యూరీ హెడ్ నదవ్ లపిడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ''కశ్మీర్ ఫైల్స్ చూసి మేమంతా షాకయ్యాం. చాలా డిస్టర్బయ్యాం. ఫక్తు ప్రచారం కోసం తీసిన చెత్త సినిమా అది'' అంటూ సోమవారం ముగింపు వేడుకల సందర్భంగా వేదికపైనే కడిగి పారేశారు. అసలా సినిమాను ఇఫీ కాంపిటీషన్ విభాగంలో ప్రదర్శనకు ఎలా అనుమతించారంటూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ తదితరుల సమక్షంలోనే నిర్వాహకులను నిలదీశారు. ''ఇంటర్నేషనల్ కాంపిటీషన్ విభాగంలో ప్రదర్శించిన 15 సినిమాల్లో 14 చాలా బావున్నాయి. కానీ 15వ సినిమా కశ్మీర్ ఫైల్స్ చూసి అక్షరాలా షాకయ్యాం. కళాత్మక స్పర్థకు వేదిక కావాల్సిన ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో అలాంటి చౌకబారు సినిమాను ప్రదర్శించడం అస్సలు సరికాదు. అందుకే నా అభ్యంతరాలను, అభిప్రాయాలను వేదికపై ఉన్న అందరి ముందే వ్యక్తం చేస్తున్నా'' అన్నారు. 1990ల్లో కశ్మీర్ హిందూ పండిట్ల మూకుమ్మడి హత్యాకాండ, ఫలితంగా లోయనుంచి వారి భారీ వలసలు నేపథ్యంగా దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి రూపొందించిన కశ్మీర్ ఫైల్స్ ఈ ఏడాది బాలీవుడ్లో అత్యధిక కలెక్షన్లు రాబట్టిన సినిమాల జాబితాలో నిలిచింది. అయితే పలు వివాదాలకూ ఇది కేంద్ర బిందువుగా నిలిచింది. వాస్తవాలను వక్రీకరించారంటూ సినిమాపై విమర్శలు వెల్లువెత్తాయి. లపిడ్ ఇజ్రాయెల్‌కు చెందిన సినీ దర్శకుడు. పలు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సినీ అవార్డుల గ్రహీత. కేన్స్ వంటి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో జ్యూరీ సభ్యునిగా చేశారు.

క్లుప్తంగా...

'విభజించు, పాలించు' విధానం వదులుకోండి

అహ్మదాబాద్: గుజరాత్ ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే 'విభజించు, పాలించు' విధానాన్ని వదిలించుకోవాలని కాంగ్రెస్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హితవు పలికారు. భావ్‌నగర్ జిల్లాలో సోమవారం ఆయన ఎన్నికల సభలో ప్రసంగించారు. నర్మదా బచావో ఉద్యమ నేత మేధా పాట్కర్ రాహుల్ గాంధీతో కలిసి భారత్ జోడో యాత్రలో పాల్గొనడంపై మోదీ విమర్శలు ఎక్కుపెట్టారు. ''కాంగ్రెస్ చేసిన పాపాల వల్ల గుజరాత్ ప్రజలు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నారు. అందుకే ఆ పార్టీని చిత్తుగా ఓడించారు. అర్బన్ నక్సలైట్లను గుజరాత్‌లో అడుగు పెట్టనివ్వొద్దని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ హయాంలో అరాచకత్వం, ఉగ్రవాదం, బంధుప్రీతి, ఓటు బ్యాంకు రాజకీయాలే రాజ్యమేలాయన్నారు.

భారత్‌లోని అన్ని మతాల వారి పూర్వీకులు హిందువులే

ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్

దర్భంగా(బిహార్): భారతదేశంలో నివసించేవారంతా హిందువులేనని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో సోమవారం ఆయన ఆరెస్సెస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. వేర్వేరు సంస్కృతుల వల్లే దేశంలో భిన్నత్వం పరిఢవిల్లుతోందన్నారు. ''భరతమాతను పూజిస్తూ సంస్కృత కీర్తనలు పలికేందుకు అంగీకరించేవారు, దేశ సంస్కృతిని కాపాడుకొనేందుకు అంకితభావంతో కృషి చేసేవారు హిందువులు. మన దేశంలో వేర్వేరు మతాల ప్రజలున్నా వారి పూర్వీకులంతా ఒకప్పుడు హిందువులే'' అన్నారు.

బాధపడితే క్షమించండి

మహిళలను కించపర్చాలని కాదు: రాందేవ్

ముంబై: దుస్తులు ధరించకపోయినా మహిళలు అందంగా ఉంటారంటూ తాను చేసిన వ్యాఖ్యలపై యోగా గురువు రాందేవ్ క్షమాపణలు చెప్పారు. మహిళలను కించపర్చాలన్న ఉద్దేశం తనకు లేదన్నారు. రాందేవ్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడం, నిరసన ప్రదర్శనలు జరగడం తెలిసిందే.

ఏడాది తర్వాతే నిర్ణయం



ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఒకప్పటి కంచుకోట అయిన అమేథీ లోక్‌సభ స్థానం నుంచి తాను మళ్లీ బరిలోకి దిగడంపై ఏడాది, ఏడాదిన్నర తర్వాత నిర్ణయం తీసుకుంటామని రాహుల్‌గాంధీ సోమవారం ఇండోర్‌లో మీడియాకు చెప్పారు. తనపై బురదజల్లేందుకు మోదీ సర్కారు వేల కోట్లు వెచ్చిస్తోందని దుయ్యబట్టారు.

గ్రహాంతరవాసి హస్తమా!



రియో డీ జెనీరో: బ్రెజిల్ తీరంలో మనిషి హస్తాన్ని పోలిన భారీ హస్తం బయటపడడం కలకలం రేపింది. ఇది మరో గ్రహానికి చెందిన జీవి చెయ్యి కావొచ్చని స్థానికులు అనుమానించారు. భయాందోళనకు గురయ్యారు. ఈ నెల 20న సో పాలో స్టేట్‌లో లభించిన పొడవైన ఎముకలు మనిషి చేతి వేళ్లను పోలి ఉన్నాయి. అచ్చంగా చెయ్యి ఆకారంలోనే ఉండడం గమనార్హం. నిజానికి ఇది గ్రహాంతరవాసి హస్తం కాదని, భారీ తిమింగలం లేదా డాల్ఫిన్‌కు చెందిన ఎముకలని మెరైన్ బయాలజిస్ట్ ఎరిక్ కోమిన్ వెల్లడించారు. ఇది 18 నెలల క్రితం మరణించి ఉండొచ్చని అంచనా వేశారు. ఈ ఎముకలు సముద్ర జీవి శరీరం చర్మం కింద ఉండే ఫ్లిప్పర్స్ అని తెలిపారు. ఈ ఫ్లిప్పర్స్‌కు ఐదు వేళ్ల లాంటి ఎముకలు ఉంటాయన్నారు.

మనసు మాట వినే చక్రాల కుర్చీ!



వాషింగ్టన్: దివ్యాంగులకు చక్కగా ఉపయోగపడే చక్రాల కుర్చీని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ కుర్చీని కదిపేందుకు బటన్స్ నొక్కాల్సిన పనిలేదు. మనిషిలోని ఆలోచనలను బట్టి నడుచుకుంటుంది. అంటే మనస్సుతో కుర్చీని కంట్రోల్ చేయొచ్చు. కుర్చీలో కూర్చున్న తర్వాత కుడి వైపునకు మళ్లాలంటే రెండు చేతులను కుడి వైపునకు కదిలించినట్లు మనసులో ఊహించుకుంటే చాలు. ఎడమ వైపునకు వెళ్లాలంటే రెండు కాళ్లను అదే దిశలో కదిలించినట్లు ఊహించుకోవాలి. మెదడులోని సంకేతాలను వీల్ చైర్ కదలికలతో అనుసంధానించారు. ఇందుకోసం హెల్మెట్ (స్కల్ క్యాప్) లాంటిది ధరించాలి. ఇందులో 31 ఎలక్ట్రోడ్‌లు ఉంటాయి. ఇవి మెదడు అందించే సంకేతాలను పసిగడతాయి. చైర్ వెనుక ల్యాప్‌ట్యాప్ ఫిక్స్ చేసి ఉంటుంది. కృత్రిమ మేధ(ఏఐ)తో మెదడు సంకేతాలు కుర్చీ కదలికలుగా మారుతాయి. దివ్యాంగులు, నడవలేని బాధితులు చేయాల్సిందల్లా కుర్చీలో కూర్చొని కాళ్లు, చేతులు ఆడించినట్లు మనసులో ఊహించుకోవడమే. మనసు మాట వినే ఈ చక్రాల కుర్చీ 80 శాతం కచ్చితత్వంతో పని చేసినట్లు అధ్యయనంలో తేలింది. కుర్చీలను వాణిజ్యపరంగా మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

న్యాయమూర్తుల నియామకంలో ఏమిటీ జాప్యం?

కేంద్రంపై సుప్రీంకోర్టు అసంతృప్తి

- మేమే నిర్ణయం తీసుకునే పరిస్థితి తేవొద్దు
- టైమ్‌లైన్‌కు కట్టుబడి ఉండాల్సిందేనని ఆదేశం
- కొలీజియం సిఫార్సులపై సంప్రదింపులొద్దని వ్యాఖ్యలు
- అయినా 20 సిఫార్సులను తాజాగా తిప్పిపంపిన కేంద్రం



న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీల నియామకం కోసం కొలీజియం చేసిన సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం సత్వరం నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తుండడం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీరు విసుగు తెప్పించేలా ఉందని ఆక్షేపించింది. జడ్జీల నియామకాల ప్రక్రియకు భంగం కలిగించవద్దని సూచించింది. జడ్జీలను నిర్దేశిత గడువులోగా నియమించాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు గత ఏడాది ఏప్రిల్ 20న టైమ్‌లైన్ ప్రకటించింది. ఈ టైమ్‌లైన్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బెంగళూరు అడ్వొకేట్స్ అసోసియేషన్ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కౌల్, జస్టిస్ ఓకాల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కొలీజియం సిఫార్సు చేసిన పేర్లపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఎప్పటికప్పుడు ప్రకటించడం లేదని అటార్నీ జనరల్ వెంకటరమణికి ధర్మాసనం తెలియజేసింది. వ్యవస్థ పనిచేసేది ఇలాగేనా అని ప్రశ్నించింది. తమ అసహనాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేసింది. త్రిసభ్య ధర్మాసనం నిర్దేశించిన టైమ్‌లైన్‌కు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది. కొలీజియం ఒకసారి ఒక పేరును సిఫార్సు చేసిందంటే, అక్కడితో ఆ అధ్యాయం ముగిసినట్లే. వాటిపై ప్రభుత్వం మళ్లీ సంప్రదింపులు జరిపే పరిస్థితి ఉండకూడదు'' అని ఉద్ఘాటించింది. కొన్ని పేర్లు ఏడాదిన్నర నుంచి పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపింది. జడ్జీలుగా పదోన్నతి పొందాల్సిన వారు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం కారణంగా వెనక్కి తగ్గుతున్నారని ధర్మాసనం పేర్కొంది. ''ఈ కేసులో ప్రభుత్వానికి నోటీసు జారీ చేస్తున్నాం. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి'' అని ఏజీకు సూచించింది. తాము చట్టపరంగా నిర్ణయం తీసుకొనే పరిస్థితి తేవొద్దని కేంద్రానికి సూచించింది. నియామకాల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబర్ 8కి వాయిదా వేసింది.

ఉన్నత పదవుల్లో ఉంటూ అనుచిత వ్యాఖ్యలా?

కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజుపై ధర్మాసనం ఆగ్రహం

కొలీజియం వ్యవస్థ పట్ల కేంద్ర న్యాయ శాఖ కిరణ్ రిజిజు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన వార్తలను సీనియర్ అడ్వొకేట్ వికాస్ సింగ్ సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రిజిజు వ్యాఖ్యలపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు అలా మాట్లాడడం సమంజసం కాదని పేర్కొంది. నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టం కార్యరూపం దాల్చకపోవడం పట్ల కేంద్రం బహుశా అసహనంగా ఉన్నట్లు కనిపిస్తోందని జస్టిస్ ఎస్‌కే కౌల్ అన్నారు. కానీ న్యాయమూర్తుల నియామకంలో చట్ట నిబంధనలను పాటించకపోవడానికి అది కారణం కారాదని స్పష్టం చేశారు.

ఆ పేర్లపై అభ్యంతరాలున్నాయి: కేంద్రం

న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం సిఫార్సు చేసిన 20 పేర్లను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ''ఆ పేర్లపై చాలా గట్టి అభ్యంతరాలున్నాయి. కనుక మీ సిఫార్సులను పునఃపరిశీలించండి'' అని సూచించింది!! కేంద్రం తిప్పి పంపిన ఈ 20 పేర్లలో 11 కొలీజియం రెండోసారి సిఫార్సు చేసినవి కావడం విశేషం! మిగతా తొమ్మిదేమో కొత్త పేర్లు. తాను స్వలింగ సంపర్కినని బాహాటంగా ప్రకటించిన అడ్వకేట్ సౌరభ్ కృపాల్ పేరు కూడా తిప్పి పంపిన జాబితాలో ఉంది. ఆయన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి బి.ఎన్.కృపాల్ కుమారుడు. ఢిల్లీ హైకోర్టు కొలీజియం ఆయన పేరును 2017లో కొలీజియానికి సిఫార్సు చేసింది. దానిపై కొలీజియం మూడుసార్లు విభేదించింది. జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే సీజేఐగా ఉండగా కృపాల్ గురించి ప్రభుత్వం నుంచి మరింత సమాచారం కోరారు. అనంతరం 2021లో జస్టిస్ రమణ సీజేఐగా కృపాల్ పేరును ఢిల్లీ హైకోర్టు జడ్జిగా సిఫార్సు చేశారు.

చైనాలో ఉక్కుపాదం!

ఎక్కడికక్కడ భారీగా నిరసనకారుల అరెస్టులు



బీజింగ్: చైనాలో జీరో కొవిడ్ పాలసీపై దేశవ్యాప్తంగా తీవ్ర రూపు దాల్చిన ఆందోళనలు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న తీరుతో కమ్యూనిస్టు ప్రభుత్వం ఉలిక్కిపడింది. వాటిని తక్షణం కట్టడి చేయడమే లక్ష్యంగా రంగంలోకి దిగింది. నిరసనలపై ఎక్కడికక్కడ ఉక్కుపాదం మోపుతోంది. ఆందోళనకారులను పోలీసులు భారీ సంఖ్యలో అరెస్టు చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని తక్షణం డిలీట్ చేయాల్సిందిగా ఆదేశిస్తున్నారు. లేదంటే నిర్బంధం తప్పదంటూ బెదిరిస్తున్నారు. ఆదివారం షాంఘైలో నిరసనలను కవర్ చేస్తున్న బీబీసీ జర్నలిస్టు ఎడ్ లారెన్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ సందర్భంగా ఆయన్ను విచక్షణారహితంగా కొట్టడంతో పాటు తన్నారని బీబీసీ ఆరోపించింది. కొద్ది గంటల నిర్బంధం అనంతరం వదిలేశారు. ఆయన్ను పోలీసులు హింసించడం అవాస్తవమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జావో లీ జియాన్ అన్నారు. తమ జీరో కోవిడ్ విధానం సరైందంటూ సమర్థించుకున్నారు. మీడియా చెబుతున్న స్థాయిలో నిరసనలు జరగడం లేదంటూనే, ''జనాల్లో కాస్తంత వ్యతిరేకత ఉండొచ్చు. అందుకే క్షేత్రస్థాయి పరిస్థితులకు తగ్గట్టుగా జీరో కొవిడ్ విధానంలో మార్పులు తెస్తున్నాం'' అని అంగీకరించారు. మరోవైపు కరోనా ఆంక్షలపై దేశమంతటా జనాగ్రహం కొనసాగుతూనే ఉంది. రాజధాని బీజింగ్, దేశంలో అతి పెద్ద నగరం షాంఘైతో పాటు పలు నగరాల్లో ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ వీధుల్లోకి వచ్చి ఆంక్షలపై గళమెత్తుతున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై అణచివేత చర్యలకు దిగొద్దని చైనాకు ఐక్యరాజ్య సమితి హితవు పలికింది. వారి హక్కులను గౌరవించాలని సూచించింది.

మళ్లీ 40 వేల కేసులు

మరోవైపు సోమవారం చైనాలో 39,452 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. బీజింగ్‌లో వరుసగా ఐదో రోజూ 4,000 కేసులొచ్చాయి. లాక్‌డౌన్లు, సరకు రవాణా ఆంక్షల కారణంగా ప్రస్తుతం 41.2 కోట్ల మంది ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నట్లు బ్రోకరేజీ సంస్థ నొమురా అంచనావేసింది.

వైట్ పేపర్ రివల్యూషన్

దేశంలో తమకు ఏ మాత్రమూ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లేవని చెప్పేందుకు చైనా యువత, ముఖ్యంగా యూనివర్సిటీ విద్యార్థులు ప్రతీకాత్మకంగా తెల్ల కాగితాలను ప్రదర్శిస్తున్నారు. 'వైట్ పేపర్ రివల్యూషన్' పేరుతో ఇది దేశమంతటా కార్చిచ్చులా వ్యాపిస్తోంది.

నరికేసింది..

- కొడుకుతో కలిసి రెండో భర్తను దారుణంగా హత్య చేసిన భార్య
- 10 ముక్కలుగా నరికి వేర్వేరు చోట్ల పడేసిన వైనం
- ఢిల్లీలో మరో శ్రద్ధా వాకర్ తరహా హత్యోదంతం



న్యూఢిల్లీ: సహజీవనం చేశాక పెళ్లి చేసుకుందామని ఒత్తిడిచేసిందన్న కోపంతో శ్రద్ధా వాకర్‌ను చంపి ముక్కలుగా నరికిన అఫ్తాబ్ పూనావాలా ఘటన మరువకముందే న్యూఢిల్లీలో మరో హత్యోదంతం బహిర్గతమైంది. సవతి కూతురు, కోడలిని లైంగికంగా వేధిస్తుండటంతో తట్టుకోలేక భార్య, కుమారుడు కలిసి భర్తను చంపి ముక్కలుగా నరికి పారేసిన ఘటన దాదాపు ఆరు నెలల తర్వాత వెలుగులోకి వచ్చింది. తూర్పు ఢిల్లీలోని పాండవ్ నగర్ పోలీస్‌స్టేషన్ అధికారులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన 45 ఏళ్ల అంజన్ దాస్ తన రెండో భార్య పూనమ్(48), ఆమె కొడుకు దీపక్(25)లతో కలిసి ఢిల్లీలోని పాండవ్ నగర్‌లోని కళ్యాణ్‌పురిలో ఉంటున్నాడు. అతని మొదటి భార్య, ఎనిమిది మంది సంతానం. తనకు ముందే పెళ్లయిన విషయం పూనమ్‌కు చెప్పలేదు.

కత్తితో పొడిచి, గొంతు కోసి...

పూనమ్ నగలను దొంగతనంగా అమ్మేసి నగదును బిహార్‌లోని మొదటి భార్య, పిల్లలకు దాస్ గతంలో పంపాడు. మరోవైపు పూనమ్ విదంతు కూతురును, దీపక్ భార్యను కూడా దాస్ లైంగికంగా వేధించేవాడు. దాంతో వారి మధ్య పలుమార్లు తీవ్ర వాగ్వాదం జరిగింది. మరోవైపు దాస్ తనకు ముందే పెళ్లయిందని చెప్పకపోవడం, వారి బాగోగులే పట్టించుకోవడంతో పూనమ్ ఆగ్రహంతో ఊగిపోయింది. మేలో పథకం ప్రకారం పూనమ్, దీపక్ మే 30న దాస్ తాగే మద్యంలో అధిక నిద్రమాత్రలు కలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న దాస్‌ను కత్తి, ఖడ్గంతో పొడిచి చంపారు. గొంతు కోసి శరీరం నుంచి రక్తమంతా బయటకు కారిపోయేలా చేశారు. తర్వాత శరీరాన్ని పది ముక్కలుగా నరికి ఢిల్లీలో నాలుగు రోజుల వ్యవధిలో వేర్వేరు చోట్ల కొన్నింటిని పాతిపెట్టారు. రామ్‌లీలా మైదానంలో శరీరభాగాలు కనిపించడంతో పోలీసులు విచారణ విస్తృతంచేశారు. దీంతో రిఫ్రిజిరేటర్‌లో కొన్ని భాగాలతో పూనమ్, దీపక్ దొరికారు. పూనమ్‌కు 14 ఏళ్లకే సుఖ్‌దేవ్ తివారీ అనే వ్యక్తితో పెళ్లయింది. కానీ కొంతకాలానికి అతను పూనమ్‌ను వదిలేశాడు. దీంతో భర్తను వెతుక్కుంటూ పూనమ్ ఢిల్లీకి చేరింది. ఇక్కడ ఈమెకు కల్లూ అనే వ్యక్తితో పరిచయం పెరిగి సహజీవనానికి దారితీసింది.

ఉత్తరాది గ్యాంగ్‌స్టర్‌లు దక్షిణాది జైళ్లకు

నెట్‌వర్క్ విచ్ఛిన్నం కోసం కేంద్ర హోంశాఖకు ఎన్ఐఏ ప్రతిపాదన

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాల్లో గ్యాంగ్‌స్టర్ల ఆగడాలను చెక్‌పెట్టేందుకు, వారి విస్తృత నెట్‌వర్క్‌ను సమూలంగా నాశనం చేసేందుకు ఎన్ఐఏ కొత్త ఆలోచనను తెరపైకి తెచ్చింది. ఢిల్లీ, పంజాబ్, హరియాణా, రాజస్థాన్ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్‌లను దక్షిణాది రాష్ట్రాల జైళ్లకు తరలించాలని భావిస్తోంది. నాలుగు ఉత్తరాది రాష్ట్రాల్లో డ్రగ్స్, అక్రమ ఆయుధాల సరఫరా, సుపారీ హత్యలు, హవాలా దందా, బెదిరింపు వసూళ్లు, మానవ అక్రమ రవాణా వంటి తీవ్ర నేరాల్లో కొందరు గ్యాంగ్‌స్టర్లను అరెస్ట్ చేసి సెంట్రల్ జైళ్లలో పడేశారు. వాళ్లు అక్కడి నుంచే నిక్షేపంగా తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. తొలి దశలో వారిలో 25 మందిని దక్షిణాది జైళ్లకు బదిలీ చేయాలని కోరినట్లు సమాచారం.

మూసావాలా హత్యతో అలర్ట్

పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యోదంతం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెల్సిందే. దక్షిణాసియాలోని అతిపెద్ద, అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుండే జైళ్లలో ఒకటైన ఢిల్లీలోని తీహార్ జైలు నుంచే మూసేవాలా హత్య ప్రణాళికను గ్యాంగ్‌స్టర్లు అమలు చేశారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తిహార్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తన నెట్‌వర్క్ ద్వారా ఈ హత్య చేయించారనే కేసు దర్యాప్తు ప్రస్తుతం కొనసాగుతోంది. తిహార్‌లోనే ఉన్న మరో గ్యాంగ్‌స్టర్ నీరాజ్ బవానా సైతం జైలు నుంచే తన వ్యాపారాన్ని ఇష్టారీతిగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పంజాబ్, హరియాణా, రాజస్థాన్ జైళ్లలో ఉన్న గ్యాంగ్‌స్టర్‌లదీ ఇదే పంథా. జైళ్లలో కొత్తగా చిన్న ముఠాలుగా ఏర్పడి తమ ప్రణాళికను అమలుచేస్తున్నారు. ఏప్రిల్‌లో గ్యాంగ్‌స్టర్ జితేంద్ర గోగిను చంపేశాడనే కోపంతో మరో గ్యాంగ్‌స్టర్ శేఖర్ రాణాను గోగి సన్నిహితుడు రోహిత్ మోయి జైలు నుంచే కుట్ర పన్ని హత్య చేయించాడు. ఇలాంటి ఘటనలు ఇటీవలి కాలంలో ఉత్తరాదిన పెరిగాయి. కొన్ని కేసుల్లో గ్యాంగ్‌స్టర్‌లకు జైలు సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఉత్తరాది రాష్ట్రాల జైళ్లలో సామర్థ్యానికి మించి ఖైదీలుండటం మధ్య ఆధిపత్య పోరు పెరిగి గొడవలకు దారితీస్తోంది. వీరికి విదేశాల నుంచి ఆర్థిక సహకారం అందుతోందనే దారుణ వాస్తవాలు ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడయ్యాయి. ఉత్తరాది జైళ్లలో సామర్థ్యానికి మించి ఖైదీలుండటం కూడా ఎన్ఐఏ ప్రతిపాదనకు మరో కారణం. ఢిల్లీలో 14 సెంట్రల్ జైళ్ల సామర్థ్యం 9,346 కాగా 17,733 మంది ఖైదీలున్నారు. పంజాబ్‌లో జైళ్లలో 103 శాతం, హరియాణాలో 127 శాతం, రాజస్థాన్‌లో 107 శాతం ఖైదీలున్నారు.



అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలోని మోంట్‌గోమేరీ గ్రామంలో 100 అడుగుల ఎత్తులో విద్యుత్ తీగలపై కూలిన బుల్లి విమానం. ఆదివారం వంద మంది సిబ్బంది దాదాపు ఆరుగంటలు శ్రమించి అందులోని ఇద్దరినీ కాపాడగలిగారు. విమానంలోని వారిని రక్షించేందుకు కరెంట్ ఆపేయడంతో 1,20,000 మందికి విద్యుత్ సరఫరా ఆగిపోయింది.

ఆరు రోజులుగా ఎయిమ్స్ సర్వర్ హ్యాక్

రూ.200 కోట్లు డిమాండ్ చేస్తున్న హ్యాకర్లు!

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ప్రఖ్యాత ఆస్పత్రి ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సర్వర్ హ్యాకైంది. ఆరు రోజులుగా పని చేయడం లేదు. సర్వర్‌ను తమ అధీనంలోకి తెచ్చుకున్న హ్యాకర్లు రూ.200 కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని ది ఇండియా కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషిచేస్తోంది. ఢిల్లీ పోలీస్ ఇంటెలిజెన్స్ ఫ్యూజన్, స్ట్రాటజిక్ ఆపరేషన్స్ విభాగం కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తోంది. బుధవారం ఉదయం స్తంభించిన సర్వర్‌లో దాదాపు నాలుగు కోట్ల మంది రోగుల ఆరోగ్య, బిల్లుల చెల్లింపుల సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. డేటా అంతా అమ్మకానికి వస్తే అప్రతిష్ట తప్పదని పోలీసు, ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. మాజీ ప్రధానమంత్రులు, కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ సీఎంలు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, న్యాయమూర్తుల ఆరోగ్య సమాచారం సైతం సర్వర్‌లో ఉన్నట్లు వార్తలొచ్చాయి. అందుకే హ్యాకర్లు రూ.200 కోట్ల విలువైన క్రిప్టోకరెన్సీ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

ఆకాశంలో సగం.. అవకాశాలే గగనం!

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు నిరాశే

- బరిలో కేవలం 139 మంది అభ్యర్థులు
- 3 ప్రధాన పార్టీల నుంచి 38 మందికే అవకాశం



ఆకాశంలో సగం అంటూ గొప్పగా కీర్తించడమే తప్ప రాజకీయాల్లో మహిళలకు అవకాశాలు కల్పించడంలో మాత్రం పార్టీలు వెనుకంజ వేస్తున్నాయి. జనాభాలో దాదాపు సగం ఉన్న అతివలకు ఆ మేరకు చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కడం లేదు. గుజరాత్‌లో శాసనసభ ఎన్నికల ముఖచిత్రం పరిశీలిస్తే నిరాశే మిగలడం ఖాయం. రాష్ట్రంలో మొత్తం 182 అసెంబ్లీ స్థానాలుండగా, మొత్తం 1,621 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో మహిళల సంఖ్య కేవలం 139 అంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. వీరిలో ఏకంగా 56 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తుండడం విశేషం. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 126 మంది మహిళలు పోటీకి దిగారు, 13 మంది విజయం సాధించారు. అప్పట్లో 104 మంది మహిళలు డిపాజిట్ సైతం కోల్పోయారు.

'ఆప్' నుంచి ఆరుగురు

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా మూడు పార్టీలు పోటీ పడుతున్నాయి. ముక్కోణపు పోటీ కనిపిస్తోంది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌తోపాటు ఈసారి అదృష్టం పరీక్షించుకుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కూడా మహిళలకు పరిమిత సంఖ్యలోనే టిక్కెట్లిచ్చాయి. ఈ మూడు పార్టీల నుంచి కేవలం 38 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 2017 ఎన్నికలతో పోలిస్తే ఈసారి వారి సంఖ్య పెరగడం కొంత ఊరటనిచ్చే విషయం. 2017లో బీజేపీ 12 మంది మహిళామణులకు టిక్కెట్లు ఇవ్వగా, ఈ ఎన్నికల్లో 18 మందికి అవకాశం కల్పించింది. ఇక కాంగ్రెస్ విషయానికొస్తే.. 2017లో 10 మందికి, ఇప్పుడు 14 మంది ఆ పార్టీ టిక్కెట్లు లభించాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దళిత, గిరిజన మహిళలకు టిక్కెట్లు ఇచ్చాయి. ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి మొత్తం 182 మంది అభ్యర్థులు పోటీకి దిగారు. వీరిలో మహిళలు కేవలం ఆరుగురు. ఈ ఆరుగురిలో ముగ్గురు ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి పోటీ పడుతున్నారు. 13 స్థానాల్లో పోటీ చేస్తున్న ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదూల్ ముస్లిమీన్(ఏఐఎంఐఎం) పార్టీ చేస్తున్న ఇద్దరు మహిళలకు టిక్కెట్లు కేటాయించింది. వీరిలో ఒకరు ముస్లిం కాగా, మరో మహిళ దళిత వర్గానికి చెందినవారు. బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) 101 స్థానాల్లో పోటీ చేస్తోంది. 13 మంది మహిళలకు టిక్కెట్లు ఇచ్చింది. జాతీయ పార్టీ అయిన సీపీఎం ఒక మహిళా అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపింది.

ఎస్సీ, ఎస్టీలకు మరిన్ని టిక్కెట్లు

బీజేపీకి 9 మంది మహిళా సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండగా, ఈసారి ఐదుగురికి మొండిచెయ్యి చూపింది. నలుగురికి మరోసారి టిక్కెట్లు కేటాయించింది. కాంగ్రెస్‌కు నలుగురు మహిళా సిట్టింగ్ ఎమ్మెల్యేల ఉన్నారు. వీరిలో ఇద్దరికి మళ్లీ అవకాశం కల్పించింది. 2017 ఎన్నికల కంటే ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో మహిళా అభ్యర్థుల సంఖ్య పెరగడం సానుకూల అంశం. 2017లో బీజేపీ ఎస్సీ స్థానాల్లో ఇద్దరికి, ఎస్టీ స్థానాల్లో ఒక మహిళకు టిక్కెట్లు ఇవ్వగా, ఇప్పుడు ఎస్సీ స్థానాల్లో నలుగురికి, ఎస్టీ స్థానాల్లో ఇద్దరికి పోటీ చేసే అవకాశం కల్పించింది. అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎస్టీ మహిళా అభ్యర్థులు పోటీ చేశారు. ఎస్సీలకు చోటు దక్కలేదు. ఈసారి నలుగురు ఎస్టీ, ఒక ఎస్సీ మహిళా అభ్యర్థి కాంగ్రెస్ టిక్కెట్లు దక్కించుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ముగ్గురు ఎస్టీ మహిళలకు టిక్కెట్లు ఇచ్చింది.

గుజరాత్ సమరం

బిల్లు ఆమోదం పొందితే..

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితేనే ఎన్నికల్లో వారి సంఖ్య పెరుగుతుందని శాయాజీగంజ్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అమీ రావత్ చెప్పారు. ఉన్నత పదవుల్లో మహిళలను నియమించడంలో తమ పార్టీ ముందంజలో ఉందని గుజరాత్ బీజేపీ మహిళా విభాగం అధ్యక్షురాలు దీపికాబెన్ సర్వాదా వెల్లడించారు. ఒక గిరిజన మహిళను తమ పార్టీ దేశ రాష్ట్రపతిగా ఎన్నుకుందని గుర్తుచేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఉచితంగా శానిటరీ ప్యాడ్లు

పిల్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లు ఉచితంగా అందజేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలయ్యింది. మధ్యప్రదేశ్‌కు చెందిన వైద్యురాలు, సామాజిక కార్యకర్త జయా ఠాకూర్ దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ అభ్యర్థనపై వచ్చే జనవరి నెల రెండో వారానికల్లా స్పందించాలని సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై విచారణకు సహకరించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరింది.

సాక్షి
విజయనగరం
మంగళవారం । 29 । నవంబర్ । 2022



7న ధర్నా

విజయనగరం పూల్‌బాగ్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 7న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జోగారావు తెలిపారు. స్థానిక అమర్‌భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు.



సులభ పద్ధతుల్లో బోధన

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులకు సులభ పద్ధతుల్లో బోధన సాగించాలని కోడూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు డైట్ లెక్చరర్ ఎల్.రామకృష్ణ సూచించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధన తీరును సోమవారం పరిశీలించారు.

సినిమా షూటింగ్‌లకు ఉత్తరాంధ్ర అనుకూలం

విజయనగరం అర్బన్: సినిమా షూటింగ్‌లకు ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రదేశాలు అనువైనవని, సినిమా నిర్మాతలు, దర్శకులు వినియోగించుకోవాలని సూచించినట్టు ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ ఎంఎస్‌ఎస్ బాషా అన్నారు. విజయవాడలో సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు సంస్థ తీర్మానం చేసినట్టు స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు.

న్యూస్‌రీల్

గురజాడ కవితల పోటీల్లో విజేతలు వీరే

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలను ఎంపిక చేసినట్టు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'మోసబుద్ధికి వీడ్కోలు పలుకు' అనే అంశంలో శ్రీకాకుళానికి చెందిన మొర్రి గోపి, 'సమిధిగా మారుతా' అనే కవితకు విజయనగరానికి చెందిన సాలూరి సంతోషి, 'అక్షర తపస్సు'కి సారిపల్లి మంగవాణి, గురజాడ స్ఫూర్తితో కవితకు మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ శంకరరావు, ఓదార్పు వాక్యాలేవి కవితకు మన్యం పార్వతీపురానికి చెందిన కిలపర్తి దాలినాయుడు, స్త్రీ అంటే రుక్కు కవితకు విశాఖకు చెందిన బులుసు సరోజినీ దేవిలు విజేతలుగా నిలిచారన్నారు. నవంబర్ 30న ఉదయం 10 గంటలకు గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరిగే సాహితీ సభలో విజేతలకు బహుమతి ప్రదానం, సత్కారం ఉంటుందనారు. అనంతరం విజేతల స్వీయ కవితా పఠనం ఉంటుందని తెలిపారు. అదేరోజు సభలో గురజాడ రచనలపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి (విజయవాడ) పాల్గొంటారని, కార్యక్రమాలను సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, రచయిత్రి మానాప్రగడ సాహితి ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు.

లిప్ ప్రారంభం



లిప్ సబ్జెక్టు మాడ్యూల్స్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లిప్)ను విజయనగరం పట్టణంలోని కస్పా హైస్కూల్‌లో డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి సోమవారం ప్రారంభించారు. విశాఖపట్నం జిల్లా నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ చేపట్టిన రాష్ట్ర కార్యక్రమాన్ని కస్పా ఆడిటోరియంలో రెండు తెరలపై ప్రదర్శించారు. కార్యక్రమం అనంతరం డీఈఓ చేతుల మీదుగా లిప్ సబ్జెక్టు మాడ్యూల్స్‌ను ఆవిష్కరించారు. వీటిని రూపొందించిన జిల్లా ఉపాధ్యాయులను డీఈఓ అభినందించారు. 6, 7, 8 తరగతులు విద్యార్థులందరికీ భాషా నైపుణ్యాలు (చదవడం, రాయడం) పెంపొందించడంతో పాటు ఆయా తరగతులకు సంబంధించిన అభ్యసన ఫలితాలు సాధించడమే అభ్యసనాభివృద్ధి కార్యక్రమ ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వాసుదేవరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతినాయుడు, సమగ్రశిక్ష ఏఎమ్‌ఓ ఎం.శ్రీనివాసరావు, ఎంఈఓ రాజు, కస్పా హైస్కూల్ హెచ్ఎం శంకరరావు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు జీవీబీ ఎస్ఎన్ రాజు, ఎ.ప్రవీణ్‌కుమార్, ఎస్.రాంబాబు, కిశోర్, సుబ్రహ్మణ్యం, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులపై కందిరీగల దాడి



రాజాం ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఏపీడీ తదితరులు

రేగిడి: మండలంలోని కందిశ గ్రామ పంచాయతీలో సోమవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులపై కందిరీగలు దాడి చేశాయి. కెల్ల అభిషేక్ నాయుడు పంటపొలం వద్ద 28 మంది ఉపాధి వేతనదారులు రింగ్ ట్రెంచ్ వర్క్ చేస్తున్న సమయంలో గట్టుపక్కన ఉన్న పొదనుంచి కందిరీగలు ఒక్కసారిగా బయటకు వచ్చి వేతనదారులను గాయపరిచాయి. ఈ ఘటనలో అక్కడ పనిచేస్తున్నవారిలో నాస ఆదిలక్ష్మి, చోరి అమృతమ్మ, నాస లక్ష్మం, నాస గురయ్య, దాలమ్మ, టొంపల గురయ్య, గుజ్జల పాపమ్మ, గంధవరపు నారాయణమ్మ, గుజ్జల గౌరోడు,తాడివలస జగ్గయ్య తదితరులు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు 108 వాహనంలో రాజాం సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఏపీడీ పి.రాధ, రేగిడి ఏపీఓ ఎస్.హరనాథరావు రాజాం ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మిని కోరారు.

జాతీయ విద్యాసదస్సుకు సంతకవిటి హెచ్‌ఎం

సంతకవిటి: మహారాష్ట్రలోని సతారా జిల్లా, పాంచ్‌గణిలో డిసెంబర్ 3వ తేదీ నుంచి జరగనున్న జాతీయ విద్యాసదస్సుకు సంతకవిటి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వి.రవిశంకర్ హాజరు కానున్నారు. ఈ మేరకు జాతీయ విద్యామిషన్ నుంచి ఆహ్వానం అందినట్లు సోమవారం ఆయన తెలిపారు. 'ఎడ్యుకేషన్ టుడే–సొసైటీ టుమారో' అనే అంశంపై సదస్సు జరగనుందని, విద్యకు సమాజానికి ఉన్న అవినాభావ సంబంధంపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

ప్రాజెక్టుల పనులకు రంగం సిద్ధం

విజయనగరం ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఈ మేరకు టెండర్ ప్రక్రియను త్వరగా ముగించి వచ్చేనెల 15 నుంచి పనులు చేసేందుకు నీటి పారుదలశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులు చేపట్టేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.



తారక రామ తీర్థసాగర్

- తారకరామ తీర్థసాగర్ మిగులు పనుల టెండర్ వివరాలు రాష్ట్ర కమిటీకి..
- 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తికి రంగం సిద్ధం
- భోగాపురం ఎయిర్‌పోర్టు సహా నాలుగు సంస్థలకు 0.48 టీఎంసీల నీరు సరఫరా
- డిసెంబర్ 15 నుంచి జైకాలోని నాలుగు ప్రాజెక్టుల పనులు పునఃప్రారంభం

బొబ్బిలి:

సాగునీటి వనరులను వినియోగంలోకి తెచ్చే బృహత్తర క్రతువుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులకు ప్రాధాన్యమిస్తోంది. మిగులు పనులు పూర్తిచేసి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే దశాబ్దాలుగా వెనకకు నెట్టబడిన నెల్లిమర్ల వద్ద ఉన్న తారకరామ తీర్థసాగర్ (టీఆర్‌ఎస్) ప్రాజెక్టు మిగులు పనులు పూర్తిచేసేందుకు రూ.150 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. త్వరలోనే దీని పూర్తి వివరాలను రాష్ట్ర కమిటీకి అధికారులు పంపించనున్నారు. ఈనెల 30 తరువాత టెండర్ ప్రక్రియ వివరాలను రాష్ట్ర కమిటీకి పంపించి పనులను వెంటనే ప్రారంభించనున్నట్టు జలవనరుల శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. కేవలం 18 నెలల్లోనే పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

సమృద్ధిగా సాగు, తాగునీరు

టీఆర్‌ఎస్ ప్రాజెక్టు మిగులు పనులు పూర్తయితే 24,700 ఎకరాల భూమికి సాగునీరు సమృద్ధి అందనుంది. మరోవైపు విజయనగరం పట్టణ ప్రజలకు మరో 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉండదు. నిరంతరం తాగునీరు సరఫరా చేసేందుకు అవకాశం కలుగుతుంది. దీంతోపాటు భోగాపురం ఎయిర్ పోర్టు, ప్రభుత్వ మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూకు సమృద్ధిగా తాగునీరు అందించేలా పనులు చేసేందుకు జలవనరుల శాఖ, కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.7 టీఎమ్‌సీల నీరు నిల్వ ఉంటుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, జేఎన్‌టీయూ, మెడికల్ కళాశాల, విజయనగరం కార్పొరేషన్‌లకు సరఫరా చేసేందుకు 0.48 టీఎమ్‌సీల నీరు సరిపోతుందని అధికారులు భావిస్తున్నారు.

రూ.288 కోట్లతో ఆఫ్‌షోర్ నిర్మాణం

శ్రీకాకుళం జిల్లాలోని మహేంద్ర తనయ నదిపై రూ.288 కోట్లతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి సైతం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించి టెండర్ నోటీసులు సిద్ధమయ్యాయి. నేడో రేపో వీటిని ప్రభుత్వం జారీ చేయనుంది. టెండర్ ప్రక్రియను డిసెంబర్ 15 నాటికి పూర్తి చేయనున్నారు. జనవరి 1 నుంచి పనులు చేపట్టనున్నారు. ఈ పనులు కూడా 18 నెలల్లో పూర్తి చేసేందుకు జలవనరుల శాఖ నిర్ణయం తీసుకుంది. దీని నిర్మాణం వల్ల పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలకు తాగునీరు సరఫరాతో పాటు 28,600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుకలుగుతుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

డిసెంబర్ 15 నుంచి జైకా పనులు

ఖరీఫ్ సాగునీటి కోసం నిలిపివేసిన పెద్దగెడ్డ, వీఆర్‌ఎస్, వట్టిగెడ్డ, పెదంకలాం ప్రాజెక్టుల పరిధిలోని జైకా ఆధునికీకరణ పనులను తిరిగి వచ్చేనెల 15 నుంచి ప్రారంభించనున్నారు. వాస్తవానికి విజయనగరం జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు కేవలం ఖరీఫ్ సాగుకోసం మాత్రమే సాగునీరందించేలా రూపొందించబడినవి. నీరు మిగిలితే ఆరుతడి పంటలకు మాత్రమే ఇచ్చే అవకాశముంది. రబీ వరి సాగుకు పూర్తి స్థాయిలో ఏ ప్రాజెక్టులోనూ నీరు ఉండని పరిస్థితి. ఆ లోటును భర్తీ చేసేలా పనులు జరగనున్నవి.

18 నెలల్లో పూర్తి చేస్తాం



తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు మిగులు పనులకు రూ.150 కోట్లతో వేసిన టెండర్లు 30 నాటికి కొలిక్కి వస్తాయి. వివరాలను రాష్ట్ర కమిటీకి పంపిస్తాం. అక్కడ నిర్ణయం తీసుకున్నాక తక్కువకు కోట్ చేసే కంపెనీతో నిర్మాణ పనులు ప్రారంభించి 18 నెలల్లో పూర్తి చేస్తాం. మహేంద్ర తనయపై రూ.288 కోట్లతో అఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించింది. టెండర్ నోటీసు ఇస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది.

– ఎస్.సుగుణాకరరావు, నార్త్‌కోస్ట్ సీఈ, జలవనరుల శాఖ, విశాఖపట్నం

పూలే గొప్ప సంఘ సంస్కర్త



మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

విజయనగరం అర్బన్: జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. వెనుకబడిన సామాజిక వర్గాలవారు బీసీ అనే ముద్ర చెరిగిపోయేలా ఉన్నత చదువులు చదువుకోవాలని, పూలే ఆశయాలను నిజం చేయాలని కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీసీ కులాల వారి ఉన్నత చదువుల కోసం ఒక ట్రస్టు ద్వారా ప్రయత్నం చేయాలని సూచించారు. డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగాల కోసం వెతుకుతున్నారని, అలా కాకుండా ట్రస్టు ద్వారా చేయూతనివ్వాలన్నారు. బీసీ హాస్టల్‌కు శాశ్వత భవనం కావాలని బీసీ ప్రతినిధులు కోరగా నాడు–నేడు కింద పాఠశాలల నిర్మాణాలు పూర్తయిన వెంటనే హాస్టల్ భవనాలకు ప్రతిపాదనలు పంపిస్తామని కలెక్టర్ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, డీబీసీడబ్ల్యూ యశోధనరావు, బీసీ ప్రతినిధులు డీవీచారి, గొంప అప్పలరాజు, ముద్దాడ మధు, ఎలిగాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న జర్మనీ దేశం స్వాలోస్ సంస్థ సభ్యురాలు

లక్కవరపుకోట: చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్న 'చిరుధాన్య చెల్లెళ్లె' సంఘ సభ్యులను జర్మనీ దేశానికి చెందిన స్వాలోస్ సంస్థ బృంద సభ్యులు అభినందించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలెగ్జాండ్రియా, బృంద సభ్యులు రేగ గ్రామంలో సబల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిరుధాన్యాల సంఘం యూనిట్‌ను సోమవారం సందర్శించారు. 'చిరుధాన్య చెల్లెళ్లు' నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. భారత చిరుధాన్యాల సమాఖ్య ఆధ్వర్యంలో గత పదేళ్లుగా చేపట్టిన కార్యక్రమాలు, సాగు ప్రోత్సాహకాలు, మహిళా రైతులను సన్నద్ధం చేయడం తదితర అంశాలను సబల సంస్థ కార్యదర్శి కె.సరస్వతి వివరించారు. కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచి ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పినట్టు తెలిపారు. చిరుధాన్యాల స్టాల్స్‌ను స్వాలోస్ బృంద సభ్యులు పరిశీలించారు.

ఆర్‌బీకేలే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- జేసీ మయూర్ అశోక్
- రైతుల నుంచి ప్రతిగింజా కొనుగోలు చేస్తామని హామీ



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: రైతు భరోసా కేంద్రాలే ధాన్యం కొనుగోలు కేంద్రాలని, రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని జేసీ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ఈ–క్రాప్ చేసుకున్న రైతులెవరూ అధైర్యపడొద్దని సూచించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, బ్యాంకుల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సమావేశమయ్యారు. కొనుగోలు ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగాసాగాలని, అందరూ సహకరించాలని జేసీ విజ్ఞప్తి చేశారు. గోనెసంచుల కొరతను నివారిస్తామని, దూరాన్ని బట్టి రవాణా చార్జీలు చెల్లిస్తామని, గతంలో నిలిచిపోయిన బకాయిల చెల్లింపునకు ప్రత్యేక దృష్టిసారిస్తామని జేసీ సమాధానం ఇచ్చారు. సమావేశంలో డీసీఓ రమేష్, డీసీసీబీ డీఎమ్ కె.జనార్దన, సివిల్ సప్లై డీఎమ్ మీనాకుమారి, డీఎస్ ఓ మధుసూదనరావు ఇతర అధికారులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శరవేగంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: టిడ్కో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా చేపడుతున్నట్టు ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా అడ్డాపుశీల గ్రామంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో హౌసింగ్ ప్రాజెక్టు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. రూ.65కోట్ల వ్యయంతో అన్ని మౌలిక సదుపాయాలతో పూర్తిస్థాయిలో టిడ్కో ఇళ్లు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. పార్వతీపురంలో నిర్మిస్తున్న 768 వైఎస్సార్ జగనన్న నగర్ జీ+3గృహ సముదాయాలకు భవిష్యత్ అవసరాల దృష్ట్యా 60 అడుగుల వెడల్పుతో రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎల్ఎస్ఆర్ వాటర్ సప్లై, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, ప్లాంటేషన్, విద్యుత్ తదితర సదుపాయాలతో టిడ్కో కాలనీలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్‌కూడా ఉచితంగా చేసి రూ.10లక్షల ఆస్తిని అందిస్తున్న ఘనత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టిడ్కో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి రూ. 10.49 కోట్ల వడ్డీ రాయితీ

- జిల్లాలోని 60 వేల మంది రైతులకు లబ్ధి
- వైఎస్సార్‌సున్నా వడ్డీ నిధుల విడుదల చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- నమూనా చెక్కును అందజేసిన కలెక్టర్, జెడ్పీచైర్మన్



వైఎస్సార్ సున్నావడ్డీ నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెడ్పీచైర్మన్, ఎంపీ తదితరులు

విజయనగరం అర్బన్:

రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీని రైతుల ఖాతాలకు సోమవారం జమ చేసింది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. వర్చువల్ విధానంలో సాగిన కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2020 సీజన్‌కు సంబంధించి 9,332 మంది రైతులకు రూ.1.318 కోట్లు, 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 28,190 మంది రైతులకు రూ.5.23 కోట్లు, వివిధ కారణాలతో గతంలో వడ్డీ రాయితీ నిధులు పొందలేకపోయిన 22,511 మంది రైతులకు రూ.3.934 కోట్లు నిధులను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. జిల్లాలో మొత్తం 60,033 మంది రైతులకు రూ.10.491 కోట్ల నిధులను జమచేసినట్టు వెల్లడించారు. అలాగే, ఈ ఏడాది అక్టోబర్‌లో కురిసిన అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాలకు పెట్టుబడి రాయితీ సొమ్మును కూడా ముఖ్యమంత్రి వర్చ్యువల్‌గా విడుదల చేశారన్నారు. జిల్లాలో 506 మంది రైతులకు రూ.17.51 లక్షల నిధులను విడుదల చేసినట్టు వెల్లడించారు. అనంతరం సున్నావడ్డీ రాయితీ నిధులను, ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కును రైతులకు అందజేశారు.

ఆరుతడి పంటలే సాగుచేయాలి...

వచ్చే రబీ సీజన్‌లో జిల్లాలోని సాగునీటి కాలువల మరమ్మతులు, నిర్వహణ పనుల్లో భాగంగా సాగునీటి సరఫరాను అధికారులు నిలిపివేస్తారని, రైతులందరూ ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. చెరువులు, బోర్ల ద్వారా రబీ పంటలు సాగుచేసుకోవాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టం గణనీయంగా తగ్గించగలిగామని చెప్పారు. గత మూడున్నరేళ్లుగా రైతులకు ఆర్థిక అండదండలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కోవిడ్ సమయంలో రైతుల వద్ద మిగిలిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలోని ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం చెరకు రైతులకు బకాయిపడిన రూ.40 కోట్ల చెల్లింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. భీమసింగి, సీతానగరం చక్కెర కర్మాగారాల పరిధిలోని రైతులు సాగు చేసిన చెరకును సంకిలి చక్కెర కర్మాగారానికి తరలించే ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి, బొబ్బిలి నియోజకవర్గాల పరిధిలోని 3.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, మాజీ చైర్మన్ కేవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ అధికారి బీటీ రామారావు, వ్యవసాయ శాఖ డీడీ అన్నపూర్ణ, ఉద్యానవన అధికారి జమదగ్ని, రైతులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీల నిర్మాణం

- గుంకలాం, కొండకరకాంలో పనులు వేగవంతం
- ఇటుక ప్లాంట్‌లను మరో రెండు అదనంగా ఏర్పాటు చేస్తాం
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



గుంకలాం జగనన్న కాలనీలో హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

విజయనగరం టౌన్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కాలనీల ప్రత్యేక పర్యవేక్షకుడు, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచించారు. గుంకలాంలోని జగనన్న కాలనీను సోమవారం పరిశీలించారు. హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంకలాం కాలనీలో సదుపాయాల కల్పన, ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన సామగ్రి సరఫరా బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగిస్తామన్నారు. కాలనీలో దాదాపు రెండువేల ఇళ్లకు బేస్‌మెంట్ పూర్తయిందని, మిగిలిన పనులు చేపట్టేందుకు అదనంగా ఐదారు వందల మంది మేస్త్రీలు, కార్పెంటర్లు, రాడ్‌బెండర్స్‌ను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నామన్నారు.

పదిరోజుల్లోపు కనీసం ఐదారు వందల మంది కార్మికులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. రోజుకు 70వేల ఇటుకలు తయారు చేసేలా యంత్రాలు ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. గుంకలాం, కొండకరకం ప్రాంతాల్లో 2023 జూన్, జూలై లోపు శ్లాబ్ పనులు, జూలై నుంచి సెప్టెంబర్ లోపు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గుంకలాం, కొండకరకం లేఅవుట్‌ను త్వరితగతిన పూర్తిచేయాలనే పట్టుదలతో సంపూర్ణ సహకారమందిస్తున్నారని తెలిపారు. మంత్రి బొత్స సత్యన్నారాయణ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు వివరించారు. వందేళ్ల పాటు నివసించేందుకు అనువుగా ఇళ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రమణమూర్తి, గుంకలాం డీఈ రంగారావు, కొండకరకాం డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీల్లో కోడూరు విద్యార్థినుల ప్రతిభ


గోల్డ్‌మెడల్ సాధించిన పవిత్ర

బాడంగి: విశాఖపట్నంలోని శిల్పారామంలో ఈనెల26,27 తేదీలలో తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాడంగి మండలం కోడూరుకు చెందిన అలజంగి పవిత్ర ప్రథమస్థానంలో గెలిచి బంగారుపతకం సాధించింది. అలాగే అదేగ్రామానికి చెందిన అలజంగి గౌతమి తృతీయ స్థానంలో నిలిచి కాంస్యపతకం దక్కించుకుంది. త్వరలో జాతీయస్థాయిలో జరగనున్న పోటీలకు వారిద్దరూ ఎంపికైనట్లు వారికి తర్ఫీదు ఇస్తున్న విశాఖ తైక్వాండో కోచ్‌లు ఆనందరావు, ప్రసాద్‌లు తెలిపారు. కోడూరు విద్యార్థినుల ప్రతిభ పట్ల ఎంపీపీ భోగిగౌరి, ఎంపీపీ సలహాదారు టి.మధుసూదన రావు, సర్పంచ్ భోగిజ్యోతి అభినందించారు.

ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి


ఆర్చరీ పోటీలకు వెళ్తున్న విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

సీతంపేట: ఈనెల 29న విజయవాడలో జరగనున్న ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు కిడ్స్ విభాగంలో స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి బి.సంజయ్‌కుమార్ వెళ్తున్నాడు. జిల్లా స్థాయి ఫైనల్స్‌లో ఎంపికై రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న సంజయ్‌కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ ప్రవీణ్, ఉపాధ్యాయులు నల్లయ్య తదితరులు అభినందించారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు శ్రీరాం కళాశాల విద్యార్థులు


సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలోని శ్రీరాం జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మణికంఠ, మోహన్‌లు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 24,25,26 తేదీల్లో ఆంధ్రయూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 8,9తేదీల్లో బెంగళూరులో జరగనున్న సౌత్‌జోన్ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు. సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కమలాకర్, ప్రిన్సిపల్ ఎం.భాస్కరరావు, అకడమిక్ అడ్వైజర్ బి.రవి, పీడీలు శ్రీనివాస్, భానుమూర్తి అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యం

కొత్తవలస: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు తెలియజేసిన ఘటనలో మృతుడిది విజయగనరం మండలం సారిక గ్రామానికి చెందిన బొబ్బాది సంతోష(32)గా తేలింది. సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తలో ఫొటోను మృతుడి బంధువులు గుర్తించి స్థానిక సీఐ బాలసూర్యారావును సంప్రదించారు. మృతుడికి నా అన్నవారు ఎవరూ లేరని వరసకు తమ్ముడైన శంకరరావు సీఐకి తెలిపాడు. సంతోష్‌కు వివాహం కాలేదని, రాడ్‌బెండింగ్ పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బులతో తాగేతాడని సమీప బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- స్పందనకు 157 వినతులు


దివ్యాంగులకు చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన స్పందకు ప్రజల నుంచి 157 వినతులు అందాయి. వాటిలో వైద్యశాఖకు 37, డీఆర్‌డీఏకు 2, హౌసింగ్‌కు 13, మున్సిపల్ శాఖకు 1, ఇతర శాఖలకు సంబంధించినవి 8 అర్జీలు ఉండగా అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 97 అర్జీలు అందాయి. వినతులను కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఉప కలెక్టర్లు సుదర్శనదొర, సూర్యనారాయణ స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రీ ఓపెన్ అయిన వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అర్జీదారులకు అర్థవంతమైన సమాధానాలను ఇవ్వాలని సూచించారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులకు సంబంధించి దరఖాస్తుదారులతో మాట్లాడిన తర్వాతనే డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. ఫొటోలను తప్పకుండా అప్‌లోడ్ చేయాలని, నిర్దేశిత గడువులోగా రీ ఓపెన్ దరఖాస్తులను పరిష్కరించక పోతే తర్వాత డిస్పోజ్ చేయడానికి కుదరదని స్పష్టం చేశారు.

దివ్యాంగులకు రుణాల చెక్కుల అందజేత

జిల్లాకు చెందిన 21 మంది దివ్యాంగులకు మంజూరైన రూ.49.05 లక్షల విలువైన రుణాల చెక్కులను స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి అందజేశారు. జాతీయ దివ్యాంగుల ఆర్థిక, అభివృద్ధి సంస్థ న్యూఢిల్లీ దివ్యాంగుల రుణం కోసం 2022–23 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాలకుగాను రూ.26 కోట్లు కేటాయిస్తూ జిల్లాకు కోటి రూపాయలు చొప్పున 100 మంది లబ్ధిదారులకు లబ్ధి చేకుర్చేందుకు నిర్దేశించింది. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడానికి ఉన్న వ్యాపారాలు అభివృద్ధి చేసుకునేందుకు ఈ రుణాలు మంజూరు చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్ తెలిపారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

ఎస్పీ గ్రీవెన్స్‌కు 40 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 40 ఫిర్యాదులను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదులను పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐలు రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఒ. ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట రావు ప్రజల నుండి 120 అర్జీలు స్వీకరించారు.

వినతులలో కొన్ని ఇలా..

గుమ్మలక్ష్మీపురం మండలం ఓడ్రుబంగి గ్రామంలో 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్నామని, ఎగువ తాడికొండ నుంచి సీహెచ్ భద్ర మీదుగా గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఎం.రమేష్, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.

- హై స్కూల్ వద్ద వాహనాల తాకిడి మూలంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాఠశాల ఎదురుగా స్పీడ్ బ్రేకర్ నిర్మించాలని పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామానికి చెందిన సురేష్ అర్జీ అందజేశారు.
- పార్వతీపురం పట్టణానికి చెందిన అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించి ఆత్మహత్యలు జరగకుండా కాపాడమని అగ్రిగోల్డ్ కస్టమర్-ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.వి.నాయుడు, మన్యం జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు.
- సీతానగరం మండలం జానుమల్లు వలస గ్రామం సర్వేనంబర్ 90-29లో స్మశాన వాటిక చుట్టూ ఆక్రమణలు తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీహెచ్ తిరుపతి రావు వినతి పత్రం అందజేశారు.
- దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, దళితుల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ జి జనార్దన్ రావు సభ్యులు కోరారు.
- గరుగుబిల్లి మండలం దత్తివలస గ్రామానికి చెందిన టి.జమునారాణి తమ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీజీ కృష్ణాజీ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా విద్యా శాఖ అధికారి డా ఎస్‌డీవీ రమణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలి: ఎస్పీ విద్యాసాగర్

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచించారు. ఈమేరకు సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఎస్.శ్రీనివాసరావు, ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నెల్లిమర్ల విద్యార్థినికి గోల్డ్ మెడల్


యశశ్రీని అభినందిస్తున్న సాంబశివరావు తదితరులు

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల పట్టణానికి చెందిన విద్యార్థిని గోల్డ్ మెడల్ సాధించింది. స్థానిక చక్ర కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అల్లం యశశ్రీ తాజాగా గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో 64 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్ పొందింది. విజేత యశశ్రీని నగరపంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, నగరం పంచాయతీ వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, మొయిద శ్రీనివాసరావు, నాయకులు మజ్జి గణేశ్, అట్టాడ కనకారావు తదితరులు అభినందించారు. జాతీయ స్థాయి క్రీడల్లో కూడా యశశ్రీ రాణించి నెల్లిమర్ల పట్టణానికి మంచిపేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

కరాటేలో పార్వతీపురం విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

పార్వతీపురం టౌన్: సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో పార్వతీపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని శిక్షకుడు సామల ప్రభాకర్ సోమవారం తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పార్వతీపురం జిల్లా విద్యార్థులు 12 మంది విజేతలుగా నిలిచారన్నారు. బాలుర విభాగంలో ఎస్.అనిల్ గోల్డ్ మెడల్, డి అభిషేక వర్ధన్ గోల్డ్ మెడల్, కె.రవి కుమార్ సిల్వర్ మెడల్, కె.లిఖిత్ కుమార్ సిల్వర్ మెడల్, మోహిత్ కుమార్ సిల్వర్ మోడల్, వై చరణ్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. అలాగే బాలికల విభాగంలో బి.లావణ్య గోల్డ్ మెడల్, బి.అమల సిల్వర్ మెడల్, బి.జానకి బ్రాంజ్ మెడల్, పి గౌరీశ్వరి బ్రాంజ్ మెడల్ సాధించారని వివరించారు. తమ విద్యార్థులు పతకాలు సాధించడంపై ఆయా పాఠశాలల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య


ఉరివేసుకున్న భాను

విజయనగరం క్రైమ్: ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేక, జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ వైఎస్ఆర్ నగర్‌లో సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు నుంచి 12 ఏళ్ల క్రితం విజయనగరం వచ్చిన ఎస్.భాను (33) భర్త వైఎస్ఆర్ నగర్‌లో ఆరేడేళ్లుగా నివాసం ఉంటున్నారు. సిల్వర్ సామగ్రి అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్న వారి ఆర్థిక పరిస్థితులు బాగోలేక, భార్యాభర్తల మధ్య రోజూ మనస్పర్థలు తలెత్తుతూ తగాదా జరుగుతోంది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన ఆమె సోమవారం మధ్యాహ్నం ఇంట్లో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ వచ్చి పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు చక్రాల వాహనాలకు 30న వెరిఫికేషన్

పార్వతీపురం: మూడు చక్రాల మోటార్ స్కూటర్లకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 30వ తేదీన పరిశీలిస్తామని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకుడు ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లోని సెల్లార్‌లోగల సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు కాపీతో పాటు ఒక సెట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 08942 240519 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 540.00
విజయనగరం	రూ. 544.00
శ్రీకాకుళం	రూ. 544.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	52,970–00
బంగారం(22సి. 10గ్రా.)	48,550–00
వెండి (కిలో)	68,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

యువజన పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా యువజన అధికారి విక్రమాదిత్య

విజయనగరం: సామాజిక, సేవా రంగాల్లో చేసిన కృషికి గాను కేంద్ర ప్రభుత్వం 2022–23 సంవత్సరంలో అందించే జిల్లా స్థాయి ఉత్తమ యువజన పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యం, పరిశోధన, ఆవిష్కరణ, సంస్కృతి, మానవ హక్కుల ప్రోత్సాహం, కళలు, సాహిత్యం, పర్యాటక, క్రియాశీల పౌరసత్వం, సమాజసేవ, క్రీడలు, అకడమిక్ ఎక్స్‌లెన్స్, స్మార్ట్ లెర్నింగ్ వంటి అంశాల్లో సేవలందిస్తున్న యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2021–2022 సంవత్సరాలకు గాను నామినేషన్లు ఈ నెల 26 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో సేవలందించిన యువతీయువకులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు చేసిన సేవా కార్యక్రమాల ఫొటోలు, పత్రికల్లో ప్రచురితమైన వివరాలను నివేదిక రూపంలో జిల్లా యువజన అధికారి కార్యాలయంలో నేరుగా గానీ పోస్ట్ ద్వారా గానీ డిసెంబర్ 12వ తేదీలోగా పంపించవచ్చని వివరించారు. ఎంపికైన సంఘానికి రూ.25 వేలు నగదు, ప్రశంసా పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 08922 274471, 90009 30777 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కోవిడ్‌లో అనాథలైన బాలలకు భరోసా

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఇటీవల కాలంలో కోవిడ్‌తో తల్లిదండ్రులు మృత్యువాత పడడంతో అనాథలుగా మారిన బాలలకు ప్రభుత్వం ఆసరాగా నిలబడి ఆర్థిక సహాయంతో పాటు విద్య, వైద్యం, సంరక్షణ కోసం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం వీటీ అగ్రహారంలో గల మహిళా ప్రాంగణంలో సభ్యుడు గొండు సీతారాంతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 322 మంది పూర్తిగా తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయారన్నారు. తల్లి లేదా తండ్రిని కోల్పోయిన 7947 మంది బాలలున్నారన్నారు. వారందరికీ ప్రభుత్వం అన్ని రకాలుగా భరోసా కల్పిస్తుందని, నిరంతరం వారికి అందుతున్న సదుపాయాలు, సౌకర్యాలు పట్ల పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ జి. హిమబిందు, సభ్యులు సుధారాణి పట్నాయక్ భవాని, వావులాపల్లి లక్ష్మణరావు, శరత్ బాబు, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి


రమేష్ మృతదేహం

జామి (శృంగవరపుకోట): ఎస్.కోట పట్టణ శివారులో గల అలంకార్ థియేటర్ సమీపంలో సోమవారం రాత్రి ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన సిరిపురపు రమేష్(39) రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా ఆటో ఢీకొట్టడంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని వెంటనే ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుని తల్లి దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు.

పర్యాటక, వాణిజ్య నమోదు తప్పనిసరి

పార్వతీపురం: వివిధ రంగాల్లో ఉన్న వ్యాపార సంస్థలు పర్యాటక, వాణిజ్యంలో నమోదు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి, పర్యాటక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న హోటల్స్, రిసార్ట్‌లు, లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌లు, హోమ్‌స్టే, ఫార్మ్ స్టేలు, టూర్ ఆపరేటర్స్, ట్రావెల్ ఏజెంట్స్, టూర్ బోట్ ఆపరేటర్స్, అడ్వెంచర్ గేమ్స్ ఆపరేటర్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్స్, ఎంసీఐ, వెల్‌నెస్ కేంద్రాలు, సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌కు టూరిజం ట్రేడ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని పేర్కొన్నారు. పర్యాటక, వాణిజ్యంలో నమోదు చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాతి నిధి సర్టిఫికెట్ జారీ చేస్తామని వివరించారు. ఈ నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటూరిజమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా చేయాలని సూచించారు. నమోదుకు సంబంధించిన దరఖాస్తులు, ఫీజు వివరాలు వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయని పేర్కొన్నారు. ఇతర సందేహాలకు ఫోన్ 89191 68306 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

ఆటో బోల్తా: ముగ్గురు మహిళలకు గాయాలు


సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధి రామానగరం ఘాట్‌రోడ్‌లో సోమవారం ఆటో బోల్తా పడడంతో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. సీతంపేట వారపు సంత ముగించుకుని ఆరుగురు మహిళలు తమ స్వగ్రామమైన రామానగరం ఆటోలో ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడింది. దీంతో సవర హైమావతి, సుండమి, సరోజినిలకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి వైద్యసేవల నిమిత్తం తరలించారు. హైమావతికి సీరియస్‌గా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. మిగతా ఇద్దరు ఇక్కడే చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిశోర్‌వర్మ తెలిపారు.

నేల బావిలో పడి మహిళ మృతి


పార్వతి(ఫైల్)

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడిలో ప్రమాదవశాత్తు నేలబావిలో పడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. దుప్పలపూడి గ్రామానికి చెందిన శీర పార్వతి(51) 27వ తేదీ ఉదయం వరి చేను కోసేందుకు తోడికోడలితో కలిసి పొలంలోకి వెళ్తుండగా దారిలో ఉన్న నేల బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడింది. వెంటనే తోడికోడలు కేకలు వేయడంతో సమీప పొలాల్లో ఉన్న వారు వచ్చి పార్వతిని బయటకు తీశారు. అక్కడ మనిషి బాగా ఉన్నా..ఊపిరి సరిగా ఆడకపోవడంతో ప్రథమ చికిత్స నిమిత్తం 108 వాహనంలో విజయనగరం తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించగా కుటుంబసభ్యులు విజయనగరంలో ఉన్న మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. భర్త కృష్ణమూర్తి ఫిర్యాదుమేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

నోటీసు

ఆర్.ఓ.సి.నెం.2427/2022/ A1

ఆంధ్రప్రదేశ్ నగర పాలక సంస్థ చట్టం 1955 నిబంధనలు ప్రకారం మరియు విజయనగరం నగర పాలక సంస్థకు చెందిన 2022–23 ఆర్థిక సంవత్సరం జిల్లా గజిట్ నోటిఫికేషన్ నెం.14/2021/A8, తేది 24.01.2022 ప్రచురించిన లీజు హక్కులు వేలం షరతులు ప్రాప్తిని ఈ దిగువ పేర్కొన్న ఆస్తులను లీజుకు ఇచ్చుటకు ఆసక్తి కలిగిన మరియు అర్హత గల చిన్న వ్యాపారుల నుండి రోడ్ మార్జిన్ వ్యాపారములు చేయు నిమిత్తం భాష్యం స్కూలు సమీపములో రింగు రోడ్డులో గుర్తించిన ఈ దిగువ పేర్కొన్న 22 నెంబరులు విడివిడిగా మార్కు చేయబడిన రోడ్ మార్జిను స్థలములు అద్దె ప్రాతిపదికన ఒక (1) సంవత్సర కాలమునకు తాత్కాలికముగా లీజుకు ఇచ్చుటకు విజయనగరం నగరపాలక సంస్థ వారి ద్వారా దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి. నిర్ణిత దరఖాస్తు రుసుము నిర్ణిత గడువులోగా నగరపాలక సంస్థ కార్యాలయములో నగదు రూపేనా చెల్లించి నిర్దిష్ట దరఖాస్తు ఫారం పొందవలెయును. పూరించిన దరఖాస్తులు శ్రీ కమీషనరు వారి ఎదుట సంతకము చేసి అవసరమైన సమాచారము జతపరచి నిర్ణిత గడువులోగా అనగా తే 07.12.2022ది సాయంత్రం 5గంటల లోపల మా కార్యాలయమునకు అందజేయవలెను.

వ. సం.	పని పేరు (Item of Work)	లీజు హక్కుల కాలపరిమితి, వేలం ధరావత్తు రుసుం	నెలవారీ నిర్ణయించిన అద్దె	దరఖాస్తు రుసుం	దరఖాస్తు రుసుం చెల్లించుటకు ఆఖరు తేది:	దరఖాస్తులు స్వీకరించుటకు గడువు కాలం	దరఖాస్తులు స్వీకరించుటకు ఆఖరు తేది:
1	2	3	4	5	6	7	8
1	భాష్యం స్కూలు సమీపంలో రింగు రోడ్డులో 22 నెంబరులు విడివిడిగా మార్కుచేయబడిన రోడ్ మార్జిన్‌లోవున్న 20x10 అడుగుల విస్తీర్ణము కలిగిన ప్రస్తుతం ఖాళీగా వున్న రోడ్ మార్జిన్ స్థలములు చిన్న వ్యాపారములు చేయుటకు అనువైనవిగా గుర్తించినందున సదరు అస్తులు 1సంవత్సరం కాలపరిమితికి అద్దె ప్రాతిపదికపై లీజులకు ఇచ్చుటకు గురించి.	ఒక సంవత్సర కాలం రూ. 40,000/- (NON REFUNDABLE)	రూ 5,000/-	రూ 250/-	30.11.2022	7రోజులు	07.12.2022

లీజు దరఖాస్తుదారులకు అర్హతలు / షరతులు తెలుసుకొనుటకు ఈ కార్యాలయ నోటీసు బోర్డులో చూడగలరు.

నోటు :- ఇది వరకు గుత్తలు సక్రమముగా చెల్లించనివారు లోగడ బకాయిలను చెల్లించనివారు, మరియు వారి కుటుంబసభ్యుల లీజు పొందగోరు నిమిత్తం దరఖాస్తులు సమర్పించుటకు అనర్హులు. ఇంకను ఈ విషయములో వివరములు పొందగోరువారు కార్యాలయం పనిచేయువేళలో విజయనగరం నగర పాలకసంస్థ రెవిన్యూ కార్యాలయంలో కార్యాలయం పనివేళలలో సంప్రదించగలరు.

సం/- కమీషనరు
నగరపాలక సంస్థ, విజయనగరం

క్లుప్తంగా

భగవంతుని సేవలో తరించాలి

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ భగవంతుని సేవలో తరించాలని ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ కంట్రోలర్ (సౌత్) జయప్రదీప్ అన్నారు. సోమవారం స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో రెండువేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ 53వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఆలయంలో అయ్యప్ప, భవానీ, తదితర దీక్షా పరులకు సేవలందించామన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎస్ఎం కె.నరసింహ, దిలీప్, నారాయణరావు, ఆలయ కమిటీ ప్రతినిధి పెంటపాటి కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

వనితా వాకర్స్ క్లబ్‌కు అవార్డులు


అవార్డులతో సుభద్రాదేవి

విజయనగరం: పట్టణానికి చెందిన ముళ్లపూడి సుభద్రాదేవికి వాకర్స్ ఉత్తమ డిప్యూటీ గవర్నర్ అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకట న విడుదల చేశారు. శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన వాకర్స్ జిల్లా వార్షిక సమావేశంలో గవర్న ర్ పీజీ గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-2022 మీట్‌లో ఇచ్ఛాపురం నుంచి కృష్ణాజిల్లా వరకు గల వాకర్స్ క్లబ్బుల ప్రతినిధులు పాల్గొన్నారని, ఈ సభలో తనకు ఉత్తమ డిప్యూటీ గవర్నర్ అవార్డు, వనిత వాకర్స్ క్లబ్ పోర్టు శాఖకు ఉత్త మ మహిళా క్లబ్ అవార్డు ఇచ్చారని చెప్పారు.

ఓటు అంత్యంత విలువైనది


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న తహసీల్దార్ భాస్కరరావు, తదితరులు

పూసపాటిరేగ: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని తహసీల్దార్ ఇ.భాస్కరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలు ఇరుపల్లి జగదీష్, పడాల శాంతలక్ష్మిలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.పైడిరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మంచి ఫలితాలు


ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ హిమబిందు

డెంకాడ: ఫిజియోథెరపీతో మంచి ఫలితాలు వస్తాయని ఫిజియోథెరపిస్ట్ హిమబిందు అన్నారు. మండల కాంపెక్స్ ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు సోమవారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాల్లోపున్న విభిన్న ప్రతిభావంతులకు ఫిజియోథెరపీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు బి.రవీంద్ర, కె.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల ధర్నా


నిరసనలో పాల్గొన్న హమాలీలు

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలో నున్న ఏపీ బెవరేజస్ గోదాంలో పనిచేస్తున్న హమాలీలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. సంఘ జిల్లా కార్యదర్శి బి.రమణ మాట్లాడుతూ, ఎగుమతి కూలి రేటు రూ.7 నుంచి పది రూపాయలకు పెంచాలని కోరారు. సిగ్మా కంపెనీ కాంట్రాక్టర్‌తో కుదుర్చుకున్న ఒప్పందం గతేడాది అక్టోబర్‌తో ముగిసిన దృష్ట్యా.. కొత్తగా ఒప్పందం చేసుకోవాల్సి ఉందన్నారు. కూలి రెట్లు పెంచి, గతేడాది నవంబర్ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ పదో తేదీలోపు తమ డిమాండ్లు పరిష్కరించని ఎడల సమ్మె చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో శ్రీను, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గతంలో గొడిపాలెం యాతపేట వద్ద తారురోడ్డు దుస్థితి

● పినతాడివాడ - సవరవల్లి రోడ్డుకు మోక్షం

డెంకాడ మండలంలోని పినతాడివాడ నుంచి భోగాపురం మండలంలోని సవరవల్లి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుకు మోక్షం కలిగింది. ఈ రహదారి పూర్తిగా పాడవ్వడంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కొత్త తారు రోడ్డు వేయడంతో పాటు పి.తాడివాడ, గొడిపాలెం గ్రామాల వద్ద రోడ్డు పాడవ్వకుండా ఉండేందుకు సీసీ రోడ్డు ఎత్తుగా వేశారు. – డెంకాడ



అభివృద్ధి చేసిన తర్వాత రోడ్డు

మానసిక ధైర్యం పెంపొందించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యశాఖాధికారి రామేశ్వరిప్రభు

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ రోగుల్లో మానసిక ధైర్యం పెంపొందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని అదనపు జిల్లా వైద్యశాఖాధికారి జె. రామేశ్వరిప్రభు అన్నారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్ఐవీ నియంత్రణ, వ్యాధిగ్రస్తుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఏఆర్‌టీ కేంద్రాలను సేఫ్ కేర్ సెంటర్లుగా మారుస్తామని చెప్పారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ బాలాజీ హెచ్ఐవీ నివారణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. భారతి, ఆర్ఎంఓ ఎం.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు భావితరాలకు ఆదర్శం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
● వాడవాడలా పూలే వర్ధంతి

విజయనగరం:

బీసీల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు భావితరాలకు ఆదర్శమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంతంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూలే ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామన్నారు. పూలే జంక్షన్‌ను అభివృద్ధి చేసి దేశ తొలి ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బీసీ సంఘ నాయకుడు ముద్దాడ మధు మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. బీసీలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ, కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో అన్ని వర్గాలకు సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వీఎస్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విజయనగరం: జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


డెంకాడ: పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

ఘన నివాళులు...

నెల్లిమర్ల: మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేట వార్డు సచివాలయంలో నిర్వహించారు. వైస్ చైర్మన్ ఎస్.రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వాసు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, సత్యనారాయణ, నారాయణమూర్తి, సచివాలయ కార్యదర్శులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి..

డెంకాడ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మోపాడ గ్రామ సచివాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయగా... ఆయన భార్య సావిత్రి బాయి పూలే మహిళా విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ పూసపాటిరేగ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, మాజీ సర్పంచ్ బడ్డుకొండ రమేష్, కొండరాజుపేట సర్పంచ్ సరగడ బంగారురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బంటుపల్లి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది ..

విజయనగరం పూల్‌బాగ్: మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మానవతావాదని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ముద్దాడ మధు అన్నారు. స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు బీవీకే ఆచారి, గొంప అప్పలరాజు, రౌతు భాస్కరరెడ్డి, జిల్లా నాయకులు బీకేవీ ప్రసాద్, ఇప్పిలి శ్రీనివాసరావు, బి. ఎల్లారావు, తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


విజయనగరం పూల్‌బాగ్: జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

విజయమే లక్ష్యంగా పనిచేయండి..

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లి పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక వీఆర్ గ్రాండ్‌లో 17, 22, 23, 24, 25, 48, 49 డివిజన్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియమావళి పుస్తకాలను నాయకులకు అందజేశారు. సీనియర్ కార్పొరేటర్ కేదారిశెట్టి సీతారామమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కార్యకర్తల కృషి ఎంతో ముఖ్యమన్నారు. అటువంటి కార్యకర్తలను ఏ సందర్భంలోనూ విస్మరించరాదని నాయకులకు సూచించారు. తటస్థులు, పార్టీ భావజాలానికి సన్నిహితంగా ఉన్నవారిని ఆకర్షించి పార్టీ పటిష్టతకు నడుం బిగించాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని తెలిపారు. అందుకే నాయకులు ఎక్కడకు వెళ్లినా అపూర్వ స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. అదే పరిస్థితుల్లో ప్రతిపక్షం చేపడుతున్న బాదుడే బాదుడు కార్యక్రమానికి ప్రజల స్పందన రావడం లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. విజయనగరాన్ని కూడా అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బోడసింగి ఈశ్వరరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బవిరెడ్డి సతీష్, నడిపల్లి ఆదినారాయణ, ఆశపు సుజాత, పిల్లా రాధాభవానీ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారీ రుక్మిణి, డివిజన్ నాయకులు కణుగుల రాజా, ఎడ్ల రాజేష్, గార సత్యనారాయణ, పార్టీ డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో 'గడప గడపకు..'


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం: నగరంలోని 32వ డివిజన్ పరిధి తోటపాలెం నరసింహనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. అలాగే స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ రెడ్డి గురుమూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలు తీరుతో పాటు స్థానిక సమస్యలు తెలుసుకోవడానికి గడప గడపకు.. కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక చొరవ చూపి శివారు కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. పార్టీ నాయకుడు భోగాపురపు రవిచంద్ర మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, స్థానిక కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెస్‌లో ధనుంజయరాజు ప్రతిభ


ధనుంజయరాజును అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

విజయనగరం పూల్‌బాగ్: నగరంలోని వీటీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న వి. ధనుంజయరాజు ఇటీవల ఎస్.కోటలో నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం సాధించాడు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాల ఆవరణలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్ఎస్‌వీఎస్ఆర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ, డిసెంబర్ 4న జరగనున్న చెస్ ఓపెన్ టోర్నమెంట్‌లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు జి. ధర్మారావు, బి. వైకుంటరావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరావు సేవలు ఎనలేనివి


రూరల్ సీఐ తిరుపతిరావును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

విజయనగరం క్రైమ్: కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో గుమ్మలక్ష్మీపురం గిరిజన ప్రాంతంలో సీఐగా విధులు నిర్వహించిన, ప్రస్తుత రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు సేవలు ఎనలేనివని ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు వారణాశి మురళీకృష్ణ, మల్లేశ్వరరావు, సుధాకరరావు, జామి వెంకటరమణ, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కనెక్షన్లు తొలగించండి

● కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నీటిపన్ను చెల్లించని మొండి బకాయిదారుల వాటర్ కనెక్షన్లు తక్షణమే తొలగించాలని సంబంధిత కార్యదర్శులకు కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు ఆదేశించారు. నగరంలోని 35, 38 సచివాలయాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని శతశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా చేపట్టేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. తడి,పొడిచెత్త సేకరించే సమయంలో చెత్త వర్గీకరణ తప్పనిసరిగా జరిగేవిధంగా కార్యదర్శులు బాధ్యత వహించాలన్నారు. గార్బేజ్ ట్రాన్సిట్ కేంద్రాలకు చేరుకునే పొడిచెత్తను రీసైకిలింగ్ చేస్తామని, అందుకే చెత్త వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ

భోగాపురం: మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రంలో పీఎంఈజీ పథకం ద్వారా రూ.3 లక్షలతో గరే తులసి ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడ్ టైలరింగ్ మేషిన్, ఫిష్ అక్వేరియం సెంటర్లను సర్పంచ్, ఉప సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, గరే మురళీమోహనరావు ఆధ్వర్యంలో ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పాడ మాట్లాడుతూ, 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత, వైకేపీ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకాలను మహిళందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఏపీఓ రమణ, సుందర హరీష్, సీసీ, తదితరులు పాల్గొన్నారు.


కంప్యూటర్ ఎంబ్రాయిడరీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు..

● మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల

డెంకాడ: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలుపై రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాధారణ రకం క్వింటా ధాన్యానికి రూ.2040, ఎ గ్రేడ్ రకానికి 2060 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల ధాన్యమే కొనుగోలు చేస్తామని తెలిపారు. తేమశాతం తగ్గించేందుకు నూర్పు చేసిన కొంతకాలం ఆరబెట్టి కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతులు గోనెలు తీసుకువస్తే దానికి సంబంధించిన డబ్బులు అందజేస్తామని తెలిపారు. రూట్ ఆఫీసర్లుగా గ్రామ వలంటీర్లను నియమించినట్లు చెప్పారు. కొనుగోలుకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా కంట్రోల్ రూమ్ 89789 75284 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వాహనాల వేలం నేడు

విజయనగరం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ స్టేషన్ -1 సీఐ బి. మధుకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ శైలజారాణి ఆధ్వర్యంలో వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. ఔత్సాహికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందన దరఖాస్తుపై చేసిన సర్వే మాత్రమే

- 'అటవీశాఖ భూముల్లో ఆకస్మిక సర్వే' పేరుతో ఈనాడులో నిరాధారమైన రాతలు

సాక్షి, విశాఖపట్నం: వాస్తవాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు రాయడం ఒక్క ఈనాడుకే చెల్లింది. 'విశాఖ అటవీశాఖ భూముల్లో ఆకస్మిక సర్వే.. చక్రం తిప్పిన కడప నేత' అంటూ సోమవారం ఈనాడులో ఒక కథనం వండివార్చారు. అయితే వాస్తవానికి సుదూరంగా, ప్రభుత్వంపై బురద చల్లేందుకు చేసే ప్రయత్నానికి అతి దగ్గరగా ఉంది ఈ కథనం. నిజానిజాలు తెలుసుకోకుండా అబద్ధపు రాతలతో ప్రజల్ని మోసం చేసేందుకు ఈనాడు రాసిన కథనం వెనుక ఉన్న అసలు నిజాల్ని జిల్లా కలెక్టర్ కార్యాలయవర్గాలు వెల్లడించాయి.

వాస్తవంగా అసలేం జరిగిందంటే..

స్పందనలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించేదిశగా ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి కృషిచేయాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఏ ఒక్క అర్జీపైనా నిర్లక్ష్యం వహించడం లేదు. సర్వే నంబరు 88/1బీ1, 88/1బీ2 లో తమ భూములున్నాయంటూ ఒక రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను జతచేసి ఆ భూముల్లో సర్వే నిర్వహించాలంటూ ఇటీవల స్పందనలో దరఖాస్తు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు యూ/ఎస్ 23 సర్వే అండ్ బౌండరీ యాక్ట్ 1923 ప్రకారం దరఖాస్తుదారుడు, హద్దులు కలిగిన డివిజనల్ ఫారెస్ట్ అధికారికి 26న ఉదయం 10.30 గంటల ప్రాంతంలో సర్వే నిర్వహించాలని 14నే నోటీసులిచ్చారు. ఆ మేరకు 26న ఉదయం 11.30 గంటలకు టీఎస్ నం.88/బీ1, బీ2, బీ3 భూమిని సర్వేచేశారు. టీఎస్ నం.88/1బీ1, 88/1బీ2లో కొంతభాగం అప్పటి టౌన్ ప్లానింగ్ ట్రస్ట్ (టీపీటీ–ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ) భూ సేకరణ చేసి లేఅవుట్స్‌గా విక్రయించినట్లు గుర్తించారు. టీఎస్ నం.88/1బీ3 రికార్డులో ఉన్న మిగిలిన మొత్తం విస్తీర్ణం 2.08 ఎకరాలు ప్రభుత్వ అటవీశాఖ భూమిగా ఉంది. ఇది పూర్తిగా అటవీశాఖ ఆధీనంలో ఉన్నట్లు వెల్లడైంది. కాబట్టి తన భూమి ఉందని సదరు దరఖాస్తుదారుడు పెట్టిన అర్జీని తిరస్కరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియ మొత్తం.. స్పందనకు వచ్చే ఒక సాధారణ అర్జీ మాదిరిగానే స్పందించి చేపట్టినచర్య మాత్రమేనని కలెక్టరేట్ వర్గాలు స్పష్టం చేశాయి. అంతేతప్ప ఈనాడులో రాసినట్లుగా ఎలాంటి రహస్య సర్వేలు చేపట్టలేదని, ఏ కడప నేతా చక్రం తిప్పలేదని, సదరు పత్రికలో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నాయి.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై అబద్ధపు రాతలు

ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాకుండానే ఈనాడు పైత్యం

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోకపోయినా ఈనాడు అడ్డగోలుగా అబద్ధాలను వండివార్చడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణపై మడత పేచీ.. శీర్షికతో ఈనాడులో సోమవారం అబద్ధపు కథనం ప్రచురితమైంది. క్రమబద్ధీకరించే కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇందుకోసం పలు నిబంధనలు పెట్టిందని అబద్ధాలను అచ్చోసింది. కానీ ఇంతవరకు ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అధ్యయనం చేసి ఇదే అంశంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక ఇస్తుంది. ఆ తర్వాత దానిపై ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఇంకా నడుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి జీవో విడుదల కాలేదు. క్రమబద్ధీకరణకు ఎలాంటి మార్గదర్శకాలు కూడా విడుదల చేయలేదు. కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను సేకరించేందుకు ఒక ఫార్మాట్ ఇచ్చారు. దాని ప్రకారం వివరాలు సేకరించే పని జరుగుతోంది. కానీ ఈనాడు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారం అభూత కల్పనలతో కథనం రాసింది. నిజానికి కాంట్రాక్టు ఉద్యోగుల కోసం ఐదేళ్ల అధికారంలో ఉండి చంద్రబాబు ఏమీ చేయలేదు. అప్పుడు వారు చేయలేనిదాన్ని, ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తుంటే అడ్డగోలుగా వక్రీకరణలకు దిగుతోంది. దోచుకో పంచుకో తినుకో పద్ధతిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం, ఎల్లోమీడియా సిండికేట్‌గా మారి దొంగల ముఠాలా రాష్ట్రాన్ని దోచుకుతిన్నాయి. ఆ ముఠాకు నాయకత్వం వహించిన చంద్రబాబును ప్రజలు ఇంటికి పంపారు. దీంతో ఇప్పుడు దోచుకోవడానికీ, పంచుకోవడానికి వారికి ఏమీ లేదు. ఎప్పుడెప్పుడు తమ వాడిని ఆ సీటులో కూర్చోబెడదామా? మళ్లీ దోపిడీ మొదలుపెడదామా అని ఈ సిండికేట్ ఆత్రుతపడుతోంది. అందుకోసమే ప్రజలను ఏమార్చేందుకు అబద్ధాల కథనాలను అదేపనిగా ప్రచురిస్తోంది.

• తెలంగాణ

షర్మిలపై దాడి

- షర్మిల బసచేసే వాహనంపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన టీఆర్ఎస్ శ్రేణులు
- అడుగడుగునా పాదయాత్ర అడ్డగింత
- షర్మిలను అరెస్ట్ చేసి హైదరాబాద్ తరలిస్తుండగా ముఖంపై గాయాలు

సాక్షి, వరంగల్: టీఆర్ఎస్ పనితీరును ప్రశ్నిస్తూ వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో రణరంగంగా మారింది. నియోజకవర్గ సమస్యలను ఎత్తిచూపుతూ.. స్థానిక ఎమ్మెల్యే పనితీరును తప్పుపడుతూ షర్మిల చేసిన వ్యాఖ్యలపై టీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఆందోళనలకు దిగాయి. ఏకంగా ఆమె బసచేసే ప్రత్యేక బస్సు(కారవాన్)పై పెట్రోల్ పోసి నిప్పంటించడం కలకలం రేపింది. తర్వాత షర్మిల సేదదీరుతున్న సమయంలో కర్రలు, పెట్రోల్ బాంబులు తేవడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

దాడులకు ముందే ప్లాన్ చేసి..

నర్సంపేట మండలం రాములునాయక్ తండా సమీపంలో ఆదివారం రాత్రి షర్మిల నైట్ హాల్ట్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు 223వ రోజు షర్మిల పాదయాత్ర ప్రారంభమై చెన్నారావుపేటకు చేరుకుంది. అక్కడ ఆమె ప్రసంగిస్తున్న సమయంలోనే ఫ్లెక్సీలకు టీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పుపెట్టారు. తర్వాత శంకరంతండా వద్ద షర్మిల పాదయాత్రకు బ్రేక్ ఇచ్చి సేదతీరారు. మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో కారులో అక్కడికి వచ్చిన కొందరు బస్సుపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. దీనిని నిరసిస్తూ వైఎస్సార్‌టీపీ శ్రేణులు ధర్నాకు దిగాయి. ప్రతిగా టీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు షర్మిల విశ్రాంతి తీసుకుంటున్న బస్సు వద్దకు దూసుకొచ్చి 'షర్మిల గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. కొందరు టీఆర్ఎస్ కార్యకర్తలు కర్రలు, పెట్రోల్ బాంబులు (పాలిథిన్ కవర్లలో పెట్రోల్ నింపినవి) పట్టుకువచ్చి దాడికి దిగారు. పలు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు.

బలవంతంగా అరెస్ట్ చేసి..

శాంతిభద్రతల సమస్య తలెత్తుతోందంటూ పోలీసులు వైఎస్ షర్మిలను అక్కడి నుంచి తరలించాలని నిర్ణయించారు. తనపై దాడి చేసిన వారిని వదిలి తనను అదుపులోకి తీసుకోవడమేంటని షర్మిల నిలదీసినా వెనక్కి తగ్గలేదు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆమెను అరెస్ట్ చేసి పోలీసు వాహనంలో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తర్వాత కూడా టీఆర్ఎస్ కార్యకర్తలు ప్రత్యేక బస్సు అద్దాలను పగులగొట్టారు. లింగగిరిలోని వైఎస్సార్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. శంకరం తండా వద్ద షర్మిల మీడియాతో మాట్లాడుతూ పాదయాత్రను అడ్డుకోవడం దారుణమన్నారు. తెలంగాణ చరిత్రలో సోమవారం బ్లాక్‌డే అంటూ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన ప్రచార వాహనాన్ని తగలబెట్టడాన్ని, తనను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు.

అన్నీ ఉల్లంఘనలు.. మోసాలే

▶ మొదటి పేజీ తరువాయి

తనిఖీలు నిర్వహించి పలు ఉల్లంఘనలను గుర్తించినట్లు తెలిపారు. తనిఖీలకు మార్గదర్శి ఫోర్‌మెన్లు సహకరించలేదన్నారు. ఉల్లంఘనలు, మోసాలపై మార్గదర్శి సహా ఇతర కంపెనీలకు షోకాజ్ నోటీసులిస్తామన్నారు. సమాచారం ఇవ్వకుండా సహాయ నిరాకరణ చేసిన మార్గదర్శి కంపెనీలో ప్రత్యేకంగా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఆ కంపెనీ హెడ్‌క్వార్టర్‌లోనూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అదనపు కమిషనర్ ఉదయ భాస్కర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

అందుకే మూడు రోజులు..

మార్గదర్శిలో ఏపీలోని 37 బ్రాంచిలకు ఒక్కో వ్యక్తిని ఫోర్‌మెన్‌గా నామినేట్ చేశారు. వారికి ఎలాంటి అధికారాలు, చెక్ పవర్ ఇవ్వలేదు. బ్రాంచిల బ్యాంక్ అకౌంట్ల వివరాలు, ఆయా బ్రాంచిల సొమ్ము ఎక్కడికి బదిలీ అవుతుంది, బ్రాంచి లావాదేవీలు ఇవేవీ వారికి తెలియదు. తనిఖీల సమయంలో ఏది అడిగినా.. తెలియదు, హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నాయి.. అనే సమాధానం చెప్పారు. వారి నుంచి ఎలాంటి సహకారం అందలేదు. అక్కడ దొరికిన డాక్యుమెంట్లపై అడిగినా చెప్పలేదు. వాటికి సంబంధించిన స్టేట్‌మెంట్లపై సంతకాలు చేసేందుకూ నిరాకరించారు. అందుకే ఆ సంస్థలో తనిఖీలకు మూడు రోజుల సమయం పట్టింది. అక్కడ దొరికిన కొంత సమాచారాన్ని మాత్రమే తీసుకోగలిగాం.

వడ్డీ ఆశ చూపి డిపాజిట్లు సేకరించారు

మార్గదర్శిలో వడ్డీ ఆశ చూపి సెక్యూరిటీ డిపాజిట్లు సేకరించడం పెద్ద ఉల్లంఘనగా గుర్తించాం. డిపాజిట్లు కట్టిన వారికి ఒక రశీదే ఇస్తున్నారు. ఆ రశీదు గురించి బ్రాంచి ఫోర్‌మెన్‌కి సమాచారం కూడా లేదు. రశీదులో 6–12 నెలలకు నాలుగు శాతం వడ్డీ, 12 అంతకంటె ఎక్కువ నెలలైతే ఐదు శాతం వడ్డీ ఇస్తామని పేర్కొన్నారు. సెక్యూరిటీ సొమ్ముపై వడ్డీ ఎలా చెల్లిస్తారు? అదేమీ బ్యాంకులో వేసిన డిపాజిట్ కాదు. దీనిపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పడంలేదు. సెక్యూరిటీ సొమ్మును ఎక్కడ ఉంచుతున్నారు? ఏ బ్యాంక్ ఖాతాలో ఉంచారు? వాటి లావాదేవీలపై ఫోర్‌మెన్‌కి తెలియదు. ఇది చాలా సీరియస్ ఉల్లంఘన. సెక్యూరిటీ రూపంలో డిపాజిట్లు సేకరించడం అనుమానాస్పదం. వడ్డీ ఆశ చూపుతున్నారంటే ఆ సొమ్మును ఎక్కడో పెట్టుబడి పెట్టినట్లు అర్థమవుతోంది. దీన్నిబట్టి ఆ సొమ్మును వేరే దానికి వాడుతున్నారు. ఇది పూర్తిగా మోసం.

వేరే వ్యాపారానికి ఉపయోగించకూడదు

చిట్‌ఫండ్ సొమ్మును వేరే వ్యాపారాలకు ఉపయోగించకూడదు. దీనిపై కఠిన చర్య తీసుకుంటాం. ఆ సెక్యూరిటీ సొమ్మును రాష్ట్రంలోని అన్ని బ్రాంచీల వారీగా ప్రత్యేకంగా డిపాజిట్ చేయాలని ఇప్పటికే సూచించాం. ప్రజల సొమ్ముకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మాపై ఉంది. అన్నింటికీ ఒకే అకౌంట్ ద్వారా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. కొత్త చిట్‌ఫండ్‌కి, పాత చిట్‌ఫండ్‌కి, పాట పాడుకున్న వారికి ఒకే అకౌంట్ చూపిస్తున్నారు. ఫోర్‌మెన్ కట్టిన చందాకు మిగతా చందాదారుల మాదిరిగానే సెక్యూరిటీ చూపించి అది వేరే ప్రత్యేక అకౌంట్‌లో ఉంచాలి. కానీ అలా చేయడంలేదు.

మార్గదర్శి ఆర్థిక పరిస్థితిపై అనుమానాలు

అత్యవసరమైన రికార్డులనూ నిర్వహించడం లేదు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి ప్రత్యేకంగా బ్యాలెన్స్ షీట్ ఫైల్ చేయాలి. అలా ఫైల్ చేయకపోవడం వల్ల ఫండ్స్ ఎక్కడున్నాయి? ఆ కంపెనీ ఆర్థిక స్థితి ఎలా ఉంది? సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో తెలియడం లేదు. వీటిపై చాలా అనుమానాలున్నాయి. మార్గదర్శి ఆర్థిక పరిస్థితిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి చిట్‌కి వివరాలివ్వాలి. కానీ ఇవ్వడం లేదు. బ్యాలెన్స్ షీట్లు ఇవ్వకపోవడం వల్ల వారి పెట్టుబడుల గురించి తెలియడంలేదు.

ఇది పెద్ద మోసం..

పబ్లిక్ డొమైన్‌లో ఉన్న వివరాల ఆధారంగా మార్గదర్శి సొమ్ములు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, ఉషాకిరణ్ మూవీస్ ఇతర కంపెనీల్లో ఉన్నట్లు గుర్తించాం. చిట్‌ఫండ్ సొమ్మును ఇతర కంపెనీలు మళ్లించినట్లు స్పష్టమైంది. ఇది పెద్ద మోసం. ప్రజల సొమ్మును రిస్కులో పెట్టారు. చిట్‌ఫండ్ చట్టం ప్రకారం బ్యాలెన్స్ షీట్స్, ప్రత్యేక బ్యాంక్ అకౌంట్స్ లేవు. లావాదేవీలు, పెట్టుబడుల వివరాలు లేవు. ఇవన్నీ సీరియస్ ఉల్లంఘనలు. తనిఖీల సమయంలో మా అధికారులు చాలా ఓపిగ్గా వ్యవహరించారు. సహనంగా సమాచారం సేకరించేందుకు ప్రయత్నించినా వారు సహకరించలేదు. సమాచారం ఇవ్వకపోగా అధికారులు తమను ఇబ్బంది పెట్టారని, డజన్ల సంఖ్యలో అధికారులు వచ్చారని పత్రికల్లో కథనాలు రాశారు. జీఎస్టీ ఉల్లంఘనలూ ఉన్నందున తనిఖీల్లో ఆ అధికారులు కూడా భాగస్వాములయ్యారు. వీటిపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇప్పటికే మార్గదర్శికి నోటీసులిచ్చినట్లు మా దృష్టికి వచ్చింది.

స్పెషల్ ఆడిట్ నిర్వహిస్తాం

చిట్‌ఫండ్ కంపెనీలు చట్టాన్ని ఉల్లంఘించి ఇష్టానుసారంగా నిర్వహిస్తుంటే చూస్తూ ఊరుకోం. ప్రజల సొమ్మును రక్షించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. 7 నుంచి 10 రోజుల్లో పూర్తి స్థాయి షోకాజ్ నోటీలిస్తాం. వారిచ్చిన సమాధానాన్ని బట్టి తదుపరి చర్య ఉంటుంది. అకౌంట్స్ నిర్వహణ సక్రమంగా లేనందున మార్గదర్శిలో స్పెషల్ ఆడిట్ నిర్వహిస్తాం. ఫోరెన్సిక్ తరహాలో జరిగే ఈ ప్రత్యేక ఆడిట్‌లో అన్ని అకౌంట్స్, అన్ని లావాదేవీలు, డాక్యుమెంట్స్‌ను పరిశీలిస్తాం. ప్రతి ఒక్కటీ హైదరాబాద్ హెడ్‌క్వార్టర్‌లో ఉంటుందని మార్గదర్శి ఫోర్‌మెన్స్ చెబుతున్నందున తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సహకారంతో అక్కడా తనిఖీలు చేస్తాం. ఇన్ని ఉల్లంఘనలు జరిగిన దృష్ట్యా మార్గదర్శి, ఇతర కంపెనీల్లో కొత్త చిట్స్‌ను అన్ని పరిశీలించాకే అనుమతి ఇస్తాం.

గతంలో ఇతర సంస్థల్లోనూ..

ఫిర్యాదులు వచ్చిన అన్ని కంపెనీల్లో తనిఖీలు చేశాం. 2018లోనే కపిల్ చిట్స్‌లో ఈ తరహా తనిఖీలు చేసి చర్యలు తీసుకున్నాం. 2019 నుంచి 2022 వరకు ఆ కంపెనీకి కొత్త చిట్స్‌ను వేసే అవకాశం ఇవ్వలేదు. 2018లోనే మార్గదర్శి సంస్థ బ్యాంకు స్టేట్‌మెంట్స్ చూపించడం లేదని అప్పటి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ గుర్తించారు. సెకండ్ అకౌంట్స్ వివరాలు ఇప్పటికీ ఇవ్వలేదు. ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ఫిలింసిటీ గోడలు బద్దలు కొడతాం

హైదరాబాద్: ప్రభుత్వ భూములను కబ్జా చేసి రామోజీరావు ఫిలింసిటీని నిర్మించారని.. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కేసులు నమోదు చేసి, రామోజీని అరెస్టు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఫిలింసిటీ గోడలు బద్దలుకొట్టి ప్లాట్లు స్వాధీనం చేసుకుని, పేదలకు పంచుతామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి సర్వే నంబర్ 189, 203లలో 675 మందికి ఇళ్లస్థలాలు కేటాయించాలని, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడారు. ''రామోజీరావు భూకబ్జాకోరు. పేదల పాలిట రాక్షసుడు. తమకు కేటాయించిన స్థలాల్లోకి పేదలను రాకుండా రామోజీ అడ్డుకోవడం సరికాదు. పేదలు పోరాటాలు చేసి గుడిసెలు వేసుకుంటే కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అసలు కేసు పెట్టాల్సింది రామోజీపై. రామోజీ లాంటి పెట్టుబడిదారులు భూములు ఆక్రమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏమిటి?'' అని ప్రశ్నించారు. అధికారంలోకి రాక ముందు లక్ష నాగళ్లతో ఫిలింసిటీని దున్నిస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు మౌనం వహిస్తున్నారేమని విమర్శించారు.

రామోజీ సొంత భూములేం అడగడం లేదు

రామోజీ సొంత భూములేమీ అడగడం లేదని.. ఫిలింసిటీలోని 172 ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని కోరుతున్నామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. ఇక రంగారెడ్డి జిల్లాలో ఐదున్నర లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు.

తోపులాట.. ఉద్రిక్తత..

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్ వైపు దూసుకొస్తున్న ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు తోపులాట జరిగింది. కాసేపటికి సీపీఎం నేతలను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. తర్వాత 10మంది నేతలు, కార్యకర్తలు వెళ్లి అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు.

అద్దె ధరల సమాచార పట్టిక ఏర్పాటుచేయాలి

- జేసీకి ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ వినతి

విజయనగరం అర్బన్: రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఏర్పాటుచేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)లో అద్దెకు ఇస్తున్న వ్యవసాయ యంత్రాల పరికరాల అద్దె ధరలపై పారదర్శకత పాటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు సోమవారం జేసీ మయూర్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్‌బీకే, సీహెచ్‌సీ ప్రాంతాలల్లో అద్దె ధరల సమాచార పట్టికను ఏర్పాటు చేయకపోవడం వల్ల బయట మార్కెట్ ధర తీసుకొని రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. భూ యజమానుల నుంచి ఆమోదం లభించక ఈ–క్రాప్‌లో నమోదుకాని దాదాపు 40 శాతం మంది కౌలు రైతులు నష్టపోతున్నారన్నారు.


అర్చకులకు సత్కారం



సత్కారం పొందిన సుదర్శనమ్ రామ నరసింహాచార్యుల దంపతులు

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సమాఖ్య భవనంలో 75 ఏళ్లు దాటిన బ్రాహ్మణులను సత్కరించారు. ఇందులో భాగంగా రామతీర్థం శ్రీరామస్వామి దేవాలయంలో ప్రధానార్చకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సుదర్శనమ్ రామ నరసింహాచార్యులు (నాని), సత్యవతి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, వయోశ్రేష్ఠులు, పండితులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే డీటీగా రత్నకుమారి



రత్నకుమారి

బొండపల్లి(దత్తిరాజేరు): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేకు సంబంధించి దత్తిరాజేరు డిప్యూటీ తహసీల్దార్‌గా టి.రత్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేసి, ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సమగ్ర భూ రీసర్వేను పక్కాగా నిర్వహిస్తామని తెలిపారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

- ధాన్యం కొనుగోలులో సమస్యలు రాకుండా చూడాలి
- అధికారులతో జేసీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్



జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ ఆనంద్

పార్వతీపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు ధాన్యం సేకరణ జరుగుతుందని రైతులకు భరోసా కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే, స్పందన, నాడు–నేడు, సిమెంట్ సరఫరా, పాఠశాలల్లో మరమ్మతులు, ధాన్యం సేకరణ తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా, మండల అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష చేశారు. రీసర్వే అనంతరం తప్పులు లేకుండా రికార్డులు తయారు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. మ్యుటేషన్లు, సవరణలు తదితర దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. నాడు–నేడు పనుల స్థితిని తెలియజేయాలని కోరారు. సిమెంట్ సరఫరా గురించి తెలుసుకున్నారు. పాఠశాలల్లో కనీస మరమ్మతులకు నిధులు విడుదల చేశారని వాటిని ఖర్చు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యం సేకరణకు సంబంధించి తహసీల్దారు, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారులు మండలంలో బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు వారికి కేటాయించిన ప్రతి రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి, ఏర్పాట్లు తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి మిల్లరు బ్యాంకు గ్యారంటీ అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతోపాటు, మొత్తం ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతుభరోసా కేంద్రం స్థాయిలో రైతులకు అవగాహన, భరోసా కల్పించాలన్నారు.

ఈ–క్రాప్ నమోదైతే ధాన్యం కొనుగోలు

జిల్లాలో 99.9 శాతం ఇ– క్రాప్ నమోదు జరిగిందని, ఇ క్రాప్ నమోదైన మొత్తం పంటకొనుగోలు చేస్తామని, ఇ–క్రాప్ నమోదు లేకుండా ధాన్యం కొనుగోలు చేయకూడదని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ధాన్యం సేకరణ జరగాలని, రైతు సమాచారం ఇచ్చిన వెంటనే పొలం వద్దకు వెళ్లి ధాన్యం నాణ్యత, తేమ తనిఖీ చేసి రైతుకు తెలియజేయాలని చెప్పారు. నాణ్యత, తూకం విషయంలో తేడా రాకూడదన్నారు.

సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పి.విష్ణు చరణ్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎస్‌డీవీ రమణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామ చంద్రరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎస్ మూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జి.వరహాలు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఇప్పించాలని వినతి



పౌరసరఫరాల డీఎం మీనాకుమారి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

రామభద్రపురం: ఖరీఫ్ సీజన్–2021–22లో విక్రయించిన ధాన్యానికి మిల్లరు ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని, ఆ డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె.మీనాకుమారికి రామభద్రపురం రైతులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రతీ రైతుకు నూరు శాతం బిల్లులు చెల్లించాలన్న ప్రభుత్వ సంకల్పానికి కొంతమంది మిల్లర్లు మధ్యవర్తులతో కుమ్మక్కై తూట్లు పొడుస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం సేకరించిన వ్యవసాయాధికారులు, ధాన్యం విక్రయించిన రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత ఖరీఫ్ సీజన్‌లో రామభద్రపురం రైతు భరోసా కేంద్రం ద్వారా దాదాపు నాలుగు లోడులు ధాన్యం సేకరించి తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఉన్న సర్ ఆర్థర్ కాటన్ రైస్‌మిల్లర్‌కు మధ్యవర్తి ద్వారా పంపించారు. అందులో 3 లోడులకు సంబంధించిన బిల్లులు మాత్రమే రైతు ఖాతాకు జమ అయ్యాయి. మిగతా 25 మంది రైతుల వద్ద సేకరించిన 26.06 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు సుమారు రూ.5 లక్షల రావాల్సి ఉంది. ఈ ధాన్యానికి సంబంధించి అన్ని పత్రాలతో కూడిన ఆధారాలున్నాయి. ఏడాది అవుతున్నా డబ్బులు రాకపోవడంతో రైతులంతా కలిసి విజయనగరంలో జేసీ, రామభద్రపురం తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయా అధికారులంతా మిల్లు యజమానితో మాట్లాడితే డబ్బంతా మధ్యవర్తికి ఇచ్చేశామని మాకేం సంబంధం లేదని చేతులెత్తేశారు. మధ్యవర్తికి ఫోన్ చేసి అడిగితే ఇదిగో రేపు తెచ్చిస్తాను, ఇదిగో ఎల్లుండి తీసుకొచ్చి ఇచ్చేస్తాను అంటున్నారే తప్ప ఇవ్వడం లేదు. దీని కోసం ఏడాది నుంచి సంబంధిత అధికారుల చుట్టూ బాధిత రైతులంతా కాళ్లరిగిపోయేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ధాన్యం కొనుగోలు చేసి, తీసుకువెళ్లిన మధ్యవర్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తహసీల్దార్ పి.గణపతిరావు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సురేంద్రనాయుడుకు సూచించారు. కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో చొక్కాపు సూర్యనారాయణ, చొక్కాపు చిన్నంనాయుడు, చుక్క రామారావు, పూడి రామకృష్ణ, చింతల అప్పలనాయుడు, పూడి అప్పలనాయుడు ఉన్నారు.

బాక్సర్‌కు సత్కారం



దేవాసినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

జామి(శృంగవరపుకోట): ఎస్.కోట పట్టణంలో నివసిస్తున్న రాజస్థాన్‌కు చెందిన మాదారం దేవాసి ఈనెల 25 నుంచి 27 వరకు విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్స్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సిల్వర్ పతకం సాధించాడు. ఆయనను ఎస్.కోట మండలపరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సోమవారం సత్కరించారు. రాష్ట్రస్థాయిలో ఇప్పటివరకు మూడు సార్లు పతకాలు సాధించానని, జాతీయ స్థాయిలో పతకాలు సాధంచడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు దేవాసి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ పినిశెట్టి రమణ, నాయకుడు మజ్జి గంగరాజు, నవదుర్గా మార్వాడీ సంఘం ఉపాధ్యక్షుడు భూరారాం చౌదరి, సభ్యులు దేవిసింగ్ కేతన్‌మాలి, అశోక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం


- కలెక్టర్ ఎ.సూర్యకుమారి




ప్రచార పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా చేపడుతున్న జాతీయ ప్రచారంలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. లింగ ఆధారిత వివక్షను రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. జాతీయ స్థాయి ప్రచార కార్యక్రమంపై తన చాంబర్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి సంబంధించిన అంశాలను, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి వివరించారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సూచనలకు అనుగుణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు, లింగ వివక్షను, అసమానత్వ సమస్యలను ఎదుర్కొనడం, నిర్మాణాత్మక వ్యూహాలను అనుసరించేందుకు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భయం, వివక్ష, హింస లేకుండా గౌరవ ప్రదమైన జీవితానికి నిర్మాణాత్మక అడ్డంకులను పరిష్కరించడం ద్వారా, మహిళలు, లింగ వైవిధ్య వ్యక్తులను, సంస్థలను ముందుకు తీసుకువెళ్లడం ఈ ఏడాది ఇతివృత్తమని పేర్కొన్నారు. వివక్షను రూపుమాపడానికి స్త్రీలతోపాటు, పురుషుల్లో కూడా విస్తృతమైన అవగాహన కల్పించాలని సూచించారు. దీనికోసం జిల్లా స్థాయిలోనే కాకుండా మండలస్థాయిలో కూడా అవగాహన శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాలు, పాలిటెక్నిక్‌లు, మోడల్ స్కూళ్లు, హైస్కూళ్లలో బాలికలకే కాకుండా బాలురకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలను నిరోధించడం, వాటికి పాల్పడే వారికి విధించే శిక్షలపైనా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్లను కూడా విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ సూర్యకుమారి ఆవిష్కరించారు. సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జిల్లా చైర్మన్ జి.హిమబిందు, జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, సీపీఓ పి.బాలాజీ, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, మెప్మా పీడీ సుధాకరరావు, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, పోలీసు, న్యాయ, సంక్షేమ, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణ కష్టాలకు తెర



కోరాడపేట–కొత్తకాపుపేట రోడ్డు నిర్మాణానికి కేంద్ర మాజీ మంత్రి అశోక్ శంకుస్థాపన చేసిన శిలాఫలకానికే పరిమితమైన రోడ్డు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తయిన కోరాడపేట–కొత్తకాపుపేట రోడ్డు

విజయనగరం మండలం గొల్లలపేట పంచాయతీ పరిధిలో కోరాడపేట– కొత్తకాపుపేట రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో ప్రయాణ కష్టాలకు తెరపడింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విజయనగరం–కొత్తవలస రోడ్డుకు ఆనుకుని ఉన్న కోరాడపేట నుంచి కొత్తకాపుపేట గ్రామ రోడ్డు నిర్మాణానికి 2017 సెప్టెంబర్ 17న నాడు కేంద్ర మంత్రిగా ఉన్న అశోక్ గజపతిరాజు శంకుస్థాపన చేశారు. కేంద్రమంత్రి ప్రారంభించడంతో రోడ్డు పనులు త్వరగా పూర్తవుతాయని ఆశించిన ఈ ప్రాంతీయులకు నిరాశే మిగిలింది. రోడ్డు నిర్మాణం శంకుస్థాపనతోనే ఆగిపోయింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడ్డుకొండపేట నుంచి కొత్తకాపుపేట, కోరాడపేట, గుండాలపేట మీదుగా హరిజన కొత్తూరు వరకు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. ఏడాది కాలంలోనే రూ.4.5 కోట్ల నిధులతో 8.7 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయడంతో ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

– విజయనగరం రూరల్

సందర్భం

ఆ కళ్లకు వెన్నెల తెచ్చింది


పక్షి ప్రేమికులకు సుపరిచితమైన పేరు పూర్ణిమా దేవి బర్మన్. చిన్నప్పుడు తాత తనను పొలానికి తీసుకువెళ్లి ఆకాశంలోని పక్షులను చూపిస్తూ 'అవి స్వర్గం నుంచి వస్తున్నాయి తెలుసా' అనేవాడు. పెద్దయ్యాక పూర్ణిమకు అర్థమైంది ఏమిటంటే భూమి మీద వాటి పరిస్థితి నరకప్రాయంగా ఉంది అని. ఈ నేపథ్యంలో పక్షుల సంరక్షణ కోసం 'హర్గిల ఆర్మీ' అనే సైన్యం తయారు చేసింది. 'ఆశావాదం మనకు ఎంతో బలాన్ని ఇస్తుంది' అంటున్న పూర్ణిమ ఐక్యరాజ్యసమితి ప్రతిష్ఠాత్మక అవార్డ్ 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్‌కు' ఎంపికైన వారిలో ఒకరు...



ఛాంపియన్ ఆఫ్ ది ఎర్త్: పూర్ణిమా దేవి బర్మన్

అస్సోంలోని బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఉన్న గ్రామంలో పెరిగింది పూర్ణిమ. అక్కడ పక్షుల సందడి నేత్రపర్వంగా ఉండేది. తాత తనను పొలానికి తీసుకువెళుతూ ఎన్నో పక్షులను చూపిస్తూ వాటి గురించి ఎంతో ముచ్చటగా చెప్పేవాడు. అలా తనకు చిన్నప్పటి నుంచి పక్షులను అభిమానించడం మొదలైంది.

జంతుశాస్త్రంలో పట్టా పుచ్చుకున్న పూర్ణిమ గ్రేటర్ ఆజిటెంట్ స్టార్క్ (కొంగల) గురించి పీహెచ్‌డీ చేసే సమయంలో ఎన్నో విషయాలు తెలుసుకుంది. అరుదైన జాతికి చెందిన గ్రేటర్ ఆజిటెంట్ జాతి కొంగలు ప్రమాదం అంచున ఉన్నాయనే విషయం తనను భయపెట్టింది. వాటి సంఖ్య బాగా తగ్గిపోతోంది. దీన్ని నివారించడానికి తన వంతు ప్రయత్నం చేయాలనుకుంది. పరిశోధనకు విరామం ఇచ్చి గ్రేటర్ ఆజిటెంట్ రక్షణకు నడుం బిగించింది.


పక్షుల కోసం గూడు

పట్టణీకరణ, బిల్డింగ్‌లు, రోడ్లు, మొబైల్ టవర్లు... మొదలైన ఎన్నో కారణాల వల్ల పక్షుల సంఖ్య తగ్గుతూ పోతుంది. దీనికి తోడు అస్సోంలోని చాలాగ్రామాల్లో పక్షులను దుశ్శకునంగా భావిస్తారు. వ్యాధులను సంక్రమింపజేస్తాయని భయపడుతుంటారు.

ముందు వారి ఆలోచన తీరులో మార్పు తీసుకురావాలనుకుంది పూర్ణిమ. ఎన్నో గ్రామాలకు తిరిగి, మహిళలను సమీకరించి పక్షులపై ఉన్న మూఢనమ్మకాలు పోయేలా వాటి విలువ గురించి ఓపిగ్గా చెప్పేది. చిన్నగా మార్పు మొదలైంది. అలా గ్రామీణ మహిళలతో 'హర్గిల ఆర్మీ'ని తయారుచేసింది. అస్సామీయులు కొంగను 'హర్గిల' అని పిలుస్తారు. తమ కార్యాచరణలో భాగంగా ఈ ఆర్మీలోని సభ్యులు ఎత్తైన వెదురు బొంగులపై గూళ్లు నిర్మించారు. మెల్లమెల్లగా ఈ గూళ్లలోనికి కొంగలు రావడం మొదలైంది. గుడ్లు పెట్టేవి.

గూళ్లు నిర్మించి పక్షులకు అనువైన వాతావరణం కల్పించడంతో పాటు, నదులు, చిత్తడి నేలల శుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించేది ఆర్మీ.

తమ ఇంటి పరిసరాలలో ఉన్న చెట్లపై పక్షిగూడు నిర్మించేవారికి డబ్బులు కూడా ఇచ్చేవారు. 'హర్గిల లెర్నింగ్ సెంటర్' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పక్షుల విలువ తెలియజేస్తున్నారు.

'పక్షుల వల్ల జరిగే మేలు ఏమిటో అర్థమయ్యేలా చెప్పారు. అవి ప్రమాదంలో ఉన్నాయనే విషయం తెలిసి చాలా బాధగా అనిపించింది. నా వంతుగా ఏదైనా చేయాలని పించి హర్గిల ఆర్మీలో చేరాను' అంటుంది దాదర గ్రామానికి చెందిన వింధ్య.

'ఇల్లుదాటి బయటికి రాగానే పక్షిని చూడడం అరిష్టమని నేను కూడా నమ్మేదాన్ని. కానీ అది ఎంత తప్పో తరువాత తెలిసింది' అంటుంది 'హర్గిల ఆర్మీ' కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే పచారియా గ్రామానికి చెందిన గంగ.

ఒకప్పుడు 'హర్గిల ఆర్మీ'లో తక్కువ మంది ఉండేవారు. ఇప్పుడు పదివేల మందికి పైగా ఉన్నారు!

'నేను స్వాభావికంగా ఆశావాదిని. అలాంటి నేను కొన్ని సందర్భాలలో నిద్రలేని రాత్రులు గడిపేదాన్ని. దీనికి కారణం పట్టణీకరణ వల్ల చెట్లను కొట్టి వేయడం. ఒకచోట ఇల్లు కడుతున్నారంటే చెట్లు కొట్టేసేవారు. వారి దృష్టిలో చెట్లకు విలువ లేదు. అయితే విస్తృత ప్రచారం వల్ల పరిస్థితుల్లో బాగా మార్పు వచ్చింది. చెట్లను నరికివేయడానికి చాలామంది విముఖంగా ఉన్నారు. ఇవి మా భవిష్యత్ తరానికి మేము ఇచ్చే ఆస్తి... అంటున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పక్షులకు అనువైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దుకుంటే వాటికి మేలు చేసినట్లవుతుంది' అంటుంది పూర్ణిమాదేవి బర్మన్.

న్యూస్‌మేకర్

క్రీడల్లో ఉషోదయం



95 సంవత్సరాల ఘన చరిత్ర ఉన్న 'ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్' మొట్టమొదటిసారి ఒక స్త్రీ నేతృత్వంలో దేశ క్రీడా వికాసం కోసం పని చేయనుంది.

- మగవారి పెత్తనం
- మగవారి నిర్ణయం
- మగవారి విధానం...

వీటిని దాటి స్త్రీలు కూడా దేశ క్రీడా మర్యాదను నిలుపగలరని చాటడానికి పరుగుల రాణి పి.టి. ఉష ఐ.ఓ.ఏ అధ్యక్షురాలిగా ఆ పదవి పొందిన తొలి మహిళగా బాధ్యతలు స్వీకరించనుంది. ఈ చరిత్రాత్మక నియామకం పి.టి.ఉషా క్రీడా చరిత్రని జీవన పార్శ్వాల్ని మరోసారి గుర్తు చేస్తోంది.



పి.టి. ఉష ఏడవ క్లాసు చదువుతున్నప్పుడు స్కూలు పుస్తకంలో 'ఒలింపిక్స్' అనే పాఠం చదివింది. అయితే ఆనాడు ఆమె ఏ మాత్రం ఊహించలేదు ఒకనాడు తాను ఒలింపిక్స్‌లో పాల్గొంటానని. బహుశా ఆ తర్వాత కూడా ఊహించి ఉండదు 'ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్'కు తొలి మహిళా ప్రెసిడెంట్ అవుతానని. అవును. 95 ఏళ్ల ఘన చరిత్ర ఉన్న 'ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్'కు పి.టి.ఉష తొలి మహిళా అధ్యక్షురాలు కానుంది. డిసెంబర్ 10న ఆ పదవికి జరగనున్న ఎన్నికల్లో ఆమె గెలుపు లాంఛనం. ఎందుకంటే ఆ పదవికి మరెవరూ నామినేషన్ వేయలేదు. పి.టి. ఉష తానుగా ఆ పదవికి పోటీ చేయనున్నానని ప్రకటించడంతోఎవరూ పోటీకి దిగలేదు. కనుక ఆమె గెలుపు లాంఛనంగా మారింది. తద్వారా 58 ఏళ్ల పి.టి.ఉష ఆ పదవి పొంది చరిత్ర సృష్టించనుంది. ఇకపై ఒలింపిక్స్‌కు, ఆసియా గేమ్స్‌కు హాజరయ్యే క్రీడాకారులను ఎంపిక చేసే బాధ్యత పి.టి.ఉషదే. ఇంకా చెప్పాలంటే దేశానికి ఒలింపిక్ మెడల్స్ తేవాల్సిన బాధ్యత ఆమె స్వీకరించింది. ఒకప్పుడు రెప్పపాటులో మెడల్ మిస్సయిన కసి ఆమెలో అలాగే ఉంది. ఇది బదులు తీర్చుకునే అవకాశం.

ఎన్నో అవమానాలు

16 ఏళ్ల వయసులో 1980లో కరాచీలో జరిగిన గేమ్స్‌లో పాల్గొనడానికి ఆమెను రైల్లో పంపారు. అదీ రిజర్వేషన్ లేకుండా. అదే సంవత్సరం మాస్కోలో జరిగిన ఒలింపిక్స్‌లో మొదటిసారి విమానం ఎక్కితే ఆమెకు ఆ ప్రయాణం పడలేదు. తోడు ఎవరూ లేకపోవడంతో అవస్థలు పడింది. ఫిజియోథెరపిస్ట్, మసాజర్ ఎవరూ లేరు. అయినా సరే 100 మీటర్స్ పరుగులో ఆమె ఆరవ స్థానం లో నిలిచింది. కాని ఆ ప్రదర్శనను ఎవరూ పట్టించుకోలేదు. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో మూడవ స్థానంలో ఉన్న ప్రత్యర్థి కాలు నేల మీద పెట్టే క్షణానికి పి.టి.ఉష శరీరం గాలిలో ఉంది. ఆమె కనుక తన తల, ఛాతీని గాల్లో ఉన్నప్పటికీ ముందుకు వంచి ఉంటే లైన్‌ను దాటినట్టయ్యేది. అలా వంచాలని ఆమెకు ఎవరూ చెప్పలేదు. ఇండియన్ అథ్లెట్స్‌కు అలాంటి ఎక్స్‌పోజర్ లేదు. 'నా ఇంట్లో అన్ని పోటీలలో గెలిచిన మెడల్స్ ఉన్నాయి. ఒలింపిక్ మెడల్ తప్ప. ఆ బాధ ఇప్పటికీ ఉంది' అంటుంది ఉష.

పరుగుకు మారుపేరు

ఒలింపిక్స్ అనేవి భారతదేశానికి కేవలం పాల్గొనే వేడుకే తప్ప గెలుపు వేదిక కాదు. మహా అయితే హాకీలో మనవాళ్లు మెడల్స్ సాధించేవారు తప్ప ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో వారి ప్రతిభ అంతగా లేదు. ఇక మహిళా క్రీడాకారుల ప్రాతినిధ్యమే తప్ప వారి నుంచి ఆశించేది ఏమీ లేదన్నట్టు ఉండేది పరిస్థితి. అలాంటప్పుడు దేశమంతా మార్మోగిన ఒకే ఒక్క పేరు పి.టి. ఉష. 1984 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.42 సెకెండ్లలో ఛేదించి ఆమె నాలుగో స్థానంలో నిలిచినప్పుడు 0.01 సెకన్ల తేడాలో కాంస్య పతకం చేజారినా దేశం మొత్తం ఆమెను అక్కున చేర్చుకుంది. ఇంటింటికి ఆమె పేరు తెలిసింది. ఎవరు బాగా పరిగెత్తినా 'పి.టి.ఉషలా పరిగెత్తాడు' అనడం 'నువ్వేమైనా పి.టి.ఉషవా' అని ఎగతాళి చేయడం ఇప్పటికీ జరుగుతోంది. కథల్లో, నవలల్లో, సినిమాల్లో పరుగు ప్రస్తావన వస్తే నేటికీ పి.టి.ఉష పేరే. పరుగుకు మారుపేరు ఆమె.

పయ్యోలి ఎక్స్‌ప్రెస్

పి.టి.ఉషను 'పయ్యోలి ఎక్స్‌ప్రెస్' అంటారు. పయ్యోలి కేరళ కోజికోడ్‌లోని ఆమె ఊరు. ఆసియా గేమ్స్‌లో మొత్తం కలిపి 14 గోల్డ్ మెడల్స్ సాధించింది కనుక 'గోల్డెన్ గర్ల్' అంటారు. 'క్వీన్ ఆఫ్ ట్రాక్ అండ్ ఫీల్డ్' అంటారు. కాని ఆ బిరుదులన్నీ ఆమెకు ఊరికే రాలేదు. నిరుపేద కుటుంబంలో పుట్టింది. పౌష్టికాహారం లేకపోవడం చేత పలుచగా ఉండేది. కాని పొడవైన కాళ్లతో వేగమైన కదలికలతో చురుగ్గా ఉండేది. నాలుగో క్లాసులో ఉండగా ఆమె స్కూలు పి.టి. టీచర్ అదే స్కూల్లో ఉన్న ఏడో క్లాసు అమ్మాయి (డిస్ట్రిక్ట్ విన్నర్)తో పరుగు పోటీ పెట్టింది. ఉష ఆ పరుగులో ఆ జిల్లా విజేతను ఓడించింది. ఇంటర్ స్థాయిలో కన్నూరు స్పోర్ట్స్ స్కూలులో శిక్షణ తీసుకుంటున్నప్పుడు ఆమెను కోచ్ ఓ.ఎం.నంబియార్ గుర్తించడంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. ఆమెకు నంబియార్ పర్సనల్ కోచ్‌గా మారాడు. ఆ రోజుల్లో అది చాలా పెద్ద విషయం. అతని శిక్షణ పి.టి.ఉష మొదలెట్టిన పరుగు 101 అంతర్జాతీయ మెడల్స్ గెలిచే వరకు ఆపలేదు.

భర్త ప్రోత్సాహం

పి.టి.ఉష ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న వి.శ్రీనివాసన్‌ను పెళ్లి చేసుకుంది. ఒక కొడుకు ఉజ్వల్. కొడుకు పుట్టాక కూడా భర్త ప్రోత్సాహంతో నాలుగేళ్ల విరామం తర్వాత 1994లో ట్రాక్ మీదకు వచ్చి మెడల్స్ సాధించిన తిరుగులేని క్రీడాకారిణి ఉష. కొడుకు ఇప్పుడు స్పోర్ట్స్ మెడిసిన్‌లో సూపర్ స్పెషలిస్ట్. లండన్‌లో శిక్షణ కోసం వెళ్లినప్పుడల్లా అక్కడ ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌ను చూసి ఇండియాలో ఇలాంటివి ఎందుకు లేవు అనుకునేది ఉష. ఒలింపిక్ పతకాలు సాధించే లక్ష్యంతో క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కేరళలోని కినలూరులో 'పి.టి.ఉష స్పోర్ట్స్ అకాడెమీ' ని నిర్వహిస్తున్నదామె.

ఆమె స్కూల్ నుంచో ఆమె ఆధ్వర్యంలో ఎంపికయ్యే క్రీడాకారుల నుంచే మరిన్ని అంతర్జాతీయ పతకాలు మన దేశానికి దక్కాలని కోరుకుందాం.

సాగుబడి
అనూరాధ కార్తె: డిసెంబర్ 2 వరకు
జ్యేష్ఠ కార్తె: డిసెంబర్ 3 నుంచి

పచ్చి కొబ్బరితో పాలు.. ఆయిల్!

- కొబ్బరి పాలు, వర్జిన్ కొబ్బరి నూనె ఉత్పత్తికి కోనసీమ అభ్యుదయ రైతు శ్రీకారం
- పచ్చి కొబ్బరి నుంచి పాల తయారీ.. పాల నుంచి వర్జిన్ ఆయిల్ ఉత్పత్తి
- ముమ్మిడివరం, అమలాపురం, రాజమహేంద్రవరాల్లో సొంత దుకాణాల ద్వారా అమ్మకం
- హెల్త్ డ్రింక్‌గా కొబ్బరి పాలకు ప్రజాదరణ



జంతువుల పాలతో తయారైన ఉత్పత్తుల కన్నా మొక్కల ద్వారా తయారయ్యే పాలు (ప్లాంట్ బేస్డ్ మిల్క్) ఆరోగ్యదాయకమైనవే కాకుండా పర్యావరణహితమైనవి కూడా అన్న అవగాహన అంతకంతకూ ప్రాచుర్యం పొందుతున్నది. ఈ కోవలోనిదే కొబ్బరి పాల ఉత్పత్తి. పచ్చి కొబ్బరి పాలతో తయారయ్యే వర్జిన్ నూనె, యోగర్ట్ (పెరుగు) వంటి ఉత్పత్తులకు ఐరోపా తదితర సంపన్న దేశాల్లో ఇప్పటికే మంచి గిరాకీ ఉంది. కొబ్బరి పాల ఉత్పత్తుల మార్కెట్ ఈ ఏడాది 84 కోట్ల డాలర్లకు చేరనుంది. వచ్చే ఆరేళ్లలో 105 కోట్ల డాలర్లు దాటుతుందని 'గ్లోబ్ న్యూస్‌వైర్' అంచనా. మన దేశంలోనూ (ముఖ్యంగా కేరళ, తమిళనాడుల్లో) వాణిజ్య స్థాయిలో కొబ్బరి పాల ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తొలి కొబ్బరి పాలు, వర్జిన్ కొబ్బరి నూనె ఉత్పత్తి యూనిట్ ప్రారంభం కావటం ఆహ్వానించదగిన పరిణామం.

రాష్ట్రంలో కొబ్బరి అధికంగా పండించే కోనసీమలోనూ కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు పెద్దగా లేవనే చెప్పవచ్చు. కేవలం కాయర్ (కొబ్బరి పీచు) ఆధారిత పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి. ఈ లోటును భర్తీ చేస్తూ కొబ్బరి పాలను, దాని నుంచి వర్జిన్ కోకోనట్ ఆయిల్ తయారీ తొలి పరిశ్రమను నెలకొల్పారు అభ్యుదయ రైతు గుత్తుల ధర్మరాజు(39). డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన ధర్మరాజు ఎంటెక్ చదువుకున్నారు. 13 ఏళ్లపాటు చమురు, సహజ వాయువు రంగంలో ఇంజినీర్‌గా సేవలందించారు. రెండేళ్ల క్రితం ముమ్మిడివరంలో ఆయన రూ. 1.5 కోట్ల పెట్టుబడితో 'కోనసీమ ఆగ్రోస్' పేరుతో పరిశ్రమను నెలకొల్పారు. 'వెల్‌విష్' పేరు మీద వర్జిన్ కోకోనట్ ఆయిల్, కొబ్బరి పాలను ఉత్పత్తి చేస్తున్నారు. కొబ్బరి పాలు, వర్జిన్ కోకోనట్ ఆయిల్‌తో పాటు పాలు తీసిన కొబ్బరి పిండిని విక్రయిస్తున్నారు. ముమ్మిడివరంతో పాటు అమలాపురం, రాజమహేంద్రవరాల్లో సొంతంగానే ప్రత్యేక దుకాణాలు తెరిచి కొబ్బరి పాలు, వర్జిన్ ఆయిల్‌లకు సంబంధించిన ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ రిటైల్‌గా అమ్ముతున్నారు.

పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలలో వెల్కం డ్రింకుగా కొబ్బరి పాలను అందించే ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారాయన.


కొబ్బరి పాలు తయారు చేసే యంత్రం

పాల వినియోగం ఇలా

- కొబ్బరి పాలను సాధారణ పాలు వినియోగించినట్టే వాడుకోవచ్చు. టీ, కాఫీలతోపాటు పాయసం, మిఠాయిలు తయారు చేసుకోవచ్చు. విదేశాల్లో ఐస్‌క్రీమ్‌ల, సౌందర్య సాధనాల తయారీలో కూడా కొబ్బరి పాల వినియోగం ఎక్కువ.
- కొబ్బరి పాలను నీరు కలవకుండా నేరుగా తీసుకోకూడదు. దీనిలో 60 శాతం ఆయిల్ ఉంటుంది. మిగిలిన 35 శాతం నీరు. 1:3 పాళ్లలో నీరు కలిపి వాడుకోవాలి. ఒక గాను కొబ్బరి పాలలో మూడు గ్లాసుల నీరు, కొంత పంచదార కలిపి రిటైల్ ఔట్‌లెట్‌లో అమ్ముతున్నారు.



పుష్కలంగా పోషకాలు

- కొబ్బరి పాలల్లో పుష్కలంగా పీచు, పిండి పదార్థాలతో పాటు.. విటమిన్–సీ, ఇ, బి1, బి3, బి4, బి6లతోపాటు ఇనుము, సెలీనియం, కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, పొటాసియం, జింక్, సోడియం ఉన్నాయి.
- కొబ్బరి పాలు వీర్యపుష్టిని కలిగిస్తాయి. అలసటను నివరించి శరీరానికి బలం చేకూరుస్తాయి. బరువు తగ్గడానికి ఉపయోగపడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నాయి. ఎలక్ట్రోలైట్స్‌ను బ్యాలెన్స్ చేయడంతోపాటు గుండె జబ్బులను నివారిస్తాయి.
- రక్తహీనతను నివారించడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. చంటి పిల్లలకు తల్లి పాలు చాలకపోతే కొబ్బరి పాలు తాపవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఆదరణ పెరుగుతోంది

కొబ్బరి పాలకు ప్రజాదరణ పెరుగుతోంది. రిటైల్ అమ్మకాలు పెరగడంతోపాటు శుభ కార్యక్రమాలకు వెల్కం డ్రింక్‌గా కూడా అమ్మకాలు పెరిగాయి. ముమ్మిడివరం, అమలాపురం, రాజమహేంద్రవరాల్లో రిటైల్ ఔట్‌లెట్‌లు ఏర్పాటు చేశాం. వాకర్లు ఎక్కువగా సేవిస్తున్నారు. వర్జిన్ కోకోనట్ ఆయిల్ పసిపిల్లలకు మసాజ్ చేయడానికి చాలా అనువైనది. దీన్ని రోజుకు రెండు స్పూన్లు తీసుకుంటే.. మహిళల్లో హార్మోన్ అసమతుల్యత ఉపశమిస్తున్నట్లు మా వినియోగదారులు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాంలలో బేబీ మసాజ్ అయిల్‌గా కోకోనట్ వర్జిన్ ఆయిల్‌కు మంచి మార్కెట్ ఉంది. ఒడిదొడుకులున్నప్పటికీ మంచి భవిష్యత్తు ఉన్న రంగం ఇది.

- గుత్తుల ధర్మరాజు (85559 44844), కొబ్బరి పాల ఉత్పత్తిదారు, ముమ్మిడివరం, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.

రోజుకు 250 లీటర్ల కొబ్బరి పాల ఉత్పత్తి

పచ్చి కొబ్బరి ముక్కలతోపాటు కొద్దిగా నీరు కలిపి మిక్సీ పట్టి కొబ్బరి పాలను తయారు చేసి కొబ్బరి అన్నం తదితర వంటలు చేస్తుండటం మనకు తెలిసిందే. పచ్చి కొబ్బరి పాల నుంచి శుద్ధమైన, ఆరోగ్యదాయకమైన పారిశ్రామిక పద్ధతుల్లో తయారు చేస్తారు. దీన్నే వర్జిన్ కోకోనట్ ఆయిల్‌గా పిలుస్తారు. పక్వానికి వచ్చిన కొబ్బరి కాయను పగల గొట్టి, చిప్పల నుంచి కొబ్బరిని వేరు చేస్తారు. కొబ్బరికి అడుగున ఉన్న ముక్కుపొడుం రంగు పలుచని పొరను తీసి వేసి గ్రైండర్ల ద్వారా కొబ్బరి పాలను తయారు చేస్తారు.

పది కేజీల (సుమారు 28) కొబ్బరి కాయల నుంచి 1.5 లీటర్ల పాలు.. ఆ పాల నుంచి ఒక లీటరు వర్జిన్ నూనెను ఉత్పత్తి చేస్తున్నట్లు ధర్మరాజు చెప్పారు. ఆయన నెలకొల్పిన పరిశ్రమకు రోజుకు 5 వేల కొబ్బరికాయల నుంచి పాలను, నూనెను తయారు చేసే సామర్థ్యం ఉంది. మార్కెట్ అవసరం మేరకు ప్రస్తుతం రోజుకు 3 వేల కాయలతో 250 లీటర్ల పాలు తీస్తారు. పాల నుంచి 125–150 లీటర్ల వర్జిన్ కొబ్బరి నూనె వస్తుంది. కొబ్బరి పాలలో 60% నూనె, 40% నీరు ఉంటాయి. ఈ పాలను సెంట్రీఫ్యూగర్స్‌లో వేసి వేగంగా (18,800 ఆర్‌పీఎం) తిప్పినప్పుడు నూనె, నీరు వేరవుతాయి. వర్జిన్ కోకోనట్ ఆయిల్ ఇలా ఉత్పత్తి అవుతుంది. ఈ క్రమంలో ఎటువంటి రసాయనాలూ వాడరు.

చిక్కటి కొబ్బరి పాలు లీటరు రూ.250లకు విక్రయిస్తున్నారు. ఈ పాలను నేరుగా తాగకూడదు. 3 రెట్లు నీరు కలిపి తాగాలి. 1:3 నీరు కలిపిన కొబ్బరి పాలు లీటరు రూ.100కు, గ్లాస్ రూ.30కు అమ్ముతున్నారు. వర్జిన్ కోకోనట్ ఆయిల్ కేజీ అమ్మకం ధర రూ.450. ఇది రెండేళ్ల వరకు నిల్వ ఉంటుంది. ఉప ఉత్పత్తుల ద్వారా కూడా ఆదాయం వస్తుంది. 3 వేల కాయల కొబ్బరి నుంచి పాలు తీసిన తర్వాత 75 కిలోల పోషక కొబ్బరి పొడి వస్తుంది. దీని ధర కిలో రూ. 125–150. కొబ్బరి చిప్పలు కూడా వృథా కావు. వీటితో తయారయ్యే యాక్టివేటెడ్ కార్బన్‌కు కూడా మంచి ధర వస్తుందన్నారు ధర్మరాజు.

- నిమ్మకాయల సతీష్ బాబు, సాక్షి అమలాపురం.


కోనసీమ ఆగ్రోస్ సంస్థ ఉత్పత్తి చేస్తున్న వర్జిన్ కోకోనట్ ఆయిల్



వెదురు నర్సరీ, సాగు, మార్కెటింగ్‌పై శిక్షణ

భారతీయ అటవీ పరిశోధన–విద్యా మండలికి అనుబంధంగా బెంగళూరులో ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐడబ్ల్యూఎస్‌టి) వెదురుపై 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వనుంది. బెంగళూరులోని సంస్థ ఆవరణలో డిసెంబర్ 5 నుంచి 9 వరకు శిక్షణ ఇస్తారు. భోజన వసతులతో కలిపి ఫీజు రూ.15 వేలు (18% జీఎస్టీ ఆదనం). వసతి వద్దనుకుంటే రూ. 10 వేలు (18% జీఎస్టీ అదనం). వెదురు నర్సరీ పెంపకం, జన్యుపరంగా మెరుగుపరచటం, వెదురు సాగు పద్ధతులు, మార్కెటింగ్, విలువ జోడింపుపై శిక్షణ ఇస్తారు. గొట్టిపురా, నల్లాల్‌ల వద్ద వెదురు ప్రయోగాత్మక క్షేత్రాల సందర్శన ఉంటుంది. ఇతర వివరాలకు కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఎం.వి. దురైను సంప్రదించవచ్చు. 080–22190159, 94459 44288, vediappand@icfre.org

***

వ్యవసాయ ఆవిష్కర్తలు, స్టార్టప్‌లకు ఆహ్వానం

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏర్పాటైన అగ్రి ఇంక్యుబేటర్ 5వ బ్యాచ్ కోసం వ్యవసాయ ఆవిష్కర్తలు, స్టార్టప్‌లకు ఆహ్వానం పలుకుతోంది. వ్యవసాయ, అనుబంధ రంగాలలో నూతన ఆవిష్కర్తలతో స్టార్టప్ సంస్థలను ఏర్పాటు చేస్తకోదలచిన ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహ పరిశోధనా సంచాలకులు డా.పి.రాజశేఖర్ తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా వినూత్న ఆలోచనలున్న వారు విద్యార్హతలతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని ఇంక్యుబేటర్ ప్రధానాధికారి డా. పి. బాల హుస్సేన్ రెడ్డి తెలిపారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి 2 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. కమిటీ ద్వారా ఎంపికైన వారికి రూ.5 లక్షల వరకు ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. వీరికి రెండు నెలలపాటు శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు నెలకు రూ.10 వేల భత్యం కూడా ఇస్తారు. స్టార్టప్‌లను ఏర్పాటు చేసుకున్న ఆవిష్కర్తల్లో ఎంపికైన వారి వ్యాపార విస్తరణకు రూ. 25 లక్షల వరకు ఆర్థిక సహకారం అందిస్తారు. డిసెంబరు 15వ తేదీ లోగా www.angraurabitpt.org వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు.. 94416 70829.

***

కోకోపోనిక్స్‌లో ఐఐహెచ్‌ఆర్ శిక్షణ రేపు

టెర్రస్‌పైన గ్రోబాగ్స్/కుండీలు/మడుల్లో కొబ్బరి పొట్టు ఎరువు నింపి పోషక ద్రవం అందించడం ద్వారా కూరగాయలు, ఔషధ మొక్కల పెంచే పద్ధతిని కోకోపోనిక్స్ అంటారు. ఈ పద్ధతిలో సాగు పద్ధతిపై బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్‌ఆర్) ఈ నెల 30న ఒక్క రోజు శిక్షణ ఇస్తోంది. అభ్యర్థులు రూ.2 వేలు చెల్లించి ప్రత్యక్ష శిక్షణకు హాజరు కావచ్చు. లేదా రూ. వెయ్యి చెల్లించి ఆన్‌లైన్‌లో హైబ్రిడ్ మోడ్‌లో శిక్షణ పొందవచ్చు. వివరాలకు.. ఐఐహెచ్‌ఆర్‌లో సాయిల్ లెస్ కల్చర్ నిపుణులు, సాయిల్ సైంటిస్ట్ డా. డి. కలైవనన్ (99866 37407)ను సంప్రదించవచ్చు. ఫోన్:7760883948 bessthort@gmail.com www.bessthort.in

కొబ్బరి పాలు.. కొత్త ట్రెండ్..



పశువులలో వచ్చే కొన్ని రకాల వ్యాధుల ప్రభావం వాటి పాల మీద ఉంటుంది. ఇది స్వల్పమోతాదే కావచ్చు. అలాగే, పశువుల పొదుగు పిండడం ద్వారా పాలను సేకరించడం ఒక విధంగా వాటిని హింసించడమేనని భావించే వారి సంఖ్య కూడా పెరిగింది. వీరు మొక్కల నుంచి వచ్చే పాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొబ్బరి పాలు వీరికి మంచి ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ఇదొక కొత్త ట్రెండ్. కొబ్బరి తెగుళ్ల ప్రభావం పాల మీద ఉండదు. కొబ్బరి పాలు ఆరోగ్యానికి చాలా మేలు. కానీ, ఏదైనా మితంగా తీసుకోవాలి.

- డాక్టర్ బి.శ్రీనివాసులు, అధిపతి, డా.వై.ఎస్.ఆర్. ఉద్యాన పరిశోధనా స్థానం, అంబాజీపేట.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



వన్డే ప్రపంచకప్‌కు అఫ్గానిస్తాన్ అర్హత

వచ్చే ఏడాది భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి అఫ్గానిస్తాన్ జట్టు అర్హత సాధించింది. వరల్డ్‌కప్ సూపర్ లీగ్‌లో ప్రస్తుతం అఫ్గానిస్తాన్ 115 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో నిలిచి బెర్త్‌ను ఖరారు చేసుకుంది. హష్మతుల్లా షాహిది కెప్టెన్సీలోని అఫ్గానిస్తాన్ ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉంది. పల్లెకెలలో రెండో వన్డే వర్షంతో రద్దు కావడంతో అఫ్గానిస్తాన్‌కు ఐదు పాయింట్లు లభించాయి. వచ్చే మార్చిలో సూపర్ లీగ్ ముగిశాక టాప్-8లో ఉన్న జట్లకు నేరుగా ప్రపంచకప్ బెర్త్‌లు లభిస్తాయి.

తొలిసారి డేవిస్‌కప్ టైటిల్ నెగ్గిన కెనడా

ప్రపంచ పురుషుల టీమ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ డేవిస్‌కప్‌లో కెనడా జట్టు తొలిసారి విజేతగా అవతరించింది. స్పెయిన్‌లో జరిగిన ఫైనల్లో కెనడా 2-0తో ఆస్ట్రేలియాపై గెలిచింది. తొలి సింగిల్స్‌లో షపోవలోవ్ 6-2, 6-4తో కొకినాకిస్‌పై నెగ్గగా, రెండో సింగిల్స్‌లో ఫెలిక్స్ అలియాసిమ్ 6-3, 6-4తో అలెక్స్ డిమినార్‌ను ఓడించి 122 ఏళ్ల డేవిస్‌కప్ చరిత్రలో కెనడాకు తొలిసారి టైటిల్ అందించాడు. 2019లో కెనడా ఫైనల్‌కు చేరినా రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.



ఫెలిక్స్

6 6 6 6 6 6 6
రుతురాజ్ రికార్డు

అంతర్జాతీయ వన్డేల్లో ఇద్దరు బ్యాటర్లు ఒకే ఓవర్లో 6 సిక్సర్లు కొట్టారు. అంతర్జాతీయ టి20ల్లో ఇద్దరు బ్యాటర్లు ఒకే ఓవర్లో 6 సిక్సర్లతో చెలరేగారు. దేశవాళీ వన్డేల్లో ఒక ఆటగాడు ఓవర్లో 6 సిక్సర్లతో సత్తా చాటాడు. దేశవాళీ టి20ల్లో ముగ్గురు బ్యాటర్లు ఓవర్లో 6 సిక్సర్లతో దూకుడు ప్రదర్శించారు. వీరంతా ఓవర్లో ఆరేసి సిక్సర్లతో పండగ చేసుకున్నారు. ఇదంతా ఇప్పటి వరకు రికార్డు... కానీ ఇప్పుడు దీన్ని దాటి ఒకే ఓవర్లో 7 సిక్సర్లతో కొత్త ఘనత నమోదైంది. మహారాష్ట్ర బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ నోబాల్ సహా 7 బంతుల్లో సిక్సర్లు బాది లిస్ట్-ఎ (దేశవాళీ, అంతర్జాతీయ వన్డేలు) క్రికెట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో (టెస్టులు, మూడు, నాలుగు రోజుల మ్యాచ్‌లు) మాత్రం రికార్డు లీ జెర్మన్ (8 సిక్సులు) పేరిట ఉంది.

- ఒకే ఓవర్లో 7 సిక్సర్లు
- రుతురాజ్ గైక్వాడ్ ప్రపంచ రికార్డు
- 159 బంతుల్లో 10 ఫోర్లు, 16 సిక్సర్లతో 220 నాటౌట్





అహ్మదాబాద్: భారత దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో గత సోమవారం నారాయణ్ జగదీశన్ ప్రపంచ రికార్డులతో హోరెత్తించాడు. ఇప్పుడు సరిగ్గా వారం రోజుల తర్వాత ఇదే టోర్నీలో మరో బ్యాటర్ కొత్త ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. మహారాష్ట్ర కెప్టెన్, భారత క్రికెటర్ రుతురాజ్ గైక్వాడ్ ఒకే ఓవర్లో 7 సిక్సర్లు బాది ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఆరు రెగ్యులర్ బంతులతో పాటు ఒక నోబాల్ ఈ ఓవర్లో రాగా, దానిని కూడా సిక్స్‌గా మలచి రుతురాజ్ మొత్తం 43 పరుగులు రాబట్టాడు. ఉత్తరప్రదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఈ ఫీట్ నమోదైంది. దీంతో ఒకే ఓవర్లో అత్యధిక పరుగుల రికార్డు కూడా సమమైంది.

లెఫ్టార్మ్ స్పిన్నర్ శివ సింగ్ బాధిత బౌలర్‌గా నిలిచాడు. 48 ఓవర్లో ముగిసేసరికి మహారాష్ట్ర 272/5గా ఉంది. 49వ ఓవర్ తర్వాత స్కోరు 315/5గా మారింది. ఆ ఓవర్లో రుతురాజ్ వరుసగా 6, 6, 6, 6, 6 (నోబాల్), 6, 6 బాదాడు. వరుసగా వైడ్‌లాంగాన్, లాంగాన్, డీప్ స్క్వేర్‌లెగ్, లాంగాఫ్ మీదుగా తొలి నాలుగు సిక్సర్లు వెళ్లాయి. ఐదో బంతిని లాంగాఫ్ మీదుగా సిక్సర్ కొట్టగా, బౌలర్ గీత దాటడంతో అంపైర్ నోబాల్‌గా ప్రకటించాడు. ఆ తర్వాత లాంగాన్, డీప్ మిడ్‌వికెట్ మీదుగా తర్వాతి రెండు సిక్సర్లను గైక్వాడ్ మలిచాడు. ఇందులో ఆరో సిక్సర్‌తో రుతురాజ్ డబుల్ సెంచరీ పూర్తయింది. చివరకు 159 బంతుల్లో 10 ఫోర్లు, 16 సిక్సర్లతో అతను 220 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో మహారాష్ట్ర 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసి సవాల్ విసరగా... 47.4 ఓవర్లలో 272 పరుగులకే ఉత్తరప్రదేశ్ ఆలౌటైంది. 58 పరుగులతో గెలిచిన మహారాష్ట్ర సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

43 ఒకే ఓవర్లో అత్యధిక పరుగుల రికార్డు సమమైంది. 2018లో న్యూజిలాండ్‌లో ఫోర్డ్ ట్రోఫీలో భాగంగా సెంట్రల్ డిస్ట్రిక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నార్తర్న్ డిస్ట్రిక్స్ నమోదు చేసింది. అయితే ఇందులో బ్రెట్ హామ్టన్ 23 పరుగులు, జో కార్టర్ 18 పరుగులు రాబట్టారు.

10 భారత్ తరఫున రోహిత్ శర్మ (3 సార్లు), సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్, పృథ్వీ షా, శిఖర్ ధావన్, సమర్థ్ వ్యాస్, కరణ్ కౌశల్ తర్వాత లిస్ట్-ఎ క్రికెట్‌లో డబుల్ సెంచరీ సాధించిన పదో భారత ఆటగాడిగా రుతురాజ్ నిలిచాడు.

ఓవర్లో 6 సిక్సర్ల వీరులు

అంతర్జాతీయ వన్డేలు
హెర్షల్ గిబ్స్ (దక్షిణాఫ్రికా)
బౌలర్: డాన్ వాన్ బంగ్ (నెదర్లాండ్స్; 2007లో)
జస్కరన్ మల్హోత్రా (అమెరికా)
బౌలర్: గాడీ టోకా (పాపువా న్యూగినియా; 2021లో)

అంతర్జాతీయ టి20లు
యువరాజ్ (భారత్)
బౌలర్: స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్; 2007లో)
కీరన్ పొలార్డ్ (వెస్టిండీస్)
బౌలర్: అఖిల ధనంజయ (శ్రీలంక; 2021లో)

ఫస్ట్ క్లాస్ క్రికెట్
సోబర్స్ (నాటింగమ్‌షైర్ కౌంటీ)
బౌలర్: నాష్ (గ్లామోర్గాన్; 1968లో)
రవిశాస్త్రి (ముంబై)
బౌలర్: తిలక్ రాజ్ (బరోడా; 1984లో)
లీ జెర్మన్ (కాంటర్‌బరీ) బౌలర్: వాన్స్ (వెల్లింగ్టన్; 1990లో)

దేశవాళీ వన్డేలు
తిసారా పెరీరా (శ్రీలంక; శ్రీలంక ఆర్మీ స్పోర్ట్స్ క్లబ్)
బౌలర్: దిల్హాన్ కూరే (బ్లూమ్‌ఫీల్డ్; 2021లో)
రుతురాజ్ గైక్వాడ్ (భారత్; మహారాష్ట్ర)
బౌలర్: శివ సింగ్ (ఉత్తరప్రదేశ్; 2022లో)

దేశవాళీ టి20లు
రోజ్ వైట్లీ (వార్సెస్టర్‌షైర్)
బౌలర్: కార్ల్ కార్వర్ (యార్క్‌షైర్; 2017లో)
లియో కార్టర్ (కాంటర్‌బరీ)
బౌలర్: ఆంటన్ డెవిచ్ (నార్తర్న్ డిస్ట్రిక్ట్స్; 2020లో)
హజ్రతుల్లా జజాయ్ (కాబూల్ జ్వానన్)
బౌలర్: అబ్దుల్లా మజారి (బాల్ఖ్ లెజెండ్స్; 2018లో)

లీ జెర్మన్ కొట్టిన మ్యాచ్‌లో...

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ లీ జెర్మన్ ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో ఒకే ఓవర్లో 8 సిక్సర్లు కొట్టడం అధికారికంగానే నమోదై ఉంది. అయితే ఆ మ్యాచ్ జరిగిన తీరు పూర్తిగా భిన్నమైంది. వెల్లింగ్టన్ కెప్టెన్ మెక్ స్వీనీ 'ప్రత్యేక వ్యూహం'లో భాగంగా ఇదంతా జరిగింది. 59 ఓవర్లలో 291 పరుగులు ఛేదించే క్రమంలో కాంటర్‌బరీ 108/8 వద్ద నిలిచింది. అయితే ఆ జట్టును అంత సులువుగా ఓడించరాదని, సులభంగా పరుగులు ఇచ్చి కాస్త ఆడిద్దామని వెల్లింగ్టన్ భావించింది. ఒకదశలో స్కోరు 196/8కు చేరింది. మరో 2 ఓవర్లు మిగలగా.. అసలు బౌలింగ్ రాని వాన్స్ చేతికి బంతి ఇచ్చారు. అతను ఓవర్లో ఏకంగా 17 నోబాల్స్ సహా 22 బంతులు వేశారు. అంటే 5 బంతులే! ఇందులోనే లీ జెర్మన్ 8 సిక్సులు బాదాడు. ఈ ఓవర్లో మొత్తం 77 పరుగులు (0444664614106666600401) వచ్చాయి. ఇప్పటికీ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక పరుగుల రికార్డు ఇదే. చివరకు మ్యాచ్ 'డ్రా' అయింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో బ్రెజిల్



కేస్‌మిరో

స్విట్జర్లాండ్‌పై 1-0తో గెలుపు

దోహా: ఐదుసార్లు విశ్వవిజేత బ్రెజిల్ వరుసగా రెండో విజయం సాధించి ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన గ్రూప్ 'జి' లీగ్ మ్యాచ్‌లో బ్రెజిల్ 1-0 గోల్ తేడాతో స్విట్జర్లాండ్‌ను ఓడించింది. ఆట 83వ నిమిషంలో కేస్‌మిరో చేసిన గోల్ బ్రెజిల్‌ను గెలిపించింది. ఈ గెలుపుతో బ్రెజిల్ ఆరు పాయింట్లతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. చివరిసారి 2002లో ఆసియా వేదికపైనే జరిగిన ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ ఈసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. తొలి మ్యాచ్‌లో సెర్బియాపై 2-0తో నెగ్గిన బ్రెజిల్ జట్టుకు ఈ మ్యాచ్‌లో గట్టిపోటీనే ఎదురైంది. పలుమార్లు స్విట్జర్లాండ్ 'డి' ఏరియాలోకి బ్రెజిల్ ఆటగాళ్లు వెళ్లినా ఫినిషింగ్ చేయలేకపోయారు. దాంతో తొలి అర్ధభాగం గోల్స్ లేకుండానే ముగిసింది. రెండో అర్ధభాగంలోనూ బ్రెజిల్ దూకుడుగానే ఆడింది. చివరకు 66వ నిమిషంలో వినిసియస్ కొట్టిన షాట్ స్విట్జర్లాండ్ గోల్ పోస్ట్‌లోనికి వెళ్లడంతో బ్రెజిల్ ఆటగాళ్లు సంబరం చేసుకున్నారు. అయితే 'వీఏఆర్' రీప్లేలో ఆఫ్‌సైడ్‌గా తేలడంతో రిఫరీ గోల్ ఇవ్వలేదు. ఈ ఘటన తర్వాత బ్రెజిల్ ఆటగాళ్లు నిరాశపడకుండా ఉత్సాహంతోనే ఆడారు. చివరకు నిర్ణీత సమయం ముగియడానికి ఏడు నిమిషాల ముందు గోల్ చేసి విజయాన్ని దక్కించుకున్నారు. మ్యాచ్ మొత్తంలో బ్రెజిల్ ఐదుసార్లు గోల్ పోస్ట్ లక్ష్యంగా షాట్‌లు కొట్టగా... స్విట్జర్లాండ్ ఒక్క షాట్ కూడా బ్రెజిల్ గోల్‌పోస్ట్‌పైకి సంధించలేకపోయింది.

జర్మనీ... డ్రాతో గట్టెక్కింది!

స్పెయిన్‌తో మ్యాచ్ 1-1తో సమం



ఫుల్‌క్‌రుగ్

దోహా: ప్రపంచకప్ ఫుట్‌బాల్ చరిత్రలో జర్మనీది ఘనచరిత్రే! బ్రెజిల్ అంతటి మేటి జట్టు జర్మనీ. బ్రెజిల్ ఐదుసార్లు గెలిస్తే... జర్మనీ నాలుగుసార్లు ప్రపంచకప్‌ను అందుకుంది. అంతేకాదు గెలిచినన్నిసార్లు రన్నరప్‌గా నిలిచింది. మరో నాలుగుసార్లు మూడో స్థానంలో నిలిచింది. ఇలా పాల్గొన్న ప్రతీ మెగా ఈవెంట్లోనూ సత్తా చాటుకున్న మేటి జట్టు గత టోర్నీలో తొలి రౌండ్ దాటకపోవడమే పెద్ద షాక్ అనుకుంటే మళ్లీ ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితుల్నే ఎదుర్కొంటుంది. స్పెయిన్‌తో జరిగిన లీగ్ పోరులో జర్మనీ 1-1తో డ్రాతో గట్టెక్కింది. స్పెయిన్ తరఫున సబ్‌స్టిట్యూట్ అల్వారో మొరాటా (62వ ని.లో), జర్మనీ జట్టులో సబ్‌స్టిట్యూట్ ఫుల్‌క్‌రుగ్ (83వ ని.లో) గోల్ చేశారు. ఇప్పుడు ఒక ఓటమి, ఒక డ్రాతో ఉన్న జర్మనీ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కోస్టారికాను ఓడిస్తేనే సరిపోదు. మిగతా జట్ల ఫలితాలు కూడా కలిసి రావాలి. ఈ గ్రూపులో ఆఖరి లీగ్ పోటీల్లో కోస్టారికాతో జర్మనీ... జపాన్‌తో స్పెయిన్ తలపడతాయి. ఈ రెండు మ్యాచ్‌లు గురువారమే జరుగనున్నాయి. దీంతో ఇంకో రెండు రోజుల్లో ఏ రెండు ముందుకో, ఏ రెండు ఇంటికో తేలిపోతుంది.

కామెరూన్‌ను కాపాడిన అబుబాకర్

సెర్బియాతో మ్యాచ్ 3-3తో డ్రా



అబుబాకర్

దోహా: కామెరూన్ స్ట్రయికర్ విన్సెంట్ అబుబాకర్ సెర్బియా గెలుపురాతను మార్చేశాడు. 3-1తో సెర్బియా గెలుపుబాట పట్టిన దశలో సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ అబుబాకర్ ఒక గోల్ చేయడంతో పాటు మరో గోల్‌కు తోడయ్యాడు. దీంతో గ్రూప్ 'జి'లో సోమవారం సెర్బియా, కామెరూన్‌ల మధ్య జరిగిన మ్యాచ్ చివరకు 3-3 స్కోరుతో 'డ్రా'గా ముగిసింది. సెర్బియా తరఫున పావ్లోవిచ్ (45+1వ ని.లో), మిలింకోవిచ్ (45+3వ ని.లో), మిత్రోవిచ్ (53వ ని.లో) గోల్ చేశారు. కామెరూన్ తరఫున క్యాస్టెలెటో (29వ ని.లో), అబుబాకర్ (63వ ని.లో), మోటింగ్ (66వ ని.లో) గోల్ సాధించారు. ర్యాంకింగ్, ఆటతీరు పరంగా కామెరూన్ కంటే సెర్బియా గట్టి ప్రత్యర్థి. ఇందుకు తగ్గట్లే తొలి అర్ధభాగాన్ని 2-1తో ముగించింది. రెండో అర్ధభాగం మొదలైన కాసేపటికే మిత్రోవిచ్ గోల్ చేయడంతో 3-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో మైదానంలోకి వచ్చిన విన్సెంట్ సెర్బియాకు కొరకరాని కొయ్యగా మారాడు. 63వ నిమిషంలో గోల్ చేసిన అతను మూడు నిమిషాల వ్యవధిలో మోటింగ్ గోల్ చేసేందుకు సాయపడ్డాడు.

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు ఖాతాలో 17వ పరాజయం చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 28-48తో జైపూర్ పింక్‌పాంథర్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. టైటాన్స్ తరఫున పర్వేశ్ ఏడు పాయింట్లు, విశాల్ నాలుగు పాయింట్లు స్కోరు చేశారు.

'ఘన'మైన విజయం

- 3-2తో కొరియాపై ఘనా సంచలన విజయం
- రెండు గోల్స్‌తో గెలిపించిన కుడూస్



కుడూస్

దోహా: తొలి మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చినా... చివరకు పోర్చుగల్ ముందు తలొగ్గిన ఆఫ్రికా దేశం ఘనా తర్వాతి పోరులో సత్తా చాటింది. తమకంటే బలమైన, ర్యాంకింగ్స్‌లో ఎంతో మెరుగ్గా ఉన్న దక్షిణ కొరియాను చిత్తు చేసి గ్రూప్ 'హెచ్'లో సమరాన్ని ఆసక్తికరంగా మార్చింది. ఈ మ్యాచ్‌లో ఘనా 3-2 గోల్స్ తేడాతో కొరియాపై విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ కుడూస్ (34వ, 68వ ని.లో) రెండు గోల్స్‌తో చెలరేగగా, మొహమ్మద్ సలిసు (24వ ని.లో) మరో గోల్ చేశాడు. కొరియా ఆటగాడు చో గూసంగ్ (58వ, 61వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు.



ఘనా ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. ఆ జట్టు ఫార్వర్డ్‌లు దూసుకుపోవడంతో తొలి 24 నిమిషాల్లోనైతే బంతి పూర్తిగా కొరియా ఏరియాలోనే కనిపించింది. చివరకు ఘనా ఫలితం రాబట్టింది. జోర్డాన్ ఆయూ ఎడమ వైపు నుంచి కొట్టిన ఫ్రీ కిక్‌ను హెడర్‌తో కెప్టెన్ ఆంద్రూ ఆయూ నియంత్రణలోకి తెచ్చుకోగా, ఆ వెంటనే సలిసు గోల్‌గా మలిచాడు. మరో పది నిమిషాల్లోనే ఘనా ఆధిక్యం పెంచుకుంది. ఈసారి కూడా జోర్డాన్ ఆయూనే పాస్ అందించగా... కుడూస్ హెడర్‌తో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపడంతో విస్తుపోవడం కొరియా వంతైంది. తొలి అర్ధభాగంలో ఘనా ఆట చూస్తే కొరియా చిత్తుగా ఓడుతుందనిపించింది. అయితే విరామం తర్వాత కొరియా కోలుకుంది. 168 సెకన్ల వ్యవధిలో చో గూసంగ్ చేసిన రెండు హెడర్ గోల్స్ ఒక్కసారిగా మ్యాచ్ పరిస్థితిని మార్చేశాయి. లీ కాంగ్ ఇచ్చిన క్రాస్‌తో తొలి గోల్ చేసిన గూసంగ్, రెండో గోల్‌తో అద్భుతాన్ని ప్రదర్శించాడు. కిమ్ జిన్ కిక్ కొట్టగా, గోల్ పోస్ట్ ముందు గిడియాన్ మెన్సాను తప్పించి గాల్లోకి ఎగురుతూ గోల్ సాధించడం హైలైట్‌గా నిలిచింది. స్కోరు సమం కావడంతో మళ్లీ హోరాహోరీ మొదలైంది. అయితే కొరియా డిఫెన్స్ వైఫల్యాన్ని సొమ్ము చేసుకుంటూ కుడూస్ మళ్లీ జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కొరియా ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. చివర్లో ఘనా గోల్‌కీపర్ లారెన్స్ అతీ జిగీ మెరుపు వేగంతో కదులుతూ గోల్స్‌ను అడ్డుకోవడం విశేషం. మ్యాచ్ తర్వాత పెనాల్టీ విషయంలో రిఫరీ ఆంథోనీ టేలర్‌తో వాదనకు దిగిన కొరియా కోచ్ బెంటో రెడ్‌కార్డుకు గురయ్యాడు.



ప్రపంచకప్‌లో నేడు

ఈక్వెడార్ X సెనెగల్	రాత్రి గం. 8:30 నుంచి
నెదర్లాండ్స్ X ఖతర్	రాత్రి గం. 8:30 నుంచి
ఇరాన్ X అమెరికా	అర్ధరాత్రి గం. 12:30 నుంచి
ఇంగ్లండ్ X వేల్స్	అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా



● రామ్మోహన్ రావు, ధనుష్, శేఖర్ కమ్ముల, సునీల్ నారంగ్

మూడు భాషల్లో...

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో మూడు భాషల్లో తెరకెక్కనున్న సినిమా షురూ అయింది. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ''తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రాన్ని నిర్మించి, విడుదల చేస్తాం. వివిధ భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు, అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు మా సినిమా కోసం పని చేయనున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్.

ఆ సమయంలో సినిమా విలువ తెలిసింది

\- చిరంజీవి



● చిరంజీవి, అనురాగ్ ఠాకూర్

''మన తెలుగు ప్రేక్షకులు, తెలుగు అభిమానులు ఈ ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వారి ప్రేమకు నేను దాసోహం.. వాళ్ల ప్రేమకు నేను దాసుణ్ని. ఆ ప్రేమ కావాలి.. ఆ ప్రేమే నన్నీ స్థాయికి తీసుకొచ్చింది. ఇలాంటి గొప్ప అవార్డులు పొందేందుకు అవకాశం కల్పించింది. మీకు జీవితాంతం కృతజ్ఞతతో ఉంటాను'' అని చిరంజీవి అన్నారు. గోవాలో జరుగుతున్న 53వ 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ)' ముగింపు వేడుకకి సతీమణి సురేఖతో కలిసి చిరంజీవి హాజరయ్యారు. ఈ వేదికపై కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ చేతుల మీదుగా 'ఇండియన్ ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ – 2022' పురస్కారాన్ని చిరంజీవి అందుకున్నారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ– ''ఈ అవార్డును ఇచ్చినందుకు భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీగారికి థ్యాంక్స్. ఈ క్షణం కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాను. ఈ అవార్డు నాకే కాదు.. నా ఫ్యాన్స్‌లోనూ ఎంతో ఉత్సాహం నింపింది. శివశంకర్ వరప్రసాద్‌గా మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నాకు చిత్ర పరిశ్రమ చిరంజీవిగా మరో జన్మనిచ్చింది. 45 ఏళ్లకుపైగా ఇండస్ట్రీలో ఉన్నాను. రాజకీయాల్లోకి వెళ్లడం వల్ల కొన్నేళ్లు గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో సినిమా విలువ ఏంటో తెలిసింది. మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చినప్పుడు ప్రేక్షకులు ఎప్పటిలానే నాపై ప్రేమను చూపారు. నా చివరి శ్వాస వరకు సినిమాలు చేస్తాను. అవినీతి లేని ఏకైక రంగం సినిమా రంగం. ఇక్కడికి ఎవరైనా రావొచ్చు. ప్రతిభ ఒక్కటే కొలమానం. నాకు యువ హీరోలు పోటీ కాదు.. నేనే వాళ్లకు పోటీ.. వాళ్లకు ఇప్పుడు కష్టకాలమే (నవ్వుతూ). గతంలో ఇలాంటి వేడుకలో పాల్గొన్నప్పుడు అక్కడ దక్షిణాదికి చెందిన ఒక్క నటుడి ఫొటో కూడా లేకపోవడంతో చాలా బాధపడ్డాను. కానీ, ఇప్పుడు ప్రాంతీయ భేదాలు తొలగిపోయి భారతీయ సినిమా అనే రోజు రావడం హ్యాపీగా ఉంది. భవిష్యత్తులో మన భారతీయ సినిమా మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలి'' అన్నారు.

ఈ సీజన్ హిట్‌ది అని అర్థం కావాలి

\- ఎస్ఎస్ రాజమౌళి



● శైలేష్, మీనాక్షి, ప్రశాంతి, నాని, రాజమౌళి, అడివి శేష్

''హిట్ 2' ట్రైలర్ బాగా నచ్చింది. అందులోని నేపథ్య సంగీతం ఇంకా బాగుంది.. మంచి ఎనర్జీ ఇచ్చింది. ట్రైలర్ చూడగానే సినిమా చూడాలనే ఉత్సుకత కలిగింది'' అని ప్రముఖ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హిట్ 2'. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ–''హిట్' అనే అద్భుతమైన ఫ్రాంచైజీని సృష్టించిన నాని, ప్రశాంతి, శైలేష్‌లను అభినందిస్తున్నాను. థ్రిల్లర్ జానర్‌లో శైలేష్ బాగా తీశాడు.. ఈ చిత్రం హిట్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. 'హిట్ 3, 4, 5' సినిమాలు వస్తాయి.. అయితే ప్రతి ఏడాది ఒక సీజన్‌లో 'హిట్' ఫ్రాంచైజీ రావాలి.. ఈ సీజన్ 'హిట్'ది అని జనాలకు అర్థం కావాలి. ప్రతి ఏడాది ఒకే నెల ఒకే తేదీన ఈ చిత్రాలు విడుదలవుతుండాలి. సాంకేతిక విలువలు బాగున్నాయి. నటీనటులు ఫెంటాస్టిక్‌గా చేశారు. తెలుగు ఇండస్ట్రీ నుంచి వస్తున్న మంచి ప్రాడక్ట్ ఇది.. మేమంతా గర్వపడుతున్నాం'' అన్నారు. నాని మాట్లాడుతూ–''హిట్' ఫ్రాంచైజీలో 3,4,5,6,7 సినిమాలు ఉంటాయి. 7వ పార్ట్‌లో యూనివర్సల్‌గా అందరి హీరోలను కలుపుతానని, ఓ పెద్ద సమస్య పరిష్కారం కోసం వాళ్లని తీసుకొస్తానని శైలేష్ చెప్పాడు. ఓ నిర్మాతగా కంటే ప్రేక్షకునిగా ఆ మూవీ చూసేందుకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాను'' అన్నారు. ఈ వేడుకలో హీరోలు అడివి శేష్, విశ్వక్ సేన్, నిర్మాత శోభు యార్లగడ్డ, మీనాక్షి చౌదరి, సంగీత దర్శకులు ఎంఎం శ్రీలేఖ, సురేష్ బొబ్బిలి, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తదితరులు మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
29-11-2022

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
211	50
62,505	18,563

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్‌	11,146	▽	80
డోజోన్స్‌	34,076	▽	271
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,474	▽	13
డాక్స్‌	14,383	▽	158
షాంఘై	3,079	▽	23
నికాయ్‌	28,162	▽	120

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	52,852
బంగారం (99.5 స్వచ్ఛత)	52,640
వెండి (కేజీ)	62,110

బడ్జెట్‌లో పన్నులు తగ్గించాలి

- ఉపాధి కల్పన పెంచాలి
- మరిన్ని నిధులు ఖర్చు చేయాలి
- బడ్జెట్‌ ముందస్తు భేటీల్లో వినతులు



న్యూఢిల్లీ: వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గించాలన్నది బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ముందుకు వచ్చిన ప్రధాన డిమాండ్లలో ఒకటి. అలాగే, మరింత మందికి ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని, ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా మరిన్ని నిధులను ఖర్చు చేయాలని, పలు రంగాలకు ప్రోత్సాహకాలు కల్పించాలన్న డిమాండ్లు వచ్చాయి. కేంద్ర ఆర్థిక శాఖ 2023-24 బడ్జెట్‌కు ముందు వివిధ భాగస్వాములు, పరిశ్రమలతో సంప్రదింపులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ ఈ నెల 21న పలు రంగాల పరిశ్రమల ప్రతినిధులతో చర్చలు మొదలు పెట్టారు. సోమవారం ఆర్థికవేత్తల అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా చర్చలను ముగించారు. వచ్చే ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను మంత్రి సీతారామన్‌ పార్లమెంట్‌కు సమర్పించనుండడం గమనార్హం. ఎంఎస్‌ఎంఈలకు గ్రీన్‌ సర్టిఫికేషన్, పట్టణ నిరుద్యోగుల కోసం ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టాలని, ఆదాయపన్నును క్రమబద్ధీకరించాలనే డిమాండ్లు వచ్చినట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన విడుదల చేసింది. దేశీయంగా సరఫరా వ్యవస్థ బలోపేతం, ఎలక్ట్రిక్‌ వాహనాలపై పన్నుల తగ్గింపు, ఈవీ విధానాన్ని ప్రకటించడం, గ్రీన్‌ హైడ్రోజన్‌కు భారత్‌ను కేంద్రం చేయడం, చిన్నారులకు సామాజిక భద్రత ప్రయోజనం, ఈఎస్‌ఐసీ కింద అసంఘటిత రంగ కార్మికులకు కవరేజీ కల్పించాలన్న డిమాండ్లు కూడా వచ్చాయి.

2022-23లో వృద్ధి 7 శాతమే!

- ఎస్‌అండ్‌పీ అంచనాల కోత
- క్రితం అంచనా 7.3 శాతం



న్యూఢిల్లీ: భారత్‌ 2022-23 వృద్ధి రేటు అంచనాలను అంతర్జాతీయ రేటింగ్‌ దిగ్గజం- స్టాండర్డ్‌ అండ్‌ పూర్‌ (ఎస్‌అండ్‌పీ) కుదించింది. క్రితం (సెప్టెంబర్‌ నాటి) 7.3 శాతం అంచనాలను 7 శాతానికి కుదిస్తున్నట్లు తెలిపింది. అయితే దేశీయంగా పటిష్టంగా ఉన్న డిమాండ్‌ పరిస్థితులు ఎకానమీని అంతర్జాతీయ ప్రతికూలతలను తట్టుకుని నిలబడేలా చేస్తున్నట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్స్‌ ఆసియా-పసిఫిక్‌ చీఫ్‌ ఎకనమిస్ట్‌ లూయిస్‌ క్యూజియెస్‌ విశ్లేషించారు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధి సెప్టెంబర్‌ 6.5 శాతం అంచనాను తాజాగా 6 శాతానికి తగ్గిస్తున్నట్లు పేర్కొంది. వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్‌ ద్రవ్యోల్బణం 2022-23లో సగటును 6.8 శాతంగా ఉంటుందని, 2023 మార్చి నాటికి ఆర్‌బీఐ కీలక రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై సెంట్రల్‌ బ్యాంక్‌ వసూలు చేసే వడ్డీరేటు (ప్రస్తుతం 5.9 శాతం) 6.25 శాతానికి చేరుతుందని ఎస్‌అండ్‌పీ భావిస్తోంది. ద్రవ్యోల్బణం లక్ష్యంగా ఆర్‌బీఐ మే నుంచి రెపో రేటును నాలుగు దఫాల్లో 1.9 శాతం పెంచింది. దీనితో ఈ రేటు మూడేళ్ల గరిష్టానికి చేరింది. తాజా ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రిజర్వ్‌ బ్యాంక్‌ (ఆర్‌బీఐ)సహా పలు దేశీయ, అంతర్జాతీయ బ్యాంకింగ్, ఆర్థిక, వాణిజ్య దిగ్గజ సంస్థలు 2022-23 భారత్‌ తొలి వృద్ధి అంచనాలకు కోత పెడుతున్న సంగతి తెలిసిందే. 6.5 శాతం నుంచి 7.3 శాతం శ్రేణిలో వృద్ధి నమోదవుతుందన్నది ఆయా అంచనాల సారాంశం.

ఆటో రంగంలో రూ.65,000 కోట్లు

- 2024-25 నాటికి పెట్టుబడులు
- ఇక్రా తాజా నివేదికలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: దేశీయ ప్యాసింజర్‌ వాహన రంగంలో 2024-25 నాటికి భారీ పెట్టుబడులు రానున్నాయని రేటింగ్‌ ఏజెన్సీ ఇక్రా సోమవారం తెలిపింది. అధికం అవుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఉత్పత్తి సామర్థ్యాలను పెంచేందుకు, ఎలక్ట్రిక్‌ వాహనాల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ల అభివృద్ధితో సహా కొత్త ఉత్పత్తుల రూపకల్పనకై తయారీ కంపెనీలు సుమారు రూ.65,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయని వెల్లడించింది. 'ఇప్పటికే కొన్ని సంస్థలు రూ.25,000 కోట్ల విలువైన విస్తరణ ప్రణాళికలను ప్రకటించాయి. 2022 ప్రారంభం నుండి ప్యాసింజర్‌ వాహనాలకు డిమాండ్‌ ఆరోగ్యంగా ఉంది. బలమైన అంతర్లీన డిమాండ్‌కుతోడు సెమీకండక్టర్‌ కొరత సమస్య తగ్గుముఖం పట్టడం ఇందుకు సహాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్యాసింజర్‌ వెహికిల్‌ పరిశ్రమ హోల్‌సేల్‌ పరిమాణం 21-24 శాతం వృద్ధితో 37-38 లక్షల యూనిట్లను తాకవచ్చు. సరఫరా వ్యవస్థ మెరుగుపడడంతో వాహన కంపెనీల సామర్థ్య వినియోగం గత కొన్ని త్రైమాసికాలుగా పటిష్ట స్థాయికి చేరింది. బలమైన డిమాండ్‌ సెంటిమెంట్‌ కొనసాగుతుండడంతో కంపెనీలు ఇప్పుడు తమ సామర్థ్య విస్తరణ ప్రణాళికలను పునరుద్ధరించాయి. కొత్త సామర్థ్యాలను జోడించడం వల్ల రాబోయే కొద్ది సంవత్సరాల్లో ప్లాంట్ల వినియోగ స్థాయిలు స్వల్పంగా తగ్గుతాయి. పటిష్ట డిమాండ్‌తో వినియోగం దాదాపు 70 శాతం వద్ద సౌకర్యవంతమైన స్థాయిలో ఉండే అవకాశం ఉంది' అని ఇక్రా వెల్లడించింది.

లాభాల బాటలో ఓయో

న్యూఢిల్లీ: ట్రావెల్‌ టెక్‌ కంపెనీ ఓయో ఈ ఆర్థిక సంవత్సరం (2022-23) తొలి అర్ధభాగం ఫలితాలు ప్రకటించింది. పబ్లిక్‌ ఇష్యూ యోచనలో ఉన్న కంపెనీ ఏప్రిల్‌-సెప్టెంబర్‌లో రూ. 63 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 280 కోట్ల ఇబిటా నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం 24% ఎగసి రూ. 2,905 కోట్లను తాకింది. ఫలితాలను క్యాపిటల్‌ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి దాఖలు చేసింది. తాజా సమీక్షా కాలంలో సర్దుబాటు తదుపరి రూ. 63 కోట్ల నిర్వహణ లాభం ఆర్జించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)	
29-11-2022	
విశాఖ	540-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	539-00
విజయవాడ	539-00
రిటైల్‌ ధర (డజను)	78.00
28-11-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	541-00
వరంగల్‌	543-00
రిటైల్‌ ధర	6.00

సరికొత్త శిఖరానికి నిఫ్టీ

- తాజా జీవితకాల గరిష్టానికి సెన్సెక్స్‌
- దలాల్‌ స్ట్రీట్‌లో మళ్లీ రికార్డుల మోత
- రికార్డు ర్యాలీకి రిలయన్స్‌ దన్ను
- కలిసొచ్చిన క్రూడాయిల్‌ పతనం
- సూచీలకు అయిదోరోజూ లాభాలే



ముంబై: దలాల్‌ స్ట్రీట్‌లో మళ్లీ రికార్డుల మోత మోగింది. స్టాక్‌ సూచీలు సోమవారం సరికొత్త శిఖరాలకు చేరి కొత్త రికార్డు నెలకొల్పాయి. వరుసగా అయిదోరోజూ లాభాలు కొనసాగడంతో సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపులోనూ జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్‌ ధరలు పదినెలల కనిష్టానికి దిగిరావడం కలిసొచ్చింది. భవిష్యత్తులో ఫెడ్‌ రిజర్వ్‌ వడ్డీరేట్ల పెంపుదల నెమ్మదించవచ్చనే అంచనాలు బుల్స్‌కు బలాన్నిచ్చాయి. డాలర్‌ ఇండెక్స్‌ 106 స్థాయికి పతనం కావడంతో దేశీయ కరెన్సీ రూపాయి విలువ బలపడింది. భారత ఈక్విటీలను కొనేందుకు విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి ఆసక్తి కనబరుస్తున్నారు. అధిక వెయిటేజీ రిలయన్స్‌ షేరు నాలుగు శాతం రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న దేశీయ సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ఇంధన, ఆటో, పారిశ్రామిక, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ రంగాలకు చెందిన చిన్న, మధ్యతరహా షేర్లకు డిమాండ్‌ లభించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. సెన్సెక్స్‌ తాజా జీవిత గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ కొత్త రికార్డు స్థాయిని లిఖించింది. అయితే గరిష్టాల స్థాయి వద్ద లాభాల స్వీకరణతో కాస్త వెనక్కి తగ్గి ముగిశాయి. మెటల్, టెలికం, ఐటీ, టెక్‌ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చైనాలో కోవిడ్‌ లాక్‌డౌన్‌ విధింపు ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

నష్టాల్లోంచి రికార్డు స్థాయిలకి...

సెన్సెక్స్‌ ఉదయం 278 పాయింట్ల నష్టంతో 62,016 వద్ద, నిఫ్టీ 82 పాయింట్లు పతనమై 18,431 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఆరంభంలోనే నష్టాల్లోంచి తేరుకున్న సూచీలు క్రమంగా రికార్డు స్థాయిల దిశగా కదిలాయి. ఈ క్రమంలో సెన్సెక్స్‌ 407 పాయింట్లు దూసుకెళ్లి 62,701 వద్ద తాజా జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం 101 పాయింట్లు బలపడి 18,614 వద్ద కొత్త ఆల్‌టైం హై స్థాయిని తాకింది. దీంతో గతేడాది(2021) అక్టోబరు 19న నమోదైన 18,604 జీవితకాల రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. ఆఖరి గంటలో లాభాల స్వీకరణతో సెన్సెక్స్‌ 211 పాయింట్ల లాభంతో 62,505 వద్ద, నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి 18,563 వద్ద స్థిరపడ్డాయి. ఈ ముగింపు స్థాయిలు కూడా రికార్డు గరిష్టాలు కావడం విశేషం.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- గతేడాది(2021) అక్టోబరు 19న నమోదైన 18,604 ఆల్‌టైం హై స్థాయిని అధిగమించేందుకు నిఫ్టీకి 275 ట్రేడింగ్‌ సెషన్ల సమయం పట్టింది. అలాగే ఈ ఏడాది(2022) జూన్‌ 17న ఏడాది కనిష్ట స్థాయి(15,183) నుంచి 22% ర్యాలీ చేసింది.
- క్రూడ్‌ ధరల పతనం రిలయన్స్‌కు కలిసొచ్చింది. బీఎస్‌ఈలో నాలుగుశాతం లాభపడి రూ.2,722 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి మూడున్నర శాతం లాభంతో రూ.2,708 వద్ద స్థిరపడింది.

ప్రభుత్వానికి డివిడెండ్‌ దన్ను

ఈ ఏడాది ఇప్పటివరకూ రూ. 23,797 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్‌ రూపేణా రూ. 5,001 కోట్లు లభించింది. వెరసి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(సీపీఎస్‌ఈ)ల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం(2022-23)లో ఇప్పటివరకూ ప్రభుత్వం డివిడెండ్ల ద్వారా దాదాపు రూ. 23,797 కోట్లు అందుకుంది. ఈ విషయాలను దీపమ్‌ కార్యదర్శి తుహిన్‌ కాంతా పాండే తాజాగా ట్వీట్‌ ద్వారా వెల్లడించారు. 2020లో నిలకడైన డివిడెండ్ల చెల్లింపు విధానాలను అవలంబించమంటూ సీపీఎస్‌ఈలకు దీపమ్‌ సూచించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా లాభదాయకత, పెట్టుబడి అవసరాలు, నగదు నిల్వలు, నెట్‌వర్త్‌ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూనే అధిక డివిడెండ్‌ చెల్లింపులకు ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సీపీఎస్‌ఈలు వార్షికంగా నికర లాభాల నుంచి కనీసం 30% లేదా నెట్‌వర్త్‌లో 5% డివిడెండ్లుగా ప్రకటించవలసి ఉంటుంది.

ఆన్‌లైన్‌లోనే వినియోగదారుల ఫిర్యాదులు

వచ్చే ఏప్రిల్‌ నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లోనే నమోదు చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది. వచ్చే ఏప్రిల్‌ నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చే యోచనతో ఉంది. దీనివల్ల ఫిర్యాదులకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం వినియోగదారులు కన్స్యూమర్‌ కమిషన్‌లు లేదా కన్స్యూమర్‌ కోర్టుల్లో ఫిర్యాదులను భౌతికంగా, ఆన్‌లైన్‌లోనూ దాఖలు చేస్తున్నారు. కరోనా మహమ్మారి రాకతో చాలా సేవలు డిజిటల్‌ రూపాన్ని సంతరించుకోవడం తెలిసిందే. ఇందులో భాగంగా 2020 సెప్టెంబర్‌ 7 నుంచి వినియోగదారుల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసే విధానం అమల్లోకి వచ్చింది. ఎలక్ట్రానిక్‌ రూపంలో ఫిర్యాదుల దాఖలు విధానం విజయవంతమైన దృష్ట్యా 2023 ఏప్రిల్‌ 1 నుంచి దీన్ని తప్పనిసరి చేయనున్నట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అధికారి ఒకరు తెలిపారు. దీనివల్ల న్యాయవాదుల సాయం లేకుండా వినియోగదారులే స్వయంగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చన్నారు. ఒక్కసారి ఎలక్ట్రానిక్‌ రూపంలో ఫిర్యాదు నమోదైతే, వేగంగా పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

భవిత

- గ్రూప్‌1, గ్రూప్‌2 ప్రత్యేకం- ఇండియన్‌ పాలిటీ కోసం

ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిర్‌ఫోర్స్ కామన్‌ అడ్మిషన్‌ టెస్ట్‌-2023

వాయుసేనలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు అందించే.. ఎయిర్‌ఫోర్స్‌ కామన్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌ (ఏఎఫ్‌క్యాట్‌)-2023 నోటిఫికేషన్‌ విడుదలైంది. దీని ద్వారా మొత్తం 258 పోస్టులు భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఫ్లైయింగ్‌ బ్రాంచ్‌ పోస్టులకు ఏదైనా డిగ్రీ లేదా బీఈ/బీటెక్‌ ఉత్తీర్ణులు అర్హులు. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్‌ తప్పనిసరి.
- గ్రౌండ్‌ డ్యూటీ టెక్నికల్‌ పోస్టులకు ఏరోనాటికల్‌ ఇంజనీరింగ్‌ (ఎలక్ట్రానిక్స్‌ /మెకానికల్‌) విభాగాల్లో లేదా అనుబంధ బ్రాంచ్‌ల్లో బీఈ/బీటెక్‌ పూర్తి చేసి ఉండాలి. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్‌ ఉత్తీర్ణత తప్పనిసరి.
- గ్రౌండ్‌ డ్యూటీ(నాన్‌ టెక్నికల్‌) పోస్టుల్లో వివిధ విభాగాలను అనుసరించి ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్‌ ఉత్తీర్ణత; ఏదైనా డిగ్రీ లేదా బీఈ/బీటెక్‌ లేదా బీకామ్‌/బీఎస్సీ/బీబీఏ/సీఏ/సీఎంఏ/సీఎస్‌/సీఎఫ్‌ఏ, పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆయా పోస్టులను అనుసరించి 20-26 ఏళ్ల మధ్య ఉండాలి. అవివాహిత పురుషులు, మహిళలు అర్హులు.
- **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ఆన్‌లైన్‌ పరీక్ష, స్టేజ్‌1, స్టేజ్‌2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్‌ పైలెట్‌ సెలక్షన్‌ టెస్ట్, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ విధానం ద్వారా.
- **దరఖాస్తు తేదీలు:** 01.12.2022 నుంచి 30.12.2022 వరకూ
- **వెబ్‌సైట్‌:** https://afcat.cdac.in

పదితోనే సీఐఎస్‌ఎఫ్‌ కానిస్టేబుల్

జాబ్స్‌ ఇన్ఫో

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్‌ ఇండస్ట్రియల్‌ సెక్యూరిటీ ఫోర్స్‌(సీఐఎస్‌ఎఫ్‌).. దేశవ్యాప్తంగా వివిధ పారిశ్రామిక యూనిట్లకు రక్షణ కల్పిస్తోంది. ఈ యూనిట్లలో పనిచేసేందుకు సీఐఎస్‌ఎఫ్‌ 787 కానిస్టేబుల్‌/ట్రేడ్స్‌మెన్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతుంది. పదోతరగతి విద్యార్హతతో మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 787(పురుషులు-641, మహిళలు-69, ఎక్స్‌సర్వీస్‌మెన్‌-77)

పోస్టులు/ట్రేడ్‌ల వారీగా ఖాళీలు

- కానిస్టేబుల్‌/కుక్‌-304, కానిస్టేబుల్‌/ కోబ్లర్‌-06, కానిస్టేబుల్‌/టైలర్‌-27, కానిస్టేబుల్‌/బార్బర్‌-102, కానిస్టేబుల్‌/వాషర్‌మ్యాన్‌-118, కానిస్టేబుల్‌/స్వీపర్‌-199, కానిస్టేబుల్‌/పెయింటర్‌-01, కానిస్టేబుల్‌/ప్లంబర్‌-04, కానిస్టేబుల్‌ /మాలి-03, కానిస్టేబుల్‌ /వెల్డర్‌-03. **బ్యాక్‌లాగ్‌ పోస్టులు:** కానిస్టేబుల్‌ /కోబ్లర్‌-01, కానిస్టేబుల్‌ /బార్బర్‌-07.

అర్హతలు

- పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి, ఇండస్ట్రియల్‌ ట్రెనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. • **వయసు:** 01.08.2022 నాటికి 18-23 ఏళ్ల మధ్య ఉండాలి.

శారీరక ప్రమాణాలు

- **ఎత్తు:** పురుషులు 170 సెం.మీ, మహిళా అభ్యర్థులు 157 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతీ ఊపిరి పీల్చి,వదిలినప్పుడు 80-85 మధ్య ఉండాలి.
- **రన్నింగ్‌ టెస్ట్‌:** పురుష అభ్యర్థులు 1.6 కి.మీ దూరాన్ని 6 నిమిషాల 30 సెకన్లలో పరుగెత్తాలి. మహిళా అభ్యర్థులు 800 దూరాన్ని 4 నిముషాల్లో పరుగెత్తాలి.
- **వేతనాలు:** ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు ప్రతి నెల రూ.21,700 నుంచి రూ.69,100 వరకు వేతనంగా పొందుతారు. అంతేకాకుండా ఇతర ప్రయోజనాలు కూడా లభిస్తాయి.

ఎంపిక ప్రక్రియ

ఫిజికల్‌ స్టాండర్డ్స్‌ టెస్ట్‌(పీఎస్‌టీ), ఫిజికల్‌ ఎఫిషియన్సీ టెస్ట్‌(పీఈటీ), డాక్యుమెంటేషన్, ట్రేడ్‌ టెస్ట్, ఓఎంఆర్‌ బేస్డ్‌/కంప్యూటర్‌ బేస్డ్‌(సీబీటీ), మెడికల్‌ టెస్ట్, రాత పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష ఇలా

పీఎస్‌టీ,పీఈటీ,డాక్యుమెంటేషన్, ట్రేడ్‌ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులను రాత పరీక్షకు ఎంపిక చేస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. 100 ప్రశ్నలకు-100 మార్కులకు ప్రశ్నపత్రం ఇస్తారు. ఇందులో జనరల్‌ అవేర్‌నెస్‌/జనరల్‌ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్‌ నాలెడ్జ్,ఎనలిటికల్‌ ఆప్టిట్యూడ్, హిందీ/ఇంగ్లిష్‌లో ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించే ప్రశ్నలుంటాయి. ఇంగ్లిష్‌/హిందీ మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. నెగిటివ్‌ మార్కింగ్‌ లేదు.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 20.12.2022
- **వెబ్‌సైట్‌:** https://cisfrectt.in

చదువుతోపాటు సంపాదన

పార్ట్‌ టైమ్‌ జాబ్స్‌.. కొన్నేళ్ల క్రితం వరకు విదేశాలకే పరిమితం. ఉన్నత విద్య కోసం అమెరికా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో చేరిన విద్యార్థులు పార్ట్‌టైమ్‌ జాబ్స్‌ చేస్తున్నట్లు చెప్పటం తెలిసిందే. ఇప్పుడు మన దేశంలోనూ పార్ట్‌టైమ్‌ కొలువుల కల్చర్‌ విస్తరిస్తోంది. ముఖ్యంగా డిజిటలైజేషన్, ఈ-కామర్స్‌ రంగాల విస్తరణ కారణంగా.. విద్యార్థులు చదువుకుంటూనే ఖాళీ సమయంలో కొన్ని గంటలు పనిచేసి కొంత ఆదాయం పొందేందుకు అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో.. పార్ట్‌టైమ్‌ అవకాశాలు కల్పిస్తున్న రంగాలు, అందుకునేందుకు మార్గాలు, వేతనాలు తదితర వివరాలతో ప్రత్యేక కథనం...



- » అందుబాటులో పలు పార్ట్‌ టైమ్‌ జాబ్స్‌
- » ట్రెడిషనల్‌ నుంచి ఐటీ వరకు అవకాశాలు
- » చదువుకుంటూనే సంపాదనకు మార్గం
- » సగటున నెలకు రూ.15 వేలు ఆర్జించొచ్చు

మన దేశంలో ప్రస్తుతం పార్ట్‌ టైమ్‌ జాబ్స్‌ ట్రెండ్‌ మారుతోంది. గతంలో పార్ట్‌ టైమ్‌ జాబ్స్, ఫ్రీలాన్స్‌ జాబ్స్‌ అంటే ట్రాన్స్‌లేషన్స్, జర్నలిజం, ఫోటోగ్రఫీ వంటి వాటికే పరిమితం. కానీ..ప్రస్తుత కార్పొరేట్‌ యుగంలో..అన్ని రంగాల్లోనూ పార్ట్‌ టైమ్‌ ఉద్యోగాల సంస్కృతి పెరుగుతోంది. ముఖ్యంగా కోవిడ్‌ మహమ్మారి నేపథ్యంలో సేవల రంగం మొదలు ఐటీ వరకూ.. పార్ట్‌ టైమ్‌ జాబ్స్‌ అందుబాటులోకి వచ్చాయి.

అఫ్లియేట్‌ మార్కెటింగ్‌

ఇటీవల పార్ట్‌ టైమ్‌ ఉద్యోగాల్లో వినిపిస్తున్న మాట.. అఫ్లియేట్‌ మార్కెటింగ్. సొంతంగా వెబ్‌సైట్‌ రూపొందించుకున్న వ్యక్తులు.. సదరు పోర్టల్‌లో ఇతర సంస్థలకు సంబంధించిన వెబ్‌ లింక్స్‌ను, ఉత్పత్తులను తమ వెబ్‌సైట్‌ వీక్షకులకు కనిపించేలా చేయడమే అఫ్లియేట్‌ మార్కెటింగ్. ఒక విధంగా చెప్పాలంటే.. తమ వెబ్‌సైట్‌ ద్వారా మరో సంస్థకు మార్కెటింగ్‌ చేయడాన్నే అఫ్లియేట్‌ మార్కెటింగ్‌గా పేర్కొనొచ్చు. ఈ పద్ధతిలో సంస్థలు సదరు వెబ్‌సైట్‌ నుంచి ఎక్స్‌టర్నల్‌ లింక్స్‌తో తమ ఉత్పత్తులను వీక్షించిన వారి సంఖ్య ఆధారంగా పారితోషికం చెల్లిస్తున్నాయి. ఈ విధానంలోనూ నెలకు రూ.20వేల వరకు సంపాదించే అవకాశం ఉంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ వంటి సంస్థలు ఇందుకోసం ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నాయి.

డెలివరీ అసోసియేట్స్‌

డెలివరీ అసోసియేట్స్‌ అంటే.. సంస్థల ఉత్పత్తులను వినియోగదారులకు చేరవేసే వారు. ఇవి ఎక్కువగా ఈ-కామర్స్, రిటెయిల్‌ రంగాల్లో లభిస్తున్నాయి. వీటికి పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ విద్యార్హతగా ఆయా సంస్థలు నిర్దేశిస్తున్నాయి. ఈ ఉద్యోగాలకు మొగ్గు చూపే యువత సంఖ్య కూడా పెరుగుతోంది. ముఖ్యంగా డెలివరీ డ్రైవర్స్, విష్‌ మాస్టర్‌ ఉద్యోగాల పట్ల ఆసక్తి కనిపిస్తోంది. డెలివరీ బాయ్స్‌ ఉద్యోగాలకు బ్యాచిలర్‌ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా పోటీ పడుతున్నారని క్వికర్‌ జాబ్స్‌ నివేదిక పేర్కొంది. వీరికి సగటున రూ.15 వేలు లభిస్తున్నట్లు తెలిపింది.

ఆన్‌లైన్‌/ఆఫ్‌లైన్‌ ట్యూటర్స్‌

పార్ట్‌ టైమ్‌ ఉపాధి పరంగా మరో చక్కటి అవకాశం..ట్యూటర్స్‌గా పని చేయడం. సబ్జెక్ట్‌ నాలెడ్జ్‌తోపాటు దాన్ని ఎదుటి వారికి అర్థమయ్యే రీతిలో చెప్పగలిగే వ్యక్తీకరణ సామర్థ్యం ఉండాలి. ప్రస్తుతం హోంట్యూటర్స్, ఆన్‌లైన్‌ ట్యుటోరియల్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. కాబట్టి వీరు ఆన్‌లైన్, పార్ట్‌టైమ్‌ విధానాల్లో నెలకు రూ.20వేల వరకు సంపాదించుకునే అవకాశముంది. ముఖ్యంగా మ్యాథమెటిక్స్, సైన్స్‌ సబ్జెక్ట్‌లతో బీఎస్సీ, ఎమ్మెస్సీ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులు పార్ట్‌ టైమ్‌ విధానంలో ఆదాయం పొందడానికి ఇది చక్కటి మార్గం. ప్రస్తుతం ఎన్నో ఎడ్‌టెక్‌ స్టార్టప్‌ సంస్థలు ఆన్‌లైన్‌ ట్యూటర్స్‌కు స్వాగతం పలుకుతున్నాయి.

కాపీ రైటర్‌

పార్ట్‌ టైమ్‌ జాబ్స్‌ విభాగంలో టాప్‌ లిస్టింగ్‌లో ఉన్న కొలువు.. కాపీ రైటర్. సోషల్‌ నెట్‌వర్క్‌ వెబ్‌సైట్స్‌లో ఒక సంస్థకు సంబంధించిన ప్రొడక్ట్స్, సర్వీసెస్‌కు సంబంధించిన వివరాలను క్లుప్తంగా, ఎదుటివారిని ఆకట్టుకునే విధంగా రాయడం కాపీ రైటర్‌ ప్రధాన విధి. ప్రస్తుతం పలు సంస్థలు ఆన్‌లైన్‌ విధానంలో కాపీ రైటర్స్‌ను నియమించుకుంటున్నాయి. తొలుత ఒక నమూనా కాపీని అడుగుతున్న సంస్థలు..దానికి మెచ్చితే పని చేసే అవకాశం ఇస్తున్నాయి. టైమ్‌ రేట్, పీస్‌ రేట్‌ ప్రాతిపదికన రూ.800 నుంచి రూ.వేయి వరకు అందిస్తున్నాయి.

డేటాఎంట్రీ

టైపింగ్‌ స్కిల్స్, కంప్యూటర్‌ బేసిక్స్‌ ఉంటే.. ఆదాయం అందించే మరో పార్ట్‌ టైమ్‌ అవకాశం.. డేటాఎంట్రీ. బీపీఓ, కేపీఓ, మెడికల్‌ ట్రాన్స్‌క్రిప్షన్‌ వంటి సేవలు అందించే సంస్థలు తమ క్లయింట్లు పంపించే రికార్డ్‌లను ఎంట్రీ చేయడానికి శాశ్వత సిబ్బంది కంటే పార్ట్‌ టైమ్‌ లేదా ఆన్‌లైన్‌ విధానంలో నియమించుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇంగ్లిష్‌ టైప్‌ రైటింగ్‌ స్కిల్స్‌ ఉన్న అభ్యర్థులకు ఇది చక్కటి అవకాశం. పీస్‌ రేట్, టైమ్‌ రేట్‌ విధానంలో పారితోషికం లభిస్తోంది. పీస్‌ రేట్‌ విధానంలో ఒక్కో పదానికి రూ.2 నుంచి రూ.5 వరకు పొందొచ్చు. టైమ్‌ రేట్‌ విధానంలో గంటకు రూ.300 నుంచి వేయి వరకు సంపాదించుకునే అవకాశముంది.

యాడ్‌ పోస్టింగ్‌

ఒక ఉత్పత్తికి సంబంధించిన వివరాలను అడ్వర్టయిజ్‌మెంట్‌ రూపంలో తీర్చిదిద్ది కమర్షియల్‌ వెబ్‌సైట్స్‌లో పోస్ట్‌ చేయడమే..ఆన్‌లైన్‌ యాడ్‌ పోస్టింగ్. ఒక ఉత్పత్తికి సంబంధించిన ఫోటోలు, దానికి సంబంధించిన వివరణ, స్పెసిఫికేషన్స్‌ గురించి కూడా రాయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్‌ రైటింగ్‌ స్కిల్స్‌ ఉంటే.. ఈ పార్ట్‌టైమ్‌ జాబ్‌లో రాణించొచ్చు. ప్రస్తుతం మన దేశంలో ఆన్‌లైన్‌ యాడ్‌ పోస్టింగ్స్‌కు క్వికర్, ఓఎల్‌ఎక్స్‌ తదితర వెబ్‌సైట్స్‌ ప్రధాన ఆదాయ మార్గాలుగా నిలుస్తున్నాయి. ఒక్కో యాడ్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు పొందే వీలుంది.

ఫిట్‌నెస్‌ ఇన్‌స్ట్రక్టర్, ట్రైనర్‌

ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే ఆరోగ్య సమస్యలు రావనే ఆలోచనతో ఫిట్‌నెస్‌ కోసం మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇది కూడా యువతకు పార్ట్‌ టైమ్‌ ఆదాయ వనరుగా నిలుస్తోంది.జిమ్‌లు,ఫిట్‌నెస్‌ సెంటర్స్‌లో ఉపయోగించే పద్ధతుల గురించి అవగాహన ఉండటం తప్పనిసరి.ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కోర్సులు అభ్యసిస్తున్న వారికి ఈ విభాగం సరితూగుతుందని చెప్పొచ్చు.పార్ట్‌ టైమ్‌ విధానంలో ఫిట్‌నెస్‌ ఇన్‌స్ట్రక్టర్, ట్రైనర్‌గా రోజుకు రెండు,మూడు గంటల సమయం వెచ్చిస్తే రూ.500 వరకు సంపాదించొచ్చు.

సేల్స్‌ అసోసియేట్‌

ప్రతి రోజు నిర్దిష్టంగా ఒక సమయంలో.. స్టోర్స్‌లో సేల్స్‌ విభాగంలో పని చేసే వ్యక్తులనే పార్ట్‌ టైమ్‌ సేల్స్‌ అసోసియేట్స్‌గా పిలుస్తున్నారు. విధుల పరంగా సదరు అవుట్‌లెట్‌లోని స్టాక్‌ వివరాలు నమోదు చేయడం, కస్టమర్లకు సహకరించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ.. ఏ కోర్సు చదువుతున్న వారైనా రిటెయిల్‌ సేల్స్‌ అసోసియేట్‌గా పార్ట్‌ టైమ్‌గా పని చేయొచ్చు. సగటున నెలకు రూ.15 వేలు సంపాదించే వీలుంది.

క్యాబ్‌ డ్రైవర్స్‌

ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన మరో పార్ట్‌ టైమ్‌ ఆదాయ మార్గం.. క్యాబ్‌ డ్రైవర్స్‌గా పని చేయడం. ప్రస్తుతం పలు సంస్థలు ఆటోలు, క్యాబ్‌లు, టూ వీలర్‌ ద్వారా సర్వీసులను అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో వారికి రైడర్స్‌ కొరత ఏర్పడుతోంది. దీంతో పార్ట్‌ టైమ్‌ అవకాశాలకు సంస్థలు స్వాగతం పలుకుతున్నాయి. లైట్‌ మోటార్‌ వెహికిల్‌ లైసెన్స్‌తోపాటు, పదో తరగతి ఉండాలి. నెలకు రూ.15 వేల వరకు సంపాదించే అవకాశం ఉంది.

సోషల్‌ మీడియా అసిస్టెంట్‌

ప్రస్తుతం కార్పొరేట్‌ సంస్థలు తమ సర్వీసులు, ఉత్పత్తులకు సంబంధించి సమాచారాన్ని సోషల్‌ మీడియాలోనూ షేర్‌ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఆయా సర్వీసులు, ప్రొడక్టులకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్‌ఇన్‌ తదితరాల్లో వినియోగదారులను ఆకట్టుకునేలా రాయగలిగే నేర్పు ఉండాలి. సోషల్‌ మీడియా రైటింగ్‌పై అవగాహనతోపాటు,ఎస్‌ఈఓ, ఎస్‌ఈఎం, గ్రాఫిక్‌ డిజైనింగ్‌ వంటి అంశాల్లో నైపుణ్యం అవసరం. వీరు సోషల్‌ మీడియా అసిస్టెంట్స్‌గా పార్ట్‌ టైమ్‌ విధానంలో ఆదాయం పొందొచ్చు.

ఐటీ రంగంలోనూ

ఐటీ రంగంలో సైతం పార్ట్‌ టైమ్‌ జాబ్స్‌ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రధానంగా ప్రోగ్రామర్స్, ఫుల్‌ స్టాక్‌ డెవలపర్స్, మొబైల్‌ యాప్‌ డెవలపర్స్‌ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. టెక్నికల్‌ కోర్సులు చదువుతూ.. కోడింగ్, ప్రోగ్రామింగ్‌ నైపుణ్యాలున్న వారు వీటిని సొంతం చేసుకోవచ్చు. ఎంచుకున్న జాబ్‌ ప్రొఫైల్, ప్రాజెక్ట్‌ ఆధారంగా నెలకు రూ.20వేల వరకు ఆదాయం పొందే అవకాశముంది.

ఆన్‌లైన్‌ కన్సల్టెంట్‌

ఇటీవల కాలంలో కనిపిస్తున్న సరికొత్త ధోరణి..ఆన్‌లైన్‌ కన్సల్టెంట్. కంపెనీల్లో ఉన్నత స్థాయి వ్యూహాలు మొదలు ప్రోగ్రామింగ్, కోడింగ్‌ వరకూ.. ఆన్‌లైన్‌ విధానం వైపు మొగ్గు చూపుతున్న పరిస్థితి నెలకొంది.

అందుకునే మార్గాలివే

ప్రస్తుత టెక్‌ యుగంలో ఒక్క క్లిక్‌తో వందల ఉద్యోగాల సమాచారం అందించే వేదికలు అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో జాబ్‌ సెర్చ్‌ పోర్టల్స్‌ ప్రధానంగా నిలుస్తున్నాయి. వీటిలో ఏ స్థాయి ఉద్యోగం కావాలని కోరుకుంటున్నారో తెలియజేస్తే చాలు.. వాటికి సంబంధించిన సమాచారం, నిర్వర్తించాల్సిన విధులు, లభించే పారితోషికం, అవసరమైన నైపుణ్యాలు.. ఇలా అన్నీ ప్రత్యక్షమవుతున్నాయి. పలు మొబైల్‌ యాప్స్‌ కూడా పార్ట్‌టైమ్‌ జాబ్స్‌ వివరాలు అందిస్తున్నాయి.

క్లుప్తంగా

‘షార్’లో ప్రైవేట్ లాంచ్ ప్యాడ్

- దేశంలోనే తొలిసారిగా శ్రీహరికోటలో ప్రారంభం



రాకెట్ లాంచ్ ప్యాడ్, మిషన్ కంట్రోల్ సెంటర్లను ప్రారంభిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్–షార్ క్యాంపస్‌లో ఇస్రో ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా ప్రైవేట్ లాంచ్ ప్యాడ్, మిషన్ కంట్రోల్ సెంటర్‌ను ఈ నెల 25న ప్రారంభించినట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ సోమవారం తెలిపారు. అంతరిక్షయానం ప్రతి ఒక్కరికీ చేరువ కావాలనే ఉద్దేశం ఈ ప్రైవేట్ లాంచ్ ప్యాడ్‌తో సాకారమవుతుందన్నారు. అగ్నికుల్ (భారత అంతరిక్ష–టెక్ స్టార్టప్) అనే ప్రైవేట్ కంపెనీ ఈ లాంచ్ ప్యాడ్‌ను డిజైన్ చేసినట్లు వివరించారు. అలాగే, అగ్నికుల్ మిషన్ కంట్రోల్ సెంటర్‌ను కూడా షార్‌లో ప్రారంభించినట్లు చెప్పారు.

పాఠశాల విద్యా నియంత్రణ కమిషన్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యా నియంత్రణ పర్యవేక్షణ కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఇబ్రహీంపట్నంలోని కమిషన్ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఫీజులను నియంత్రించడంతో పాటు విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, పాఠశాల విద్యా సంచాలకులు ఎస్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫిష్ ఆంధ్ర’తో చేయూత

- రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పూనం మాలకొండయ్య



తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఫిష్ ఆంధ్ర మాల్’తో మత్స్యకారులకు చేయూత లభిస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి భరతమాత సెంటర్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘ఫిష్ ఆంధ్ర మాల్’ను పూనం మాలకొండయ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పూనం మాలకొండయ్య మాట్లాడుతూ ఈ ఉపాధి అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 232 మాల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డీఎఫ్‌వో రంగనాథన్‌బాబు పాల్గొన్నారు.

నేడు కేంద్ర పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ రాక

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) రూపకల్పన తీరును గ్రామస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ కార్యదర్శి ఎ.సాగర్ మంగళవారం రాష్ట్రానికి రానున్నారు. తొమ్మిది రకాల సుస్థిర అభివృద్ధి (ఎస్‌డీజీ) లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామాల వారీగా జీపీడీపీ ప్రణాళిక రూపకల్పనపై ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ శిక్షణ సంస్థ (ఏపీ ఎస్‌ఐఆర్‌డీ) ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ పాల్గొననున్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు పీఎం యశస్వి స్కాలర్‌షిప్





సాక్షి, అమరావతి: శ్రీచైతన్య విద్యార్థులు ఇద్దరు ‘ప్రధానమంత్రి యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా’ (పీఎంవైఏఎస్‌ఏఎస్‌వీఐ–పీఎంయశస్వి) స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ద్వారా నిర్వహించిన ప్రవేశపరీక్షలో సఖినేటిపల్లిలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి భీమాల సిరిల్ ఈడబ్ల్యూఎస్ విభాగంలోను, రాజమహేంద్రవరంలోని శ్రీచైతన్య స్కూల్ ఐపీఎల్ బ్రాంచి విద్యార్థి ఎ.చైతన్యరామ్ ఓబీసీ విభాగంలోను స్టేట్ ఫస్ట్‌ర్యాంకులు సాధించారు. వీరికి కేంద్రప్రభుత్వం సంవత్సరానికి రూ.1.25 లక్షల వంతున స్కాలర్‌షిప్ ఇస్తుంది. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను, అధ్యాపకులను శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ అభినందించారు.



పార్వతీపురం మన్యం జిల్లా కొట్టు గ్రామంలో సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పట్టణం చర్చిపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు

గడప గడపకూ మన ప్రభుత్వం



కృష్ణా జిల్లా వణుకూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను స్థానికులకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



అనంతపురం జిల్లా కొట్టాలపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాష్ట్రానికి 630 పీజీ వైద్యసీట్లు

- 11 మెడికల్ కాలేజీలకు కొత్త సీట్లు
- అత్యధికంగా ఆంధ్రా మెడికల్ కాలేజీకి 128
- అత్యల్పంగా నెల్లూరు మెడికల్ కాలేజీకి 5 సీట్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో పీజీ వైద్య సీట్ల పంట పండింది. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ప్రభుత్వం ఒకేసారి 630 పీజీ వైద్య సీట్లను తెచ్చింది. ఈమేరకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అండర్ సెక్రటరీ చందన్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ సర్కారుకు అనుమతిస్తూ లేఖ రాశారు. ఈ మేరకు ఎంవోయూ పంపిస్తున్నామని, దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలేజీల వారీగా ఎంవోయూకు ఆమోదం తెలపాలని సూచించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యకళాశాలలు పీజీలు, సీనియర్ రెసిడెంట్‌లతో కళకళలాడనున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయి. ఆయా కాలేజీలు రెండునెలల కిందట సెంట్రల్ స్పాన్సర్‌షిప్ కింద 688 సీట్లకు ప్రతిపాదన పంపించాయి. ఈ ప్రతిపాదనలు పరిశీలించిన కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ 630 పీజీ వైద్యసీట్లకు ఆమోదముద్ర వేసింది.

భారీగా నియామకాలు చేసినందునే..

రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా కనివినీ ఎరుగని రీతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరిపినందునే పీజీ సీట్లు మంజూరు చేసినట్టు నిపుణులు చెబుతున్నారు. గత మూడున్నరేళ్లలో దాదాపు 455 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించారు. 2,500 మందికిపైగా పారామెడికల్ సిబ్బందిని నియమించారు. దీంతోపాటు నాడు–నేడులో భాగంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇవన్నీ చేయడం వల్లనే కేంద్రం కొత్త పీజీ వైద్యసీట్లకు ఆమోదముద్ర వేసింది. తాజాగా మంజూరైన సీట్లలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్ ఇలా సుమారు 18 విభాగాలకు సంబంధించిన పీజీ వైద్యసీట్లు ఉన్నాయి. అత్యధికంగా ఆంధ్రా మెడికల్ కళాశాలకు 128 సీట్లు రాగా అత్యల్పంగా నెల్లూరు మెడికల్ కాలేజీకి 5 సీట్లు వచ్చాయి.

కాలేజీల వారీగా కొత్తగా వచ్చిన పీజీ సీట్లు

కాలేజీ	సీట్లు
ఏఎంసీ, విశాఖ	128
జీఎంసీ, ఒంగోలు	79
ఎస్వీఎంసీ, తిరుపతి	75
సిద్ధార్థ, విజయవాడ	71
జీఎంసీ, కడప	69
జీఎంసీ, అనంతపురం	65
ఆర్ఎంసీ, కాకినాడ	46
కేఎంసీ, కర్నూలు	41
జీఎంసీ, గుంటూరు	34
జీఎంసీ, శ్రీకాకుళం	17
ఏసీఎస్ఆర్, నెల్లూరు	05



సూపర్ స్పెషాలిటీ సేవలు

కొత్తగా పీజీ వైద్యసీట్లతో పాటు సూపర్ స్పెషాలిటీ సీట్లు కూడా వచ్చాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా కొత్తగా సీట్లొచ్చాయి. దీనివల్ల సామాన్యులకు స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ పరిధిలో సీట్లు పెరగడం పేద వైద్యవిద్యార్థులకూ మంచి పరిణామం.
– డాక్టర్ హరిచరణ్, వైస్ ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ

నేవీ రిహార్సల్స్.. అదరహో!



త్రివర్ణ పతాకాన్ని, తలపించేలా..



సముద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్‌ద్వారా రక్షిస్తూ..

సాక్షి, విశాఖపట్నం: సముద్రాన్ని చీల్చుకుంటూ సాగిపోతున్న హైస్పీడ్ బోట్లు..వినీలాకాశంలో చక్కర్లు కొడుతూ భువి నుంచి సాగర జలాల్లోకి త్రివర్ణ పతాకంతో దిగివచ్చిన స్కై డైవర్లు.. శత్రు స్థావరాలపై మెరైన్ కమాండోల ఆకస్మిక దాడులు..రివ్వున దూసుకొచ్చి.. శత్రు నౌకలపై దాడి చేసి మెరుపు వేగంతో వెళ్లిపోయిన సీ కింగ్ హెలికాప్టర్లు..ఇలా..కళ్లు చెదిరే విన్యాసాలతో కదన రంగాన్ని తలపించే వాతావరణంతో ఆర్‌కే బీచ్ వేడెక్కింది. నేవీ డే ఉత్సవాల్లో భాగంగా తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లో చేపట్టిన ప్రధాన రిహార్సల్స్ అబ్బుర పరిచాయి. జెమినీ బోట్లలో దూసుకువచ్చిన నౌకాదళ విన్యాసాలు బీచ్ సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. డిసెంబర్ 4న నేవీ డే సందర్భంగా సాగర జలాల్లో నేవీ సిబ్బంది ఏటా విన్యాసాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా వారం రోజుల ముందు నుంచే రిహార్సల్స్ చేస్తుంటారు. తుది రిహార్సల్స్ డిసెంబర్ 2న నిర్వహించేందుకు అవకాశాలున్నట్లు తూర్పు నౌకాదళవర్గాలు వెల్లడించాయి.

ఇద్దరు ఏపీ శిల్పులకు శిల్పగురు అవార్డులు

- ఇద్దరు ఏపీ, ఒక తెలంగాణ హస్తకళాకారుడికి జాతీయ అవార్డు



ఉపరాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులురెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/శ్రీకాళహస్తి: భారతీయ హస్త కళలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన ఇద్దరు ఏపీ, ఒక తెలంగాణ వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం శిల్పగురు అవార్డులు అందజేసింది. సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ దినకర్ చేతుల మీదుగా ఈ అవార్డులు అందజేసినట్లు టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ అవార్డులో భాగంగా వారికి బంగారు నాణెం, రూ.2లక్షల నగదు, తామ్రపత్రం, శాలువా ప్రశంసాపత్రం అందజేసినట్లు తెలిపింది. 2017, 2018, 2019 సంవత్సరాలకు గానూ 30 మంది శిల్ప గురువులను ఎంపిక చేయగా, ఏపీ నుంచి బ్లాక్‌మేకింగ్‌లో కొండ్ర గంగాధర్(2018), కలంకారిలో శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారానికి చెందిన వేలాయుధం శ్రీనివాసులురెడ్డి (2019)లను ఎంపిక చేసినట్లు పేర్కొంది. శ్రీనివాసులురెడ్డి శ్రీచక్రంలోని దేవతా సమూహానికి తన కలంకారి చిత్రంతో అద్భుత రూపం ఇచ్చారు. 2017, 2018, 2019లో జాతీయ అవార్డులకు గానూ 78 మంది హస్త కళాకారులను ఎంపిక చేసినట్లు తెలిపింది. ఏపీ నుంచి అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన దాలవాయి కుళాయప్ప (లెదర్ పప్పెట్రీ, 2017), డి.శివమ్మ (లెదర్ పప్పెట్రీ, 2019)లను అవార్డు అందజేసినట్లు పేర్కొంది.

ఇతర రాష్ట్రాల క్షతగాత్రులకూ ఆరోగ్యశ్రీలో చికిత్స

- మార్గదర్శకాలను జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ఏపీలో రోడ్డు ప్రమాదానికి గురైన ఇతర రాష్ట్రాల వ్యక్తులకూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందనుంది. రాష్ట్రంలో ఏటా రోడ్డు ప్రమాదాల కారణంగా 8,000 మందికి పైగా మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాలు, మరణాలను 15 శాతం తగ్గించాలని ఈ ఏడాది ఫిబ్రవరి 14న సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన ఏపీ రోడ్ సేఫ్టీ కౌన్సిల్ మీటింగ్‌లో నిర్ణయించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదానికి గురవుతోన్న ఇతర రాష్ట్రాలకు చెందిన డ్రైవర్‌లు, రోజువారీ కూలీలు, ప్రయాణికులకు నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కింద ఇతర రాష్ట్రాల రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్సలు అందించేలా చూడాలని సూచించారు. ఈ మేరకు రవాణా శాఖ కమిషనర్ పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఆరోగ్యశ్రీ కింద ఇతర రాష్ట్రాల రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత చికిత్స అందించడానికి వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇకపై రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలకు గురయ్యే ఇతర రాష్ట్రాల వ్యక్తులకు సీఎంసీవో కార్డును జారీ చేయడం ద్వారా నగదు రహిత చికిత్సను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అందించనుంది. ఇందుకోసం అవసరమైన చర్యలను చేపట్టాలని ఆరోగ్యశ్రీ సీఈవో, రవాణా శాఖ కమిషనర్‌లను ఆదేశించారు.

‘సంకల్ప సిద్ధి’ కేసులో ఐదుగురి అరెస్ట్

- మనీ సర్క్యులేషన్, మల్టీ లెవల్ మార్కెటింగ్‌తో మోసాలు
- ఆంధ్ర, తెలంగాణలో రూ.170 కోట్లు సేకరణ
- రూ.51లక్షల నగదు, బ్యాంకు ఖాతాలు, ఆస్తులు సీజ్
- డిపాజిట్‌దారులు అధైర్యపడొద్దు
- ఈ మోసాలతో ప్రజాప్రతినిధుల ప్రమేయం లేదు
- ఎన్టీఆర్ జిల్లా సీపీ టీకే రాణా వెల్లడి

సాక్షి, విజయవాడ ప్రతినిధి: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ‘సంకల్ప సిద్ధి’ కేసులో ఐదుగురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ సంస్థకు చెందిన ఐదు బ్యాంకు ఖాతాలను, 14 ప్రాంతాల్లోని ఆస్తులను, విలువైన డాక్యుమెంట్‌లను సీజ్ చేశారు. ఈ కేసు వివరాలను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా సోమవారం వెల్లడించారు. ‘సంకల్ప సిద్ధి ఈ–కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను గుత్తా వేణుగోపాల్, అతని సోదరుడు గుత్తా కిషోర్ ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ పేరుతో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి అనుమతి తీసుకున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆన్‌లైన్ వెబ్ పోర్టల్, యాప్‌ను రూపొందించారు. ఈ కంపెనీలో కొందరు డైరెక్టర్‌లను చేర్చుకుని చట్టవిరుద్ధంగా మనీ సర్క్యులేషన్ స్కీం, మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు తెరతీశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రతి జిల్లాకు ఒక కో–ఆర్డినేటర్‌ను నియమించుకుని ఐదు ఆకర్షణీయమైన పథకాలతో ప్రజల నుంచి రూ.170 కోట్ల వరకు వసూలు చేశారు. ఈ మొత్తంలో కొంత నగదును డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించారు. గత 15 రోజులుగా విత్‌డ్రాలు నిలిచిపోవడంతో ఐదుగురు ఫిర్యాదు చేశారు. ఐదు ప్రత్యేక బృందాలతో విచారణ నిర్వహించాం. ఆర్‌బీఐ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నిబంధనలకు వ్యతిరేకంగా ఈ మోసానికి పాల్పడ్డారని గుర్తించాం.’ అని సీపీ వెల్లడించారు.

అరెస్టయినవారు వీరే...

‘ప్రాథమిక విచారణ అనంతరం కంపెనీ సీఎండీలు గుత్తా వేణుగోపాలకృష్ణ (విజయవాడ), గుత్తా కిషోర్ (బళ్లారి, కర్ణాటక), డైరెక్టర్‌లు గంజాల లక్ష్మి, మావూరి వెంకటనాగలక్ష్మి (విజయవాడ), సయ్యద్ జాకీర్‌హుస్సేన్ (గుంటూరు)ను అరెస్ట్ చేశాం. మరో ముగ్గురిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. అరెస్ట్ చేసినవారిపై విజయవాడ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఐదు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశాం. వారి నుంచి రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్లు, 728 గ్రాముల బంగారం, 10.5 కేజీల వెండి, రూ.51 లక్షల నగదు, నాలుగు కంప్యూటర్లు, ఒక ల్యాప్‌టాప్, రికార్డులను స్వాధీనం చేసుకున్నాం. ఎంత వసూలు చేశారు, ఎంత మేరకు మోసానికి పాల్పడ్డారనేది పూర్తిస్థాయి దర్యాప్తులో తేలుతుంది. ఆ సంస్థ ఆస్తులు, సీజ్ చేసిన బ్యాంకు ఖాతాల్లోని నగదు వివరాలను రాష్ట్ర హోం శాఖకు, న్యాయస్థానానికి తెలియజేస్తాం. న్యాయస్థానం ఆదేశాల మేరకు మోసపోయిన డిపాజిట్‌దారులకు నగదు చెల్లిస్తాం. ఈ మోసంతో గానీ, సంస్థ నిర్వాహకులతో గానీ రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు ఎలాంటి సంబంధం లేదు. కేవలం ఐదో తరగతి మాత్రమే చదివిన గుత్తా వేణుగోపాలకృష్ణ 1998లో క్వాంటమ్ మనీ సర్క్యులేషన్ స్కీంలో చేరాడు. ఆ తర్వాత మరి కొన్ని సంస్థలలో చేరి మనీ సర్క్యులేషన్, మల్టీలెవల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకుని హైదరాబాద్‌లో సొంతగా ప్లాంట్ ఎన్‌రిచ్ ఎంటర్‌ప్రైజస్ సంస్థను ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత విజయవాడ వచ్చి సంకల్ప సిద్ధి ఈ–కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించాడు.’ అని సీపీ రాణా వివరించారు.

ఫిబ్రవరి 13 నుంచి ఏరో ఇండియా షో

బనశంకరి: ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శనగా పేరుగాంచిన బెంగళూరు ఏరో ఇండియా షో 2023, ఫిబ్రవరి 13 నుంచి 17వ తేదీ వరకు యలహంకలోని వాయుసేన స్థావరంలో నిర్వహించనున్నట్లు సోమవారం కేంద్ర రక్షణ శాఖ ప్రకటించింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ వేడుకలో దేశ విదేశాల నుంచి రక్షణ, పౌర విమానయాన సంస్థలు పాల్గొంటాయి. తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయి. ప్రపంచ దేశాలు తమ రక్షణ సామర్థ్యాన్ని చాటడానికి ఇదొక వేదిక కానుంది. గత రెండేళ్లుగా కరోనా వల్ల పరిమిత స్థాయిలోనే ఏరో ఇండియా షో నిర్వహించారు. ఈసారి కరోనా తగ్గుముఖం పట్టినందున గతంలో మాదిరిగానే భారీ ఎత్తున జరపనున్నట్లు వాయుసేన అధికారులు తెలిపారు.

పోలీస్ అవుదాం.. రండి

▶ మొదటి పేజీ తరువాయి

వేర్వేరుగా ప్రిలిమినరీ రాతపరీక్ష, శరీరదారుఢ్య పరీక్షలు, ఫైనల్ రాతపరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పోస్టుల భర్తీలో రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తారు. హోంగార్డులకు తొలిసారిగా కానిస్టేబుల్ పోస్టుల్లో రిజర్వేషన్ కల్పించడం విశేషం. సివిల్ కానిస్టేబుల్ పోస్టుల్లో 8% నుంచి 15%, ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టుల్లో 10% నుంచి 25% హోంగార్డులకు రిజర్వేషన్ కల్పించారు.

- అభ్యర్థుల అర్హతలు, వయో పరిమితి మినహాయింపులు, దరఖాస్తు ఫీజు, రాతపరీక్షల విధానం, శరీరదారుఢ్య పరీక్షల ప్రమాణాలు, ఇతర వివరాల కోసం ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ https:// slprb.ap.gov.in చూడాలని బోర్డు సూచించింది.
- అభ్యర్థులు ఏమైనా సందేహాలుంటే రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయాన్ని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించవచ్చని తెలిపింది. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9441450639

పూర్తి పారదర్శకంగా నియామక ప్రక్రియ నిర్వహిస్తాం

పోలీసు ఉద్యోగాల భర్తీప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తాం. 2023 జూన్ చివరినాటికి ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి అభ్యర్థులకు శిక్షణ ప్రారంభించాలని నిర్ణయించాం. దీంతో 2024 ఫిబ్రవరి నాటికి పోలీసు శాఖలో పోస్టింగులు ఇవ్వొచ్చు. ఏటా ఇదేరీతిలో పోలీసు ఉద్యోగాలు భర్తీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. – కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీపీ

ఎస్‌ఐ ఉద్యోగాలు

మొత్తం పోస్టులు:	ఎస్‌ఐ సివిల్:	ఎస్‌ఐ ఏపీఎస్పీ:
411	315	96

- దరఖాస్తులు: 2022 డిసెంబర్ 14 నుంచి 2023 జనవరి 18 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు.
- హాల్‌టికెట్లు: రాతపరీక్ష కోసం అభ్యర్థులు 2023 ఫిబ్రవరి 5వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ప్రిలిమినరీ రాతపరీక్ష: 2023 ఫిబ్రవరి 19న నిర్వహిస్తారు.
- పేపర్–1: ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. అర్థమెటిక్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీకి సంబంధించిన ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు రాతపరీక్ష నిర్వహిస్తారు.
- పేపర్–2: మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు. జనరల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు రాతపరీక్ష నిర్వహిస్తారు.
- శరీరదారుఢ్య పరీక్షలు: ప్రిలిమినరీ రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శరీరదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు.
- ఫైనల్ రాతపరీక్ష: శరీరదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఫైనల్ రాతపరీక్ష నిర్వహిస్తారు.
- పేపర్–1: ఇంగ్లిష్ (డిస్క్రిప్టివ్ విధానంలో)
- పేపర్–2: తెలుగు/ఉర్దూ (డిస్క్రిప్టివ్ విధానంలో)
- పేపర్–3: అర్థమెటిక్ (ఆబ్జెక్టివ్ విధానంలో)
- పేపర్–4: జనరల్ స్టడీస్ (ఆబ్జెక్టివ్ విధానంలో)



ఎస్‌ఐ ఏపీఎస్పీ పోస్టులకు:

పేపర్–1, పేపర్–2ల్లో అర్హత మార్కులు సాధించిన అభ్యర్థులు పేపర్–3 (గరిష్టంగా 100 మార్కులు), పేపర్–4 (గరిష్టంగా 100 మార్కులు), శరీరదారుఢ్య పరీక్ష (100 మార్కులు) కలిపి మొత్తం 300 మార్కులకుగాను సాధించిన మార్కుల ప్రాతిపదికన తుది ఎంపిక నిర్వహించి పోస్టులు భర్తీచేస్తారు.

ఎస్‌ఐ సివిల్ పోస్టులకు:

పేపర్–1, పేపర్–2ల్లో అర్హత మార్కులు సాధించిన అభ్యర్థులు పేపర్–3 (గరిష్టంగా 200 మార్కులు), పేపర్–4 (గరిష్టంగా 200 మార్కులు) మొత్తం 400 మార్కులకుగాను సాధించిన మార్కుల ప్రాతిపదికన తుది ఎంపిక నిర్వహించి పోస్టులు భర్తీచేస్తారు.

పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు

మొత్తం పోస్టులు:	కానిస్టేబుల్ సివిల్:	కానిస్టేబుల్ ఏపీఎస్పీ:
6,100	3,580 (పురుషులు, మహిళలు)	2,520 (పురుషులు)

- దరఖాస్తులు: 2022 నవంబరు 30 నుంచి 2022 డిసెంబర్ 28 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు.
- హాల్ టికెట్లు: రాతపరీక్ష కోసం అభ్యర్థులు 2023 జనవరి 9వ తేదీ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ప్రిలిమినరీ రాతపరీక్ష: 2023 జనవరి 22న ఒక పేపర్ ఉంటుంది. ఇంగ్లిష్, అర్థమెటిక్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, భారతదేశ చరిత్ర, భారతీయ సంస్కృతి, భారత జాతీయోద్యమం, భారత జాగ్రఫీ, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టుల్లో 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో రాతపరీక్ష నిర్వహిస్తారు.
- శరీరదారుఢ్య పరీక్షలు: రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శరీరదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. కానిస్టేబుల్ సివిల్ అభ్యర్థులకు 1,600 మీటర్ల పరుగుతోపాటు 100 మీటర్ల పరుగుగానీ లాంగ్ జంప్‌లో గానీ పరీక్షిస్తారు. కానిస్టేబుల్ ఏపీఎస్పీ అభ్యర్థులకు 1,600 మీటర్ల పరుగుతోపాటు 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ విభాగాల్లో పరీక్షిస్తారు.
- ఫైనల్ రాతపరీక్ష: శరీరదారుఢ్య పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు ఫైనల్ రాతపరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్, అర్థమెటిక్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, భారతదేశ చరిత్ర, భారతీయ సంస్కృతి, భారత జాతీయోద్యమ చరిత్ర, ఇండియన్ జాగ్రఫీ, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టుల్లో 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది.
- కానిస్టేబుల్ సివిల్ పోస్టులకు ఫైనల్ రాతపరీక్ష (గరిష్టంగా 200 మార్కులు)లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- కానిస్టేబుల్ ఏపీఎస్పీ పోస్టులకు ఫైనల్ రాతపరీక్ష (గరిష్టంగా 100 మార్కులు), శరీరదారుఢ్య పరీక్ష (గరిష్టంగా 100 మార్కులు)ల్లో సాధించిన మార్కులు కలిపి మొత్తం 200 మార్కులకు సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.